www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 235 | గురువారం 15-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



రూ.11,400 కోట్ల మోసం!

పీఎన్‌బీ ముంబై బ్రాంచ్‌లో భారీ కుంభకోణం

- బీఎస్‌ఈ ఫైలింగ్‌లో బ్యాంకు ప్రకటన
- వజ్రాల వ్యాపారి మోడీ, ఆభరణాల కంపెనీపై సీబీఐకి ఫిర్యాదు
- 10 మంది ఉద్యోగుల సస్పెన్షన్

ముంబై : ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రెండో అతిపెద్ద బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ముంబై బ్రాంచీలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఒక్క ఈ బ్రాంచిలోనే దాదాపు రూ.11,400 కోట్ల మేర మోసం జరిగినట్లు గుర్తించామని బ్యాంకు వెల్లడించింది. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు బ్యాంకింగ్ సెక్రటరీ వెల్లడించారు. డైమండ్ మెర్చంట్ నీరవ్ మోడీ, ఆయన కుటుంబ సభ్యులు, బిజినెస్ పార్టనర్ మెహల్ చౌక్సీ, మరో బంగారు ఆభరణాల కంపెనీ ఈ కుంభకోణానికి పాల్పడినట్లు బ్యాంకు తెలిపింది. ఇప్పటికే రూ.280 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో మోడీపై దర్యాప్తు జరుగుతోంది. ఈ కుంభకోణంలో భాగంగా 10 మంది ఉద్యోగులను పీఎన్‌బీ సస్పెండ్ చేసినట్లు బ్యాంకింగ్ సెక్రటరీ రాజీవ్ కుమార్ తెలిపారు. దీనిపై లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ సీబీఐ విచారణ చేపట్టింది. మొండి బకాయిలను గుర్తించడానికి ఈ విచారణ సహకరిస్తుందని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. బ్యాంకు బ్రాంచ్‌లో కుంభకోణం వార్తల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు భారీగా పడిపోయింది. ఈ బ్యాంకు షేరు బుధవారం దాదాపు 6 శాతం క్షీణించింది. తన బ్యాంకులో దాదాపు రూ.11,400 కోట్లకు పైగా విలువైన మోసపూరిత లావాదేవీలను గుర్తించినట్టు పంజాబ్ నేషనల్ బ్యాంకు బీఎస్‌ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. "బ్యాంకు ముంబై బ్రాంచ్‌లో అనేక మోసపూరితమైన, అనధికారిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించాం. ఎంపిక చేసిన కొంత మంది ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఇలా చేసినట్లు తెలుస్తోంది. ఆ విధమైన లావాదేవీల

- మిగతా 2 లో

ఏపీకి భారీ కాగిత పరిశ్రమ

ముందుకొచ్చిన ఆసియా పల్ప్ పేపర్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన కాగిత తయారీ సంస్థ 'ఆసియా పల్ప్ పేపర్' రాష్ట్రంలో అడుగు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ను కలిసిన ఏపీపీ ప్రతినిధులు భారతదేశంలోనే అతిపెద్ద కాగిత తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు. ముడిపదార్థాల దిగుమతి కి, చైనా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఏపీలో తమ సంస్థను నెలకొల్పాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఇందుకోసం ఏదైనా నౌకా తీరానికి సమీపంలో రెండున్నర వేల ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. ముఖ్యమంత్రి దీనికి సానుకూలంగా స్పందిస్తూ కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టు పరిసరప్రాంతాలను పరిశీలించాల్సిందిగా సూచించారు. తమకు భూమిని కేటాయించిన రెండున్నరేళ్లలోనే ఉత్పత్తిని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రికి ఏపీపీ ప్రతినిధులు వివరించారు. రోజుకు సరాసరి 4 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ పరిశ్రమను నెలకొల్పుతామని ఇందులో నాలుగో వంతు దేశీయ విపణికే కేటాయిస్తామన్నారు.

'బేయర్' రాకతో రైతుకు దన్ను

జర్మనీకి చెందిన బేయర్ ఆగ్రో కెమికల్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రైతులకు పంట రక్షణ, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, డిజిటల్ ఫార్మింగ్ వంటి అంశాలలో సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రితో తమ ప్రతిపాదనలు

- మిగతా 2 లో

హోదాపై పోరు ఉద్యమం

ఏపీకి బీజేపీ, టీడీపీ ద్రోహం

- 18న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం
- 24న విశాఖలో భారీసభ
- దళితులపై దాడులకు నిరసనగా 23న చలో గుంటూరు
- మార్చి 6న పార్లమెంటు ఎదుట వామపక్ష పార్టీల ధర్నా
- సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, మధు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన మధు, ముప్పాళ్ల, వై.వెంకటేశ్వరరావు, పీవీ సుందరరామరాజు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం వామపక్ష పార్టీల ఆధ్వర్యాన అన్ని ప్రజాసంఘాలను కలుపుకుని దశలవారీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు వెల్లడించారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు గుర్రం విజయ్‌కుమార్ ఆధ్యక్షతన 10 వామపక్ష పార్టీల నేతలు సమావేశం అయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలను నిరసిస్తూ ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించాయి. అనంతరం విలేకరుల సమావేశంలో వామపక్ష పార్టీల నేతలతో కలిసి రామకృష్ణ మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో మోడీ, చంద్రబాబు మాట తప్పారని, రాష్ట్ర ప్రజలను మోసగించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలోని 10 వామపక్ష పార్టీలు ఉద్యమ కార్యాచరణను రూపొందించాయని వివరించారు. ఈ ఉద్యమంలో భాగంగా అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలను కలుపుకుని ముందుకు పోతామని స్పష్టం చేశారు. ఈ నెల 18న విజయవాడలో ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన సమితి ఆధ్వర్యాన జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని చెప్పారు. గొట్టిపాడులో దళితులపై పెత్తందారుల దాడుల్ని నిరసిస్తూ ఈ నెల 23న చలో గుంటూరు కార్యక్రమం ఉంటుందని, రాష్ట్రంలోని దళిత, బహుజన సంఘాలతో కలిసి గుంటూరులో వేలాది మందితో భారీ నిరసన సభను నిర్వహించనున్నామని చెప్పారు. విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఈ నెల 24న విశాఖలో భారీ సభకు కార్యాచరణ రూపొందించామన్నారు. మార్చి 6వ తేదీన వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఢిల్లీలో పార్లమెంటు ముందు నిరసన

- మిగతా 2 లో



వినతిపత్రాన్ని విడుదల చేస్తున్న అపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణారావు

కృష్ణాబోర్డు నిర్వహణలోనే ఎన్‌ఎస్‌పీ

- తెలంగాణ నిర్వహణతో రాష్ట్రానికి అన్యాయం
- 15 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సమస్య
- కేంద్ర జలవనరుల శాఖకు నీటి సంఘాల వినతి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్‌ఎస్‌పీ) నిర్వహణను కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర సాగునీటి సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి ఉపేంద్ర ప్రసాద్ సింగ్‌కు ఈ - మెయిల్ ద్వారా వినతిపత్రాన్ని పంపించినట్లు వారు తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తక్షణమే దీనిని అమలులోకి తీసుకురావాలన్నారు. జలవనరులశాఖ అపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు చైర్మన్ వై పుల్లయ్య చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెండ్ల చెన్న కేశవరావు కేంద్ర ప్రభుత్వానికి పంపించిన వినతిపత్రాన్ని విజయవాడలోని జలవనరులశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ నెల 15న ఢిల్లీలో కృష్ణా బోర్డు సమావేశం జరగనున్న

- మిగతా 2 లో

నేటి నుంచి ప్రీ బడ్జెట్ సమావేశాలు

విశాలాంధ్ర-అమరావతి : 2018-19 బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన గురువారం నుండి మూడు రోజుల పాటు వివిధ శాఖల మంత్రులు, అధికారులతో ప్రీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తొలి రోజు ఆర్థిక నిపుణులతో సమావేశాలు ప్రారంభమవుతాయి. 15వ తేదీన వ్యవసాయం, మార్కెటింగ్, పౌరసరఫరాలు, పట్టణాభివృద్ధి, రవాణా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, శిశు సంక్షేమ, కార్మిక శాఖల మంత్రులు,

- మిగతా 2 లో

ఇదీ లోకం!





'టెట్'పై నిర్లక్ష్యం

- హాల్‌టికెట్లలో తప్పిదాలు
- ఆన్‌లైన్ పరీక్షపై చేతులెత్తేసిన నిర్వాహకులు
- అధికారులపై మంత్రి గంటా ఫైర్
- నేడు విజయవాడలో సమీక్షా సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)కు ఆటంకాలు కొనసాగుతూనే ఉన్నాయి. మరో వారం రోజుల్లో పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ సమయంలో అభ్యర్థుల హాల్‌టికెట్లలో తప్పిదాలు, ఇతర రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాల మార్పు తదితర తప్పిదాలపై ఫిర్యాదులు పునరావృతమవుతున్నాయి. దీనిపై మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న

- మిగతా 2 లో

ఎన్నికల కమిషనర్ల వేతనాలు రెట్టింపు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల తర్వాత ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సుమారు రెండింతలు పెరిగిన వేతనాన్ని అందుకుంటారు. 'దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో సహా ముగ్గురు ఎన్నికల కమిషనర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి వేతనానికి సమానంగా వేతనాన్ని కలిగి ఉంటారు' అని వారి సర్వీసు నిబంధనల చట్టం పేర్కొంది. జనవరి 25న సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల వేతనాల పెంపు చట్టాన్ని ప్రభుత్వం నోటిఫై చేసిన తర్వాత, ఎన్నికల కమిషన్ కూడా దానినే స్వీకరించినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ముగ్గురు కమిషనర్లు ప్రస్తుతం సుప్రీంకోర్టు, హైకోర్టు

- మిగతా 2 లో

అప్పులతోనే అభివృద్ధి!

నిధుల కొరతతో సతమతం అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం అప్పలతోనే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది. దీనిలో భాగంగానే హామ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం అరువు తెచ్చుకున్న ఈ విధానాన్ని అన్ని ముఖ్య రంగాలకు విస్తరించనుంది. విద్య, తాగునీటి రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటికే ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది.

- పనులన్నీ 'హామ్' విధానంలోనే
- చిన్న కాంట్రాక్టర్లు కనుమరుగు
- బడా కాంట్రాక్టర్లు, కంపెనీలకు కాసుల పండుగ
- పరిశీలనలో యూజర్ ఛార్జీల వసూలు?



విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు మరో ఏడాదిలో జరగనున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనను వేగమంతం చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అయితే దీనికి నిధుల కొరత ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు హామ్ (హైబ్రిడ్ ఏన్యుటీ మోడ్) విధానానికి శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారుల నిర్మాణంలో గతంలో అవలంబించిన బీఓటీ (బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్)కు మరో రూపమే ఈ హామ్ విధానం. ఇంతకుముందు ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) విధానానికి దాదాపు పోలిఉండే ఈ హామ్ పద్ధతి వల్ల బడా కాంట్రాక్టర్లకు, కంపెనీలకు కాసుల పండగే. ప్రాజెక్టు ఖరీదులో 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఐదు స్థాయిల్లో మంజూరు చేస్తుంది. మిగిలిన 60 శాతం మొత్తాన్ని ఆ కాంట్రాక్టరు బ్యాంకుల నుంచి రుణం

- మిగతా 2 లో



ఎమ్మెల్యే 'చింతమనేని'కి మూడేళ్ల జైలు, బెయిల్

3లో

సముద్ర స్నానాల్లో అపశృతి

ఇద్దరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

3లో

నకి'లీలలు'..

- అర్హత లేకున్నా వైద్యశాలల ఏర్పాటు
- విజిలెన్స్ దాడులతో బట్టబయలు
- వైద్యశాల సీజ్- నకిలీ డాక్టర్ అరెస్టు

11లో

షుల్జ్ రాజీనామా



బెర్లిన్ : జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షుడు మార్టిన్ షుల్జ్ తన రాజీనామాను ప్రకటించాడు. ఎలాంటి వ్యతిరేకత, అనమ్మతి లేకుండా తాను రాజీనామా చేస్తున్నానని చెప్పారు. జర్మనీలో షుల్జ్ పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదిరిన నేపథ్యంలో షుల్జ్‌ని పార్లమెంటరీ గ్రూపు నాయకుడుగా ఎన్నుకుమారు. దీంతో ఆయన పార్టీ పదవికి రాజీనామా చేశారు.పార్టీ నూతన అధ్యక్షుడుగా ఆండ్రియా నెహెల్స్ ఎన్నికయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆమె పార్టీ ఛైర్మన్‌గా ఎన్నికైతే 150 ఏళ్ల చరిత్ర కలిగిన పార్టీకి మొదటి మహిళా ఛైర్మన్ అవుతారు.

రాజ్యాంగ కమిటీకి సిరియా నో



డమాస్కస్ : సోచీ నగరంలో సిరియా సమస్యపై చర్చలు గతనెలలో జరిగాయి. ఈనేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ఐరాజ్యాంగ కమిటీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నది. అయితే సిరియా ప్రభుత్వం ఈ కమిటీని అంగీకరించబోమని తిరస్కరించింది. సిరియా విదేశాంగ సహాయమంత్రి వలీద్‌అల్‌మొలెం విలేకరులతో మాట్లాడుతూ సోచీలో జరిగిన చర్చల ఫలితాలనికి తమ ప్రభుత్వం కట్టుబడివుంటుందని అన్నారు. సోచీ సమావేశానికి హాజరైన వారితో కూడా రాజ్యాంగ కమిటీకి తమకు అభ్యంతరం లేదన్నారు. ఐక్యరాజ్యసమితి దూత చేస్తున్న ప్రయత్నాలకు తాము కట్టుబడి ఉండబోమని అన్నారు.



పాకిస్థాన్‌కు అమెరికా మళ్లీ సాయం



336 మిలియన్ డాలర్ల మంజూరు

వాషింగ్టన్ : పాకిస్థాన్‌లో ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారని వారిని వెళ్లగొట్టేవరకు ఊరుకు నేదిలేదని, ఎలాంటి సహాయం ఇకపైన చేయబోమని హుంకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్కసారిగా తన వైఖరిని మార్చుకొన్నాడు. తాజాగా పాకిస్తాన్‌కు 336 మిలియన్ డాలర్లను సహాయం చేయనున్నట్టు ప్రకటించారు. 250 మిలియన్ డాలర్లు పౌర సహాయం కింద, 80 మిలియన్ డాలర్లు సైనిక సహాయంగా 2019 అక్టోబర్ 1 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్‌లో కేటాయించారు. కొన్నివారాల క్రితమే రెండు బిలియన్ డాలర్లను భద్రతా సహాయం కింద మంజూరయి నప్పటికీ దాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఉగ్రవాద గ్రూపులను పెంచి పోషిస్తున్నారనే ఆరోపణపైనే ఈ సహాయాన్ని నిలిపివేశారు. పాకిస్తాన్ టెర్రరిస్టు గ్రూపులపైన చర్య తీసుకున్నట్లయితే నిలిపివేసిన సహాయంపై ఆంక్షలను తొలగిస్తామని వైట్‌హౌస్ పేర్కొన్నది. టెర్రరిస్టుల స్థావరాలను తొలగించడంపైన పాకిస్తాన్ సైన్యానికి అందే సహాయం ఆధారపడి ఉంటుందని వైట్‌హౌస్ తెలిపింది. ఆ దేశంలో ఆర్థిక పురోగతి, సుస్థిరత, అమెరికా వాణిజ్య అవకాశాల సృష్టికి దోహదం చేస్తుందనే ఉద్దేశంతోనే 256 మిలియన్ డాలర్లను పౌర సహాయంగా అందించాలని బడ్జెట్ ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనలను వైట్‌హౌస్ కాంగ్రెస్‌కి పంపింది. టెర్రరిస్టు వ్యతిరేక చర్యలను తీసుకునేందుకుగాను పాకిస్థాన్ సైన్యానికి 80 మిలియన్ డాలర్లు అందించాలని కూడా వైట్‌హౌస్ మరో ప్రతిపాదన చేసింది. ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం తాలిబాన్ తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా భద్రతా చర్యలను చేపట్టడం ద్వారా సుస్థిరమైన, భద్రమైన దక్షిణాసియాను సృష్టించాలన్నదే తమ లక్ష్యమని వైట్‌హౌస్ పేర్కొంది. ఆఫ్ఘనిస్తాన్‌లో సైనిక శిక్షణ సహాయం కోసం 500 బిలియన్ డాలర్లను మంజూరు చేయాలని కూడా వైట్‌హౌస్ కాంగ్రెస్‌కు ప్రతిపాదన పంపింది.

బైక్‌లపై మేమూ సుంకాలు పెంచుతాం

భారత్ సుంకం పెంపుపై ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్ : భారత ప్రభుత్వం హార్లీ-డేవిడ్‌సన్ మోటారు సైకిళ్లపైన దిగుమతి సుంకాన్ని భారీగా పెంచిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఇదే సమయంలో భారతదేశం నుంచి తాము దిగుమతి చేసుకునే వేల లక్షల మోటారు సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని పెంచివేస్తామని బెదిరించారు. ఉక్కు పరిశ్రమపై కాంగ్రెస్ సభ్యులతో ఆయన చర్చలు జరుపుతూ పెంచిన సుంకం 75 శాతం నుంచి 50 శాతానికి భారత ప్రభుత్వం తగ్గించిందని ఈ తగ్గింపు సరిపోదని అన్నారు. అమెరికా ఎలాంటి సుంకాలు లేకుండా భారతదేశంనుంచి మోటారు సైకిళ్లను దిగుమతి చేసుకుంటున్నదని అందువల్ల సంబంధాలు ఇచ్చిపుచ్చుకునేవిగా ఉండాలని ట్రంప్ అన్నారు. అనేక దేశాలలో తమ ఉత్పత్తులు తయారవుతున్నాయని అక్కడ కూడా చాలా ఎక్కువగా పన్నులు చెల్లిస్తున్నామని అమెరికా దిగుమతి చేసుకునే మోటారు సైకిళ్లపైన కడజూళాఅ పన్నులు చెల్లిస్తున్నామని కూడా అన్నారు.హార్లీ డేవిడ్‌సన్ మోటారుసైకిళ్ల భారతదేశం దిగుమతి చేసుకుంటున్నదని ఆయన చెప్పారు. ఈవిషయంలో ఇటీవల భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీతో జరిపిన సంప్రదింపులను పరోక్షంగా ప్రస్తావించారు. పలుదేశాలతో వాణిజ్య సంబంధాలు పన్నుల విషయంలో ఇచ్చిపుచ్చుకునేవిగా లేవని ఆయన ఆరోపించారు. తాను భారతదేశాన్ని నిందించడంలేదని చెప్పుకున్నారు.

రెండు కొరియాల సఖ్యతకు కిమ్ ఓకే



పోంగ్‌యాంగ్ : రెండు కొరియాల మధ్య సఖ్యత ఏర్పదేందుకు తాను ప్రోత్సహిస్తానని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్ తెలిపారు. ఆయన కెసిఎన్‌ఎ వార్తా ఏజెన్సీతో మాట్లాడుతూ సియోల్‌లో జరిగిన శీతాకాల ఒలింపిక్స్ క్రీడలకు ఉత్తరకొరియా నుంచి ఉన్నతస్థాయి బృందం వెళ్లి తిరిగివచ్చిందని అన్నారు. ఆ బృందం చెప్పిన వివరాలన్నిటినీ తానుతెలుసుకున్నానని వారు మంచి ఫలితాలను సాధించారని అన్నారు. రెండు కొరియాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పదేందుకు, అలాగే చర్చలు జరిగేందుకు ఈ ఒలింపిక్స్ దోహదం చేస్తాయని ఆయన అన్నారు. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య సంబంధాలు మెరుగుపడేందుకు కృషి చేయాలని, ఆచరణాత్మకమైన చర్యలు చేపట్టాలని మంత్రివర్గాన్ని ఆయన ఆదేశించారు.

నెతన్యాహు భవితవ్యంపై నీలినీడలు

చర్యలకు ఇజ్రాయిల్ పోలీసుల సిఫార్సు



జెరూసలెం : ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆయన పలు అవినీతి చర్యలు పాల్పడ్డారని, ఆయనపై దేశ ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేశారని, దర్యాప్తు చేసిన ఇజ్రాయిల్ పోలీసులు నిరూపించారు. ఆయనపై చర్యలు తీసుకోవలసిందిగా పోలీసులు సిఫారసు చేశారు. దీంతో ఆయన రాజకీయ భవితవ్యం ఏమవుతుందో అని ఆయన అనుచరులు ఆందోళన చెందుతున్నారు. రెండు అవినీతి కేసులపైన 14 నెలలపాటు దర్యాప్తు జరిగింది. దర్యాప్తు నిర్ధారణలను అటార్నీ జనరల్ పరిశీలించవలసివుంది. అటార్నీ జనరల్ సిఫారసుకోసం దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రధానమంత్రి రాజీనామాకు దేశప్రజలు ఒత్తిడిచేసే అవకాశం ఉంది. లంచం తీసుకోవటం, మోసానికి పాల్పడటం, విశ్వాసాన్ని వమ్ముచేయడం లాంటి నేరాలకు సంబంధించిన సాక్ష్యాలు తగినన్ని ఉన్నాయని పోలీసులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తు నివేదిక వెల్లడయినవెంటనే నెతన్యాహు జెరూసలెంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి తాను ఎలాంటి తప్పు చేయలేదని అన్నారు. తాను పదవినుంచి తప్పుకుంటానని వచ్చే వదంతులు నమ్మవద్దని అన్నారు. తనను తప్పించేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రయత్నాలన్నీ సాగబోవని అన్నారు. ఇజ్రాయిల్ బాధ్యతను తీసుకొని నమ్మకంగా పనిచేస్తానని ఆయన అన్నారు. వచ్చే ఏడాది చివరినాటికి ఎన్నికలు కూడా నిర్వహిస్తానని చెప్పారు. అంతర్జాతీయ సంపన్నుల నుంచి తాను తన కుటుంబ సభ్యులు విలువైన బహుమతులను స్వీకరించామన్న ఆరోపణలను ఆయన కొట్టిపారవేశారు. అయితే పోలీసులు మాత్రం మిల్‌చన్ నుండి 2,08,300 దాలర్ల విలువైన బహుమతులను, అలాగే పాకర్ నుండి 70,822 వేల దాలర్ల విలువైన బహుమతులను స్వీకరించినపుడు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది.

ప్రజలతో మమేకమైన జిన్‌పింగ్

చెంగ్డు : ఇటీవల భూకంపాలకి గురైన మారుమూల కొండప్రాంత గ్రామాల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజాగా పర్యటించి అక్కడి ప్రజలతో మమేకమయ్యారు. త్వరలో అక్కడి ప్రజలు చాంద్రమాన నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించుకునేందుకు ఏర్పాట్లలో మునిగివున్నారు. ఈ వేడుకలు ఆ ప్రాంత ప్రజలకు ఎంతో ముఖ్యమైనవి. చిన్నచిన్న గ్రామాలలో పేదల ఇళ్లదగ్గరకు వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఝూంగ్‌కి అనే గ్రామంలో ఇప్పటికే పండగ వాతావరణం నెలకొంది. శుక్రవారం నుంచి నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమవుతాయి. చేతితో అల్లిన పాదరక్షలను జిన్‌పింగ్ కొనుగోలు చేశారు. తమ వ్యవసాయ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించే సదుపాయాన్ని రైతులు ఎలా వినియోగించుకుంటున్నారన్న అంశాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. పలు గ్రామాల ప్రజలు ఆయనకు స్వాగతం పలుకుతూ చుట్టుముట్టారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన కూడా వారికి అభినందనలు చెప్పారు. ప్రజలకు సేవచేయడమే ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు.



2008లో ఈ ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 8గా భూకంప తీవ్రత నమోదయ్యింది. ఆనాడు సంభవించిన భూకంపంలో 80వేల మందికిపైగా మృతిచెందారు. భూకంపంనుంచి ప్రజలు ఏమేరకు కోలుకున్నారనే అంశాన్ని కూడా ఆయన పరిశీలించారు.

రూ.11,400 కోట్ల మోసం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా 1771.69 మిలియన్ డాలర్ల మేర మోసం జరిగింది. చట్ట ప్రకారం దోషులపై చర్య తీసుకునేందుకు ఈ అంశాన్ని లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీకి అప్పగించాం. కేసు దర్యాప్తు చేస్తోంది" అని స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో బ్యాంకు ప్రకటించింది. ఈ మోసపూరిత లావాదేవీలను బట్టి చూస్తే.. ఈ మొత్తాన్ని ఖాతాదారులు ఇతర బ్యాంకుల ద్వారా విదేశాలకు తరలించినట్లు తెలుస్తోందని బ్యాంకింగ్ కార్యదర్శి తెలిపారు. ఈ లావాదేవీల ఆధారంగా విదేశాల్లోని వినియోగదారుల బ్యాంకు అకౌంట్లకు నగదును పంపినట్టు కనిపిస్తున్నదని పేర్కొంది. ఈ మోసం వల్ల బ్యాంకుకు ఏ విధమైన నష్టం కలుగుతుంది. ఈ లావాదేవీలపై బ్యాంకు ఎలా వ్యవహరిస్తుంది?, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డబ్బులను రికవరీ చేయగలుగుతారా?.. ఎలా చేస్తారు? అనే అంశాలపై ఏ మాత్రం స్పష్టత రావడంలేదని మార్కెట్ నిపుణులు అంటున్నారు. మోసపూరిత లావాదేవీల విషయంలో ఇప్పటికే పీఎన్‌బీపై విచారణ జరుగుతోంది. తాజాగా గుర్తించిన మోసపూరిత లావాదేవీలకు, గతంలోని వాటికి ఏమైనా సంబంధం ఉందా అనే విషయంపైనా స్పష్టత లేదు.

ఈ అక్రమ లావాదేవీలకు సంబంధించి మోడీ, ఆయనకు చెందిన ఆభరణాల కంపెనీతో పాటు అంతర్జాతీయంగా ప్రముఖ వ్యక్తులు సీబీఐ దర్యాప్తును ఎదుర్కోనున్నారు. ఈ కేసులో తగిన న్యాయపరమైన చర్య తీసుకోవాలని సీబీఐ చూస్తోంది. పీఎన్‌బీ బ్రాంచ్‌లో రూ. 280 కోట్ల మోసం, అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న మోడీ ఇప్పటికే సీబీఐ దర్యాప్తును ఎదుర్కొంటున్నారని సీబీఐ అధికారులు తెలిపారు. వీరిపై పీఎన్‌బీ నుంచి తమకు రెండు ఫిర్యాదులు అందాయని చెప్పారు. మోడీ, ఒక ఆభరణాల కంపెనీ పాత్రతో తమ బ్యాంకు బ్రాంచ్‌లో రూ. 11,400 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగాయని పీఎన్‌బీ నిన్న రెండు ఫిర్యాదులు చేసిందని సీబీఐ అధికారులు తెలిపారు. బ్యాంకు ఇచ్చిన ఫిర్యాదులపై భవిష్యత్ కార్యాచరణను అధికారులు వెల్లడించలేదు.

భారీ నష్టాల్లో బ్యాంకు షేర్లు

పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణం చోటుచేసుకున్నట్టు వార్తలు రావడంతో ఆ బ్యాంకు షేర్లు బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పడిపోయాయి. ఉదయం 11 గంటలకు రూ.160 షేరు విలువతో బీఎస్‌ఈలో ట్రేడింగ్ ప్రారంభించిన పీఎన్‌బీ షేరు మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10.50 లేదా 6.50శాతం పడిపోయింది. ప్రస్తుతం ఆ బ్యాంకు షేరు విలువ రూ.150 వద్ద కొనసాగుతోంది. పీఎన్‌బీ షేర్లు నష్టపోవడం వల్ల పీఎన్‌బీ ఇన్వెస్టర్లు ఒక్క రోజులోనే దాదాపు 3వేల కోట్ల రూపాయల సంపదను కోల్పోయారు.

ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

తెలుపుతామన్నారు. ప్రజలు, ప్రజాసంఘాలు, మేథావులు, విద్యార్థులు, ప్రజాతంత్రవాదులు ఈ పోరాటాలకు కలిసి రావాలని కోరారు. రాష్ట్రానికి చెందిన కొన్ని రాజకీయ పార్టీలు మోడీకి భయపడటాన్నీ, దోబూచులాడటాన్నీ విడనాడి. .ప్రత్యక్షంగా ఉద్యమంలోకి రావాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు ఇటీవల నిర్వహించిన బంద్‌కు సహకరించిన ప్రజలకు, మద్దతు తెలిపిన ప్రతిపక్ష వైసీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలకు, ప్రజాసంఘాలకు రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. అధికార టీడీపీ నేతలూ పరోక్షంగా బంద్‌లో పాల్గొన్నారని చెప్పారు. నేడు బీజేపీ మినహా రాష్ట్రంలోని అన్ని పార్టీలూ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. విభజన హామీలపై ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే భావనతో ప్రజలున్నారని స్పష్టం చేశారు. బీజేపీ కేంద్ర, రాష్ట్ర నేతలు ప్రజలను మభ్యపెట్టే తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, చిత్తశుద్ధి వుంటే.. ఏపీకి జరిగిన అన్యాయాన్ని బీజేపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని, దీనికి అన్ని రంగాల నిపుణుల్ని ఆహ్వానించి లోతుగా చర్చిస్తామని తెలిపారు. సీపీఎం నేత మధుతో కలిసి జనసేన నేత పవన్‌కళ్యాణ్‌ను త్వరలో కలుస్తామని రామకృష్ణ తెలిపారు.

హామీల అమలులో విఫలం : మధు

ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని మధు విమర్శించారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు, రాజధానికి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన 11 జాతీయ విద్యా సంస్థల ప్రస్తావనే లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మోసపూరిత విధానాల్ని నిరసిస్తూ.. దశల వారీగా ఉద్యమాలు చేపట్టాలని సమావేశం తీర్మానించిందన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు అంశం పెద్ద సమస్యగా మారిపోయిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు హోదా కంటే ప్యాకేజీనే మేలన్నారని, ఇప్పుడు ఏదీ రాలేదనీ ఎద్దేవా చేశారు. సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలు చేపట్టిన ఐక్య ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించి, భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వ రరావు, పీవీ సుందరరామరాజు-ఫార్వర్డ్ బ్లాక్, బీఎస్ అమరనాథ్, సుధీర్-ఎస్‌యూసీఐ(సి), ఎం.వెంకటరెడ్డి-ఎంసీపీఐ(యు), డి.హరినాథ్-సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, పోలారి-సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు పాల్గొన్నారు.

'టెట్'పై నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షకు పదేపదే ఆటంకాలు కొనసాగడంపై ఆయన ఆరా తీశారు. ఈ నెల 21 నుంచి మార్చి 3వ వరకూ టెట్ పరీక్షల షెడ్యూలును వెల్లడించారు. ఈ నెల 10 నుంచి హాల్‌టికెట్లను జారీ చేయాల్సి ఉండగా, ఒక రోజు ఆలస్యంతో వెబ్‌సైట్‌లో పెట్టారు. కొందరు అభ్యర్థులకు జిల్లాలు, రాష్ట్రాలు దాటి పరీక్షా కేంద్రాలు కేటాయించడంపై ఆందోళన చెందారు. మొదటి నుంచి టెట్ పరీక్షల నిర్వహణపై అధికారులు అలసత్వం చూపుతున్నారనే విమర్శలున్నాయి. పరీక్షా కేంద్రాల కేటాయింపులో తప్పిదాలపై మంత్రి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. అభ్యర్థులు ఎంచుకున్న సెంటర్లకు విరుద్ధంగా అధికారులు ఇష్టానుసారంగా కేటాయించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. టెట్ పరీక్షల నిర్వహణలో లోపాలు, ఇతర అంశాలపై గురువారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్ పరీక్ష భారమేనా..?

ఏపీ టెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు హక్కులు దక్కించుకున్న ఓ ప్రముఖ ఐటీ కంపెనీ నిర్వాహకులు తుదకు చేతులెత్తేసినట్లు తెలిసింది. టెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకుగాను ప్రభుత్వానికి తగినన్ని సాంకేతిక వనరులు లేనందున ప్రైవేటు ఐటీ కంపెనీకి బాధ్యతలు అప్పగించింది. ఈ కంపెనీకి రాష్ట్ర వ్యాప్తంగా 175 ఆన్‌లైన్ సెంటర్లు మాత్రమే ఉన్నట్లు తెలిసింది. టెట్ పేపర్-1,2,3 పరీక్షలకు భారీ స్థాయిలో దరఖాస్తులు రావడంతో అదనంగా పరీక్షా కేంద్రాల అవసరత ఏర్పడింది. కర్ణాటక, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాల్లోనూ అదనపు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని ప్రాంతాలలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించడంపై సదరు ఐటీ కంపెనీ నిర్వాహకులు తలమునకలైనట్లు సమాచారం. అధికారులు, ఐటీ కంపెనీ నిర్వాహకుల మధ్య సమన్వయం లేనందునే ఈ దుస్థితి నెలకొందనే విమర్శలున్నాయి. టెట్ పరీక్షలపై ఆటంకాలు కొనసాగడంతో పరీక్షలు మళ్లీ వాయిదా పడతాయనే ప్రచారం నెలకొంది. ఈ నెల 21 నుంచి పరీక్షలను యథాతథంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి గంటా ఆదేశించారు. దీంతో మరోమారు టెట్ పరీక్షల నిర్వహణ సందిగ్ధంగా మారింది. ఇప్పటికే రెండుసార్లు టెట్ పరీక్షలను వాయిదా వేసిన విషయం విదితమే. మంత్రి సమీక్ష అనంతరం టెట్ పరీక్షపై తుది నిర్ణయం వెలువడనుంది.

ఎన్‌ఎస్‌పీ

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో రాష్ట్ర నీటి సంఘం ప్రతినిధులు కేంద్రానికి, బోర్డుకు వినతిపత్రాన్ని పంపించటం ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం జలవనరులశాఖ అపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, సాగర్ ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వ నిర్వహణలో ఉండటం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సుమారు 15 లక్షల ఎకరాల ఆయకట్టు ఎన్‌ఎస్‌పీ కింద ఉందన్నారు. కృష్ణాజిల్లాలోని ఎన్‌ఎస్‌పీ ఎడమ కాల్వ కింద జోన్ -2, 3 పరిధిలో మూడున్నర లక్షల ఎకరాలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. సాగర్ ఎడమ కాల్వ రెగ్యులేటర్ గుంటూరులో ఉన్నప్పటికీ, నిర్వహణ బాధ్యతను తెలంగాణకు అప్పగించటం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నట్లు చెప్పారు. సకాలంలో నీటిని విడుదల చేయకపోవటంతో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సాగర్ జలాలు రాష్ట్ర సరిహద్దులోని 102వ కిలో మీటర్‌కు చేరాలంటే ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో 280 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉందని, ఇందుకు కనీసం రెండు మూడు రోజుల సమయం పడుతుందన్నారు. సాగర్ జలాలపైనే ఆధారపడ్డ రైతులు ఈ ఏడాది మిర్చి, మొక్కజొన్న, పత్తి, పొగాకు, మామిడి తదితర పంటలను సాగు చేస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరం నవంబరు నుంచి ఈ ఏడాది జనవరి వరకు నెలకు నాలుగు టీఎంసీల చొప్పున 12 టీఎంసీలను విడుదల చేయాలని కృష్ణాబోర్డును ప్రభుత్వం కోరిందన్నారు. ఆ మేరకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని బోర్డు ఆదేశించినా ఇప్పటి వరకు కేవలం 6.35 టీఎంసీలనే విడుదల చేసినట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్ర రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డు ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం పెడచెవిన పెట్టి, ఆ రాష్ట్రంలోని ఖమ్మం, నల్గొండ జిల్లాలకు మాత్రమే సాగర్ జలాలను సరఫరా చేస్తోందన్నారు. సాగర్ ప్రాజెక్టు నిర్వహణ తెలంగాణ ప్రభుత్వం చేతుల్లో ఉన్నందునే రాష్ట్రంపై వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఎన్‌ఎస్‌పీ నిర్వహణను కృష్ణా బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండు చేశారు. పునర్విభజన చట్టంలోని సెక్షన్ 87 (1) ప్రకారం రెండు రాష్ట్రాల్లోని ఉమ్మడి నీటిపారుదల ప్రాజెక్టులన్నీ కృష్ణాబోర్డు పరిధిలోకి తెచ్చి పరిధిని నోటిఫై చేయాల్సి ఉందన్నారు. 15న ఢిల్లీలో కృష్ణా బోర్డు సమావేశం జరగనున్నందున ఎన్‌ఎస్‌పీని బోర్డు పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ వినతిపత్రాన్ని పంపించామని చెప్పారు. ఎన్‌ఎస్‌పీ హెడ్ రెగ్యులేటర్ల నిర్వహణ, కాల్వలు, సిబ్బంది, పూర్తిస్థాయి నిర్వహణను బోర్డు పరిధిలోకి తెస్తేనే రాష్ట్ర రైతులకు న్యాయం జరుగుతుందని గోపాలకృష్ణారావు వివరించారు.

ఎన్నికల కమిషనర్ల వేతనాలు రెట్టింపు

(మొదటిపేజీ తరువాయి)



న్యాయమూర్తుల మాదిరిగా నెలకు ప్రస్తుతమున్న రూ.90 వేల నుంచి రూ.2.50 లక్షలు డ్రా చేస్తారు. 2016, జనవరి 1వ తేదీ నుంచి ఈ వేతన పెంపు అమల్లోకి రానుంది. దీంతో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు, ఎన్నికల కమిషనర్లు కూడా ఈ ప్రయోజనం పొందుతారు. 'సుప్రీంకోర్టు న్యాయమూర్తి వేతనానికి సమానమైన వేతనాన్ని ప్రధాన ఎన్నికల కమిషనరు(ఇతర ఎన్నికల కమిషనర్లు)కు చెల్లించబడుతుంది' అని ఎన్నికల కమిషన్‌కు చెందిన సెక్షన్-3(ఎన్నికల కమిషనర్ల సర్వీసు నిబంధనల చట్టం-1991) పేర్కొంది.

కాగిత పరిశ్రమ

(మొదటిపేజీ తరువాయి)

ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. సన్న, చిన్నకారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, ఇప్పటికే సాగులో సాంకేతికతను మేళవించి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని ముఖ్యమంత్రి వారికి వివరించారు. భూసార పరీక్షల్లో అధునాతన పరికరాలు, సీసీ కెమేరాలు, డ్రోన్ల సాయాన్ని తీసుకుంటున్నామన్నారు. టమోటా పంటకు ప్రసిద్ధి చెందిన మదనపల్లి, మామిడి పంటకు ప్రఖ్యాతిగాంచిన చిత్తూరు జిల్లాలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సమగ్ర ప్రతిపాదనలతో నెలరోజుల్లోగా వస్తే ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

మరో ఏడాది యథాతథంగా సిమెంట్ సరఫరా

వివిధ సిమెంట్ కంపెనీల ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ నిర్మాణ పనులకు ప్రస్తుతం అందిస్తున్న ధరలకే మరో ఏడాది పాటు సిమెంట్ సరఫరా చేస్తామని వారు ముఖ్యమంత్రికి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంకాస్త ధర తగ్గించే ప్రయత్నం చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వానికి అందించే సిమెంట్‌ను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. ఈనెల 22న ఫ్రేమ్‌వర్క్ పనులను ప్రారంభించాల్సిందిగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా మోటర్స్ ఎండీ కూఖ్యున్ షిమ్ ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

ప్రీ బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులతోను, 16న నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, రూరల్ హౌసింగ్, ప్రజాసంబంధాలు, రోడ్లు భవనాలు, రెవెన్యూ, పర్యాటక, మైనింగ్, మానవ వనరుల అభివృద్ధి, వైద్యశాఖల మంత్రులు, అధికారులతో సమావేశాలు జరుగుతాయి.

19న హోం, అటవీ, విద్యుత్తు, దేవదాయ, అబ్కారి, పరిశ్రమలు, క్రీడాభివృద్ధి, శాఖల మంత్రులు, అధికారులతో సమావేశమై వివిధ శాఖల ఖర్చులు, కేటాయింపులపై చర్చించనున్నారు.

అప్పులతోనే అభివృద్ధి!

(మొదటిపేజీ తరువాయి)

రూపంలో సంపాదించుకోవాలి. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వమే గ్యారెంటీ ఇస్తుంది. నిర్దిష్ట కాలంలో ప్రాజెక్టు పూర్తి చేయడంతోపాటు, నిర్వహణ బాధ్యతలు కూడా ఆ కాంట్రాక్టు పొందిన కంపెనీలదే. ఉదాహరణకు తాగునీటి ప్రాజెక్టు నిర్మాణాన్ని పొందిన కాంట్రాక్టరు లేదా కంపెనీ, ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత ఐదేళ్లపాటు ఆ ప్రాజెక్టును నిర్వహించాలి. అనంతరమే ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. ఈ నిర్వహణ సమయంలో ఏ సమస్య వచ్చినా కాంట్రాక్టరే బాధ్యత వహించాలి. మిగిలిన 60 శాతం మొత్తాన్నీ వడ్డీతో కలిపి ప్రభుత్వమే దశలవారీగా చెల్లిస్తుంది. తాగునీటి పథకాలకు ఇచ్చే రుణాన్ని 7.9 శాతం వడ్డీతో ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. తాగునీటి సరఫరాతో పాటు విద్యాశాఖ ద్వారా మౌలిక వసతుల కల్పనకు కూడా రాష్ట్ర ప్రభుత్వం హామ్ విధానాన్నే ఎంచుకుంది. దీనిలో భాగంగా సుమారు రూ.6,300 కోట్లతో తాగునీటి సరఫరాను మెరుగుపర్చే చర్యలకు ఇటీవలే ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఈ నిధులతో ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలను చేపడతారు. దీనిలో భాగంగా కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులను కూడా మెరుగు పరుస్తారు. బోర్డ్ ఆఫ్ ఇంజినీర్స్‌తో వేసిన కమిటీ పనులను ఖరారు చేస్తుంది. అలాగే సుమారు రూ.270 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనను హామ్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి కూడా 40 శాతాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుంది. నిర్మాణ సమయం, నిర్వహణ సమయం వేరుగా ఉంటుంది. ఈ విధానంలో రాష్ట్రస్థాయిలోనే ప్రాజెక్టులు, పనులు ఖరారవుతాయి. వీటిని ఒకే టెండరుగా లేదా రెండు మూడు జిల్లాలు కలిపి ప్యాకేజీగా విడదీసి, టెండర్లను పిలుస్తారు. ఫలితంగా కాంట్రాక్టులన్నీ బడా కంపెనీలకే దక్కుతాయి. దీనివల్ల జిల్లాస్థాయిలో ఉన్న కాంట్రాక్టర్లంతా తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. వారు కేవలం సబ్ కాంట్రాక్టర్లుగా మాత్రమే మిగులుతారు.

ఇష్టానుసారం పనులు ప్రారంభించేసి, ఇటు వడ్డీ భారంతో పాటు అటు అసలు అప్పును కూడా ఒకేసారి తీర్చాల్సి రావడంతో ప్రభుత్వం చతికిల పడే ప్రమాదం కూడా ఉంది. బీఓటీ విధానంలో జాతీయ రహదారులను నిర్మించిన కేంద్ర ప్రభుత్వం, సుమారు 30 ఏళ్లపాటు వాహనాల నుంచి టోల్ వసూలుకు అనుమతించిన చందంగా, రుణభారాన్ని తగ్గించుకొనేందుకు ప్రజల నుంచి యూజర్ ఛార్జీలను వసూలు చేసి, ఆ మొత్తంతో అప్పు తీర్చే ప్రయత్నం చేసినా ఆశ్చర్యపోనక్కరలేదు.

ఏపీ పోలీస్ చట్టం పరిశీలనకు త్రిసభ్య కమిటీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : నూతనంగా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ చట్టం - 2017 ముసాయిదా పరిశీలనకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. మా రాష్ట్రం - మా డీజీపీ అనే నినాదంతో ఈ ఏడాది ప్రభుత్వం కొత్త పోలీసు చట్టాన్ని రూపొందించింది. నిపుణుల కమిటీ రూపకల్పన చేసిన ఈ ముసాయిదా చట్టాన్ని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ ఎం మాలకొండయ్య ఇటీవల ప్రభుత్వానికి పంపించారు. ఈ చట్టాన్ని పరిశీలించి ఆమోదించేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఆర్ అనురాధ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సాధారణ పరిపాలనశాఖ (జీఏడీ) పొలిటికల్ కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ 15 రోజుల్లో ముసాయిదాను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీ పాలిసెట్-2018 నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్ టెస్ట్ (పాలిసెట్-2018) నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెల్లడించింది.ఈ మేరకు రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ బుధవారం జీవో విడుదల చేశారు. 2017-18 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల్లో ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులలో సీట్లను పాలిసెట్ ద్వారా భర్తీ చేస్తారు. ఏప్రిల్ 27న (శుక్రవారం) రాష్ట్ర వ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాలలో ఎంట్రన్స్ నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల పరీక్ష కొనసాగుతుంది. ఈ పరీక్షకు రాసేందుకు పదో తరగతి ఉత్తీర్ణతను అర్హతగా నిర్ణయించారు.10వ తరగతి సిలబస్ ఆధారంగా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దాదాపు 1లక్షా 50వేల మంది పాలిసెట్‌కు హాజరవుతారని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖాధికారులు భావిస్తున్నారు.

'కమలం' కల్లోలం

- మిత్రపక్షంతో విడాకులు?
- ఏపీకి జరిగిన అన్యాయంపై బీజేపీ శ్రేణుల్లో అంతర్మథనం
- న్యాయం జరిగిందన్న నేతల వాదనతో ఏకీభవించని కార్యకర్తలు
- వైసీపీ రాజీనామా హెచ్చరికలతో డోలాయమానంలో నేతలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర బీజేపీలో అంతర్యుద్ధం ఆరంభమైంది. నాయకులు పైకి బింకంగా ప్రకటనలు చేస్తున్నా లోలోపల అంతర్మథనం జరుగుతోంది.మిత్రపక్షపార్టీకి విడాకులు దాదాపు ఖాయమయ్యాయి. వైసీపీ రాజీనామా అస్త్రం ఎక్కుపెట్టింది. పది వామపక్షాలు ఉద్యమ ఉధృతికి కార్యాచరణను ప్రకటించాయి. జనసేన జేఏసీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇలా కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా మారిపోవడంతో ఈ పరిణామాలు చివరకు ఎటు దారితీస్తాయోనన్న ఆందోళన ఆపార్టీ శ్రేణుల్లో నెలకొంది. కేంద్ర ప్రభుత్వ వ్యూహమేమిటో అర్థంగాక, రాష్ట్రంలో పార్టీని ఏవిధంగా బతికించుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా రాష్ట్రానికి భారీగా కేటాయింపులుంటాయని పార్టీ నేతలు భావించారు. కాని గత బడ్జెట్‌ల కంటే అతి దారుణంగా ఈసారి కనీస కేటాయింపులు లేకపోవడంతో రాష్ట్ర నేతలు డీలా పడ్డారు. దీనిపై కేంద్రంలో మిత్రపక్షంగా వుంటున్న తెలుగుదేశం పార్టీ మొదటిసారి బహిరంగంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అంతటితో ఆగకుండా పార్లమెంటులో తిరుగుబాటు జెండా ఎగురవేసింది. దీంతో ఖంగుతున్న కమలనాథులు దీనిపై ఏం చేయాలో, ప్రజలకు ఏం చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. మరోప్రక్క వామపక్షాలు రాష్ట్ర బంద్‌కి పిలుపునిచ్చాయి. ఈనేపథ్యంలో బీజేపీ కేంద్ర నాయకులు అప్రమత్తమై మిత్రపక్షంపై ఎదురుదాడికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అధినాయకుల ఆదేశాల మేరకు గత నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రానికి కేంద్రం నుండి అందిన సహాయ వివరాలు మొత్తం రాష్ట్ర నేతలు లిస్టు తీసుకొని ప్రజలకు వివరించే పని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ కావాలనే తమపై రాష్ట్ర ప్రజల్లో వున్న వ్యతిరేకతను కేంద్రంపైకి నెట్టేందుకు రాద్ధాంతం చేస్తోందని కమలనాధులు ఎదురుదాడి మొదలెట్టారు. దీనిపై టీడీపీ నేతలు కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. అన్ని రాష్ట్రాలకిచ్చినట్లుగానే ఏపీకి నిధులు ఇచ్చారని, ప్రత్యేకంగా చేసిందేమీ లేదని, విభజన అంశాల్లో కనీసం 10శాతం కూడా అమలు చేయలేదంటూ పార్లమెంటు లోపల, బైటా టీడీపీ కేంద్రంపై బహిరంగ పోరాటానికి దిగింది.

అయితే ఈ రాజకీయ ఎత్తులు పైఎత్తులను పక్కనబెడితే అసలు రాష్ట్రాన్ని కేంద్రం చిన్నచూపు చూస్తుందా? లేదా? అన్యాయం చేసిందా? లేదా? చట్టంలో పొందుపర్చిన విభజన అంశాలను నాలుగేళ్ళయినా ఎందుకు అమలు చేయ లేదు? అనే అంశాలపై బీజేపీ శ్రేణుల్లో అంతర్గత వార్ జరుగుతోంది. ఏ రాష్ట్రానికి చేయని విధంగా ఏపీకి కేంద్రం పెద్దఎత్తున సహాయం చేసిందన్న నేతల వాదనతో కార్యకర్తలు ఏకీభవించలేక పోతున్నారు. విభజన అంశాలు ఏమేరకు అమలు చేయలేదని స్పష్టంగా కనపడుతుంటే చాలా చేసిందని ప్రజలకు ఎలా చెబుతాం? చెప్పినా ఎలా నమ్ముతారు? జనం అంత పిచ్చివాళ్ళా? రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ప్రజాభిప్రాయానికి భిన్నంగా అలాగే చేశారు. చివరకు ఏమైంది? మన పరిస్థితి కూడా దానికి భిన్నమేమీ కాబోదని, బీజేపీలో ఓ సీనియర్ కార్యకర్త ఇటీవల పార్టీ నాయకులను నిలదీశాడంటే ఆపార్టీ శ్రేణుల్లో సైతం ఎంత వ్యతిరేకత వుందో అర్థమవుతోంది. ఆయనతో పలువురు ద్వితీయశ్రేణి నాయకులు సైతం ఏకీభవించినట్లు తెల్సింది.

తెలుగుదేశం పార్టీ రాజకీయ ఎత్తుగడలు, ఈసారి ఆపార్టీతో పొత్తు వుంటుందా ? లేదా ? అనే విషయాలు పక్కనబెడితే రాష్ట్రానికి మనం ఏం న్యాయం చేశామో, లేదో గుండె మీద చేయి వేసుకొని చెప్పాలి కదా? అని వారు నేతలను ప్రశ్నించినట్లు తెల్సింది. ఇటువంటి చర్యల వల్ల కేంద్రంలో అధికారంలో వుండి కూడా రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, పైగా మరింత బలహీనపడే ప్రమాదం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెల్సింది.

మరోప్రక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహనరెడ్డి మార్చి 5నుంచి ఉద్యమ కార్యాచరణను ప్రకటించడంతోపాటు, ఏప్రిల్ 6 లోగా కేంద్రం ప్రత్యేక హోదా ప్రకటించకపోతే ఎంపీలంతా రాజీనామా చేస్తారని ప్రకటించడం రాష్ట్ర బీజేపీ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తెలుగుదేశం పార్టీతో దాదాపు తెగదెంపులు ఖాయమై, వచ్చే ఎన్నికలకు వైసీపీతో పొత్తు వుంటుందనుకుంటున్న దశలో జగన్ నిర్ణయం వారిని డోలాయమానంలో పడేసింది. ఇప్పటివరకు ఏపీకి కేంద్రం చాలా సహాయం చేసిందని టీడీపీ ఆరోపణలను తిప్పికొట్టే యత్నం చేస్తున్నారు. ఇప్పుడు వైసీపీ కూడా ఏపీకి అన్యాయం జరిగిందని రాజీనామా అస్త్రం సంధించడం, రాష్ట్రంలో బీజేపీయేతర పక్షాలన్నీ ఏపీకి జరిగిన అన్యాయంపై మండిపడుతుంటే ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని కమలనాధులు మదనపడుతున్నారు. కేంద్ర విద్యా, వైద్య సంస్థలకు అరకొర నిధులిచ్చినా, అమరావతి రాజధాని ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీ వచ్చి చెంబుడు నీళ్ళు, పిడికెడు మట్టి ఇచ్చినా, పోలవరంకు అడుగడుగునా అడ్డంకులు కల్పించినా ఏవో కుంటిసాకులు చెప్పగలిగాం కాని, రైల్వే జోన్, కడప ఉక్కుపరిశ్రమ, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, దుగరాజపట్నం ఓడరేవు, విజయవాడ, విశాఖ మెట్రో వంటి కీలక ప్రాజెక్టులపై ప్రజలను అబద్ధాలతో మెప్పించలేక పోతున్నామన్న భావన వారిలో వ్యక్తమవుతోంది. మొత్తానికి ఏపీకి జరిగిన అన్యాయంపై రాష్ట్రంలోని బీజేపీయేతర పక్షాలన్నీ కేంద్రంపై వివిధ పద్ధతుల్లో ప్రజాపోరుకు సమాయత్తం కావడంతో కమలనాథుల పరిస్థితి దయనీయంగా మారింది.

జూడాల సమ్మె నోటీసుతో దిగొచ్చిన ప్రభుత్వం

ఉపకార వేతనాల బకాయిలు విడుదల

28వరకూ సమ్మె వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల(జూడా) సమ్మె నోటీసుతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. నాలుగు డిమాండ్లతో ఈ నెల 14 నుంచి సమ్మె చేపడతామని ఉన్నతాధికారులకు జూడాలు నోటీసు ఇచ్చిన విషయం విదితమే. ఏపీ జూనియర్ వైద్యులకు 2016 -'17 కాలానికి సంబంధించిన 15శాతం ఉపకార వేతన పెంపు బకాయిల విడుదలకు ప్రభుత్వం అంగీకరించింది.ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య బుధవారం జీవో నంబరు-9 విడుదల చేశారు. 2016 జనవరి1 నుంచి 2017 డిసెంబరు 31 మధ్య ఉన్న

ఉపకారవేతనాల బకాయిల విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. హౌస్ సర్జన్లకు(ఎంబీబీఎస్, బీడీఎస్) అభ్యర్థులకు రూ.10,580 నుంచి ఉపకారవేతనాన్ని రూ.12,167కు పెంచారు.పీజీ -మొదటి ఏడాది విద్యార్థులకు రూ.23,805 నుంచి 27,376, రెండో ఏడాది రూ.25,128 నుంచి రూ.28,897, మూడో ఏడాది రూ.26,450 నుంచి 30,418, పీజీ డిప్లొమో మొదటి ఏడాది -రూ.23,805 నుంచి రూ.27,376, రెండో ఏడాది రూ.25,128 నుంచి రూ.28,897కు పెంచారు. సూపర్ స్పెషాల్టీ మొదటి ఏడాది రూ.26,450 నుంచి రూ.30,418, రెండో ఏడాది-రూ.27,773 నుంచి రూ.31,939, మూడో ఏడాది రూ.29,095 నుంచి రూ.33,459, ఎండీఎస్ కోర్సు మొదటి ఏడాది రూ.23,805 నుంచి రూ.27,376, రెండో ఏడాది రూ.25,128 నుంచి రూ.28,897, మూడోఏడాది రూ.26,450 నుంచి 30,418కు ఉపకార వేతనం పెంచుతూ జీవో జారీ చేశారు.

మిగిలిన డిమాండ్లూ పరిష్కరించాలి: జూడా రాష్ట్ర అధ్యక్షులు వెంకట రమణ

సీనియర్ రెసిడెంట్లకు బకాయిలు, ఎంబీబీఎస్ రిజిస్ట్రేషన్ల సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు వెంకట రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిగ్రీ, పీజీ డిప్లొమో, డెంటల్, సూపర్ స్పెషాల్టీ, హౌస్‌సర్జన్ అభ్యర్థులకు 2016-'17లో పెండింగ్ స్టైఫండ్ బకాయిల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.దీంతో బుధవారం నుంచి తాము చేపట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నామని.ఈ నెలాఖరులోగా తమ సమస్యలు పరిష్కరించాలని లేదంటే మార్చి 1 నుంచి సమ్మెను యథాతథంగా కొనసాగిస్తామని వెంకట రమణ స్పష్టం చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో

అమరావతి హెరిటేజ్ సెంటర్, మ్యూజియం

రెండు దశల్లో అభివృద్ధికి రూ.7.50 కోట్లు

ప్రణాళికలు రూపొందించిన పర్యాటకశాఖ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాజధాని అమరావతిలోని అమరావతి హెరిటేజ్ సెంటర్, మ్యూజియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు దశలలో దీనిని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర పర్యాటక ప్రాధికారసంస్థ (ఏపీటీఏ), ఏపీ క్రియేటివిటీ, కల్చర్ కమిషన్, భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) సంయుక్తంగా ప్రణాళికను రూపొందించాయి. రూ.7.50 కోట్లతో అమరావతి హెరిటేజ్ సెంటర్, మ్యూజియాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతి గొప్పతనం, వారసత్వాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాలు, సంస్థల సహకారంతో అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు. పర్యాటకశాఖ తొలి దశలో రూ.4 కోట్లను ఖర్చు చేయనుండగా, రెండో దశలో రూ.3.50 కోట్లను చెన్నైలోని ఇండియన్, బ్రిటీష్ మ్యూజియం నుంచి రుణంగా పొందనుంది. తొలి దశలో మ్యూజియం భవన సముదాయ నిర్మాణంతోపాటు మౌలిక వసతుల కల్పన, అమరావతి హెరిటేజ్ టౌన్ గ్యాలరీ ప్రాధాన్యం తెలియజేసేలా హెరిటేజ్ వాక్ తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. రెండో దశలో ఇండియన్, బ్రిటీష్ మ్యూజియాల నుంచి తీసుకోనున్న రుణం రూ.4.50 కోట్లతో గ్యాలరీలు, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రదర్శనల నిర్వహణతో శిల్పాలను కొనుగోలు చేయనున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ) చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేగాకుండా దీని నిర్వహణ బాధ్యతను భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్‌కు ప్రభుత్వం అప్పగించింది.

ఎమ్మెల్యే 'చింతమనేని'కి మూడేళ్ల జైలు, బెయిల్



విశాలాంధ్ర-భీమడోలు : పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు భీమడోలు మెజిస్ట్రేట్ కోర్టు మూడు వేర్వేరు కేసుల్లో ఆయనకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. భీమడోలు కోర్టు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కె.దీపాదివ్యకృప ఈ మేరకు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. 2011లో అప్పటి రాష్ట్ర మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై చింతమనేని ప్రభాకర్ చేయి చేసుకున్నారు. అంతేకాకుండా వసంత్ కుమార్ గన్‌మెన్ ఎం.సుబ్బారావుపై చేయిచేసుకున్న కేసులో దోషిగా నిర్ధారిస్తూ భీమడోలు మెజిస్ట్రేట్ కోర్టు తీర్పు వెలువరించింది. 2011 జూన్‌లో దెందులూరు హైస్కూలులో జరిగిన రచ్చబండలో అప్పటి మంత్రి హోదాలో ఉన్న వట్టి వసంత్ కుమార్‌పై దెందులూరు ఎమ్మెల్యేగా ఉన్న చింతమనేని దౌర్జన్యం చేయడంతో పాటు అప్పటి ఎంపీ కావూరి సాంబశివరావు, ప్రజలందరి సమక్షంలో చేయి చేసుకున్నారు. దీనిపై మంత్రి వసంత్ కుమార్ గన్‌మెన్ ఫిర్యాదు మేరకు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు నాలుగు సెక్షన్లుగా కేసు నమోదు చేశారు. ఏడేళ్లుగా కేసు వాదోపవాదనలు జరగగా బుధవారం న్యాయస్థానం వెలువరించింది. సెక్షన్ 506(2)గా రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయిల జరిమానా, సెక్షన్ 353గా ఆరు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయిల జరిమానా, సెక్షన్7(1)గా ఆరు నెలలు జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా, మొత్తంగా మూడేళ్ల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు వెల్లడించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పునివ్వడంతో చింతమనేనికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష వర్తిస్తుంది. తీర్పు వెలువడే సమయంలో తన అనుచరులతో చింతమనేని కోర్టుకు హాజరయ్యారు. తీర్పు వెలువడిన వెంటనే చింతమనేని బెయిల్ పిటీషన్ దాఖలు చేయగా, కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

గ్రూప్-1(2011) ఇంటర్వ్యూ మార్కుల లీక్..?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్-1 (2011) ఇంటర్వ్యూల మార్కులు లీకైనట్లు బుధవారం ప్రచారం కొనసాగింది. విజయవాడ ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఇటీవల ఈ పరీక్షలకు ఇంటర్వ్యూలు నిర్వహించిన విషయం విదితమే. 2011 నోటిఫికేషన్‌లో భాగంగా నిర్వహించిన మెయిన్ పరీక్షపై అనేక అభ్యంతరాలు నెలకొన్నాయి. దీంతో గ్రూప్-1 రీ-మెయిన్ ఎగ్జామ్‌ను నిర్వహించి, గతేడాది మార్చి 22న ఏపీపీఎస్సీ ఫలితాల్ని వెల్లడించింది. ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల మార్కులు లీక్ అయినట్లు వచ్చిన సమాచారంపై ఏపీపీఎస్సీ కమిషనర్ ఉదయ్‌భాస్కర్ స్పందించారు. ఇంటర్వ్యూ మార్కులు ఎక్కడా లీక్ కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా మార్కులు లీక్ చేసినా..దాని ప్రభావం అభ్యర్థుల ఎంపికపై ఉండబోదని నొక్కిచెప్పారు. ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి ఇంటర్వ్యూల మార్కులు లీకైనట్లు నిర్ధారణైతే..బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏపీపీఎస్సీలో అంతా పారదర్శకంగా కొనసాగుతోందని అన్నారు. అటు ఇంటర్వ్యూల మార్కులు లీకైతే మెరిట్ అభ్యర్థుల విజయవకాశాలపై ప్రభావం తప్పనిసరిగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఏడాది చివరికి రోడ్లు, ఉద్యోగుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి..

జూన్‌లో అన్న క్యాంటీన్లు ప్రారంభం : మంత్రి నారాయణ



విశాలాంధ్ర అమరావతి : రాజధాని పరిధిలో చేపట్టిన రోడ్లు, సీవరేజ్, విద్యుద్దీకరణ పనులపై సమీక్ష జరిపామని మంత్రి నారాయణ తెలిపారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి పరిధిలో చేపట్టిన రోడ్డు నిర్మాణాలు త్వరితంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. సీఆర్డీఏ పరిధిలో ఈస్టు నుంచి వెస్ట్ మధ్య 16 రోడ్లు, సౌత్ నుంచి నార్త్ మధ్య 18 రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ 34 మేజర్ రోడ్లకు ఇప్పటికే 24 రోడ్లకు టెండర్లు పిలిచి, పనులను ప్రారంభించామని, నిర్మాణాల తీరును ఇటీవల సీఎం చంద్రబాబు హెలికాప్టర్ ద్వారా పరిశీలించారన్నారన్నారు. రోడ్డు నిర్మాణాలు చేపట్టిన కంపెనీలు ఎటువంటి యంత్ర సామాగ్రి వినియోగిస్తున్నదీ సీఆర్డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారని వివరించారు. వారం రోజుల్లో రోడ్ల నిర్మాణాలపై వివరాలు అందచేసి ,ఈ ఏడాది చివరి నాటికి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సీఆర్డీఏ సమావేశంలో సీఎం ఆదేశించారన్నారు. మిగిలిన 10 మేజర్ రోడ్లకు త్వరలోనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తామన్నారు. రైతుల నుంచి సేకరించిన భూముల్లో చేపట్టిన రోడ్లు, ఇతర నిర్మాణాలు నిబంధనల కనుగుణంగా జరుగు తున్నాయన్నారు. 34 రోడ్ల నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఐఏఎస్, గెజిటెడ్, నాన్ గెజిటెట్, గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగుల కోసం 3,840 ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఏప్రిల్‌లోగా మొదటి స్లాబ్ పనులు పూర్తిచేస్తామని సీఎం సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారన్నారు. డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

జూన్‌లో అన్న క్యాంటీన్లు ప్రారంభం...

ఈ ఏడాది జూన్ 2న రాష్ట్రంలో లక్ష జనాభా పైబడిన 33 మున్సిపాల్టీల్లో 200 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ తెలిపారు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, కర్నాటకలోని బెంగళూరులో ఇందిరా క్యాంటీన్ల పనితీరును స్వయంగా పరిశీలించి వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి పూర్తిస్థాయి వివరాలను సీఎంకు శుక్రవారం వివరిస్తామన్నారు. బెంగళూరులో ఇందిరా క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించారని, అదేతరహాలో రాష్ట్రంలో మొదటి విడతగా ప్రారంభించనున్న 200 అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు సమకూర్చనున్నామన్నారు. కూలీలు, కార్మికులకు అందుబాటులో ఉండేలా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయబోయే ప్రాంతాలను ఇప్పటికే అధికారులు గుర్తించారని మంత్రి నారాయణ వెల్లడించారు.





సముద్ర స్నానాల్లో అపశృతి

ఇద్దరి మృతి, మరొకరి పరిస్థితి విషమం



విశాలాంధ్ర-విశాఖసిటీ : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం నాటి పుణ్యస్నానాల్లో అపశృతి చోటుచేసుకుంది. సాగరనగర్ ప్రాంతంలోని సముద్రం లోకి స్నానాలకు దిగిన ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగా ఉంది. పాత డెయిరీ ఫార్మ్ సమీపంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఐదుగురు బుధవారం ఉదయం సాగరనగర్ సముద్ర స్నానాలకు వెళ్లారు. అలల తీవ్రత అధికంగా ఉండడంతో స్నానాలకు దిగిన యశ్వంత్ అనే యువకుడు నీటిలో మునిగిపోతుండగా, కొడుకును రక్షించే ప్రయత్నంలో తండ్రి దువ్వి శివప్రసాద్ మరింత లోతులో చిక్కుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానికులు బయటకు తీశారు. విమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. శివప్రసాద్‌తో పాటు ఆదే ప్రాంతానికి చెందిన రమణ అనే మరొక వ్యక్తి కూడా నీటిలో మునిగి పోవడంతో స్థానికులు కాపాడి ఆస్పత్రికి తరలించారు. పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రమణ కూడా మృతి చెందాడు. శివప్రసాద్ కుమారుడు యశ్వంత్ మాత్రం ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉప్పు నీరు ఎక్కువగా తాగడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర సర్వీసులకు నవీన్ గులాఠి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఒకవైపున రాష్ట్రాన్ని ఐపీఎస్‌ల కొరత వెంటాడుతుంటే... మరోవైపు సీనియర్ ఐపీఎస్ అధికారులు కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిపోతున్నారు. 2004 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన నవీన్ గులాఠి తాజాగా కేంద్ర సర్వీసులకు వెళుతున్నారు. కోస్టల్ సెక్యూరిటీ డీఐజీగా ఉన్న ఆయన కేంద్ర హోంశాఖ ఉప కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆయన్ని తక్షణమే రిలీవ్ చేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోస్టల్ సెక్యూరిటీ డీఐజీ బాధ్యతలను ఇతర అధికారులకు అప్పగించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ ఎం మాలకొండయ్యకు ప్రభుత్వం సూచించింది.


జైళ్లశాఖ కడప డీఐజీగా వరప్రసాద్

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్ర జైళ్లశాఖలో సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్‌గా ఉన్న డాక్టర్ ఎం వరప్రసాద్‌కు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా పదోన్నతి లభించింది. 2017-18 సంవత్సరానికి పదోన్నతుల ప్యానల్‌లో ఉన్న ఆయనకు జైళ్లశాఖ డీఐజీగా పదోన్నతి కల్పిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ఆయన్ని జైళ్లశాఖ కడప డీఐజీగా నియమించారు. ఈ పదోన్నతి తాత్కాలికంగానే కల్పించినట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాజధాని నిర్మాణ పనుల పర్యవేక్షణకు డ్రోన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాజధాని నిర్మాణ పనులలో వేగం పెంచాలని, చేపట్టిన ప్రతి పనిని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా నిర్మాణ సంస్థలను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. గృహనిర్మాణం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సకాలానికి పూర్తి చేయడంలో ఎవరైనా విఫలమైతే ఉపేక్షించనని స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులు, సర్వీస్ ప్రొవైడర్లతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సహకారం తీసుకుని 15 రోజులకు ఒకసారి డ్రోన్లతో తీసిన చిత్రాలను తనకు చూపించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. చేపట్టిన పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేస్తేనే పెట్టుబడిదారులు ముందుకు వస్తారని అన్నారు. పనులకు సంబంధించిన యంత్రసామాగ్రి, మెటీరియల్ విషయంలో ఇబ్బందులు ఉంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలని చెప్పారు. పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు మృతి



విశాలాంధ్ర - సోంపేట: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ కృష్ణారావు బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ లో తన స్వగృహంలో అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టీ రామారావు పిలుపు మేరకు 1983లో తెలుగుదేశం పార్టీలో చేరి అదే సంవత్సరం ఇచ్ఛాపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1985, 1989, 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989 ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీకృష్ణుని కటౌట్‌ను ఉపయోగించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఆగ్రహానికి గురయ్యారు. ఆయనపై ఆరేళ్లపాటు బహిష్కరణ వేటు పడింది. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గాను, అసెంబ్లీ ప్యానెల్ స్పీకర్‌గాను, శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగాను, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గాను ఆయన సేవలందించారు. ఎంవీకి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో దళితుడే సీఎం కావాలి..

వడ్లమూరి డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి దళితుడే ఉండాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణమూర్తి డిమాండు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి దళిత వర్గానికి చెందిన వారే ఉండాలనే ఏకైక లక్ష్యంతో తమ పార్టీ ప్రధాన ఎజెండాతో ముందుకు వెళుతోందన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ దళితుడ్ని తెలంగాణకు ముఖ్యమంత్రిని చేస్తానన్న కేసీఆర్ .. దళితులను మోసం చేసి వారి ఆత్మ గౌరవాన్ని దిగజార్చారన్నారు. అగ్రకుల పార్టీలైన టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు దళితుల్ని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండు చేశారు. దేశంలో ఓటు హక్కును ప్రసాదించిన డా.బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ధ్వంసం చేయడానికే మనువాద పార్టీలు శక్తివంచన లేకుండా యత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తమను ఓటు బ్యాంకుగా పరిగణించే పార్టీలపై పోరాడాలని దళితులకు పిలుపునిచ్చారు. రాజకీయ అధికారం ద్వారానే దళితులకు, పీడిత వర్గాలకు విముక్తి కలుగుతుందన్నారు. ఈ నెల 27 నుంచి తెలంగాణలోని మంచిర్యాల జిల్లా నుంచి రాజ్యాధికార చైతన్య సభలు నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దాసరి రామచంద్రరావు, కార్యదర్శి వడ్డీ శ్రీనివాసరావు, షేక్ బాషా, సరళాదేవి పాల్గొన్నారు.

సంపాదకీయం

యూజీసీ ముసాయిదా అసమగ్రం

పడకేసిన బోధన, పడిలేవని శోధన.. ఇదీ మన ఉన్నత విద్యారంగ దృశ్యం. జాతి అభ్యున్నతిని లక్షించి ఉన్నత విద్యా రంగాన్ని పరిపుష్టి కరించాలన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉద్బోధ దశాబ్దాలు గడిచినా మన పాలకుల పుణ్యమా అంటూ అరణ్యరోదనగా మిగిలింది. భారత్‌లో 90శాతం కళాశాలలు, 70 శాతం విశ్వవిద్యాలయాలు నాసి ప్రమాణాలకు నెలవులుగా, నిరుద్యోగుల ఉత్పత్తి కర్మాగారాలుగా భ్రష్టుపడుతున్నాయి. ఏ విశ్వవిద్యాలయమైనా తన స్థాయిలో ఆర్థిక ప్రగతికి, సామాజిక సమతుల్యతకు ప్రయత్నించాలి. సమాజంలో పెరుగుతున్న అసహనం, నేర ప్రవృత్తి, లింగవివక్ష, లైంగికదాడులు, కుటుంబ కలహాలు వంటి వాటిని నివారించడానికి వీలుగా విద్యార్థులను తీర్చిదిద్దేం దుకు విశ్వవిద్యాలయాలు కృషిచేయాలి. అంతేకాదు, ఉన్నత విద్యను అందించే విశ్వవిద్యాలయాలు ఆర్థిక పురోభివృద్ధికి నిరంతరం కృషిచేయాలి. ఇప్పుడు మన విశ్వవిద్యాలయాలు ఆర్థిక, సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించే స్థితిలో లేకపోవడమే కాదు, అవే ఓ సమస్యగా మారిపోయే దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. సృజనాత్మక బోధన, సృజనశీలతను పెంపొందించే పరిశోధన కరవైపోయింది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యా రంగాన్ని ప్రక్షాళించే ప్రయత్నాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శ్రీకారం చుట్టింది. 'యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ ఆన్ మినిమమ్ క్వాలిఫికేషన్స్ ఫర్ అపాయింట్‌మెంట్ ఆఫ్ టీచర్స్ అండ్ అదర్ ఎకడమిక్ స్టాఫ్ ఇన్ యూనివర్సిటీస్ అండ్ కాలేజెస్, అండ్ మెజర్స్ ఫర్ ది మెయింటెనెన్స్ ఆఫ్ స్టాండర్డ్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్-2018' అనే పేరుతో ఓ ముసాయిదాను రూపొందించింది. ఇది కూడా పరిమిత లక్ష్యసాధనకు ఎక్కుపెట్టిన అస్త్రంగానే ఉన్నప్పటికీ ఏదో ఒక ప్రారంభం మంచిదే. ఈ ముసాయిదా ప్రధానంగా బోధన సిబ్బంది నియామకాలపై దృష్టి కేంద్రీ కరించింది. వాస్తవ పరిస్థితులను అంచనా వేయకుండా, క్షేత్రస్థాయి స్థితిగతుల్ని పరిగణనలోకి తీసుకోకుండా ఈ ముసాయిదాను యూజీసీ రూపొందించిందా అనే అనుమానం కలుగుతున్నది. బోధన సిబ్బంది నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలను పరిశీలిస్తే ఈ అనుమానం నిజమేననిపిస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 53శాతం, ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో 33శాతం మేర బోధన సిబ్బంది ఖాళీలు భర్తీకాని దురవస్థ కొన్నేళ్లుగా పట్టి పీడిస్తున్నది. పదవీ విరమణ వయస్సు పెంచినా, రిటైరైన వారిని తిరిగి కొనసాగిస్తున్నా ఈ సమస్య పరిష్కారం కాకుండా ఉంది. ఈ ముసాయిదాను యూజీసీ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈనెల 28లోగా అందిన సూచనలు, అభిప్రాయాల మేరకు మార్పుచేర్పులతో తుది మార్గదర్శకాలు విడుదల చేస్తారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు పీహెచ్‌డీని తప్పనిసరి చేయడం నుంచి వివిధ ఉద్యోగాల భర్తీలోనూ, పదోన్నతుల్లోనూ పాటించాల్సిన నియమాలను, పరిగణనలోకి తీసుకోవాల్సిన అర్హతలను యూజీసీ ఈ ముసాయిదాలో సూచించింది. ఇప్పటివరకూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) లేదా స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) లేదా పీహెచ్‌డీ ఏదో ఒకటి అర్హతగా పరిగణించారు. 2021 జూలై తర్వాత చేపట్టబోయే నియామకాలకు నెట్ లేదా సెట్‌తో పాటు పీహెచ్‌డీ కూడా తప్పనిసరిగా ఉండాల్సిందే. నేరుగా అధ్యాపక నియామ కానికి సార్వత్రిక పట్టభద్ర (పీజీ) స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి చేసింది. సెలవుపెట్టి పీహెచ్‌డీ పూర్తిచేసే వీల్లేదంటోంది. పీహెచ్‌డీ పట్టా కలిగిన అభ్యర్థుల కొరతతో ఎన్నో విద్యాసంస్థల దస్త్రాల్లో ఒకరి పేరు, కుర్చీలో మరో వ్యక్తి ఉంటున్న బాగోతాలకు కొదవలేదు. ఈ స్థితిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు పీహెచ్‌డీ చేసిన వారు ఎక్కడ నుంచి లభిస్తారనే తర్కాన్ని యూజీసీ విస్మరించినట్లు ఉంది. సీనియర్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అసోసియేట్, ప్రిన్సిపాల్ ఇత్యాది పోస్టుల భర్తీలో, పదోన్నతిలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అర్హతలు, పాటించాల్సిన నియమాల విషయంలోనూ యూజీసీ కొన్ని ఆంక్షలు ముందుకు తెచ్చింది. ఒక విద్యాసంస్థలో మంజూరైన మొత్తం పోస్టుల్లో తాత్కాలిక అధ్యాపకులు పదిశాతానికి మించకూడదని సూచించింది. అలాగే రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా కాంట్రాక్టు లెక్చరర్లకు కూడా వేతనాలు ఇవ్వాలని పేర్కొంది. ప్రభుత్వాల పుణ్యమాని 60 నుంచి 70శాతం వివిధస్థాయి అధ్యాపక పోస్టులు భర్తీకాకుండా ఖాళీగా మిగిలిన స్థితిలో, వేర్వేరు పేర్లతో కాంట్రాక్టు ప్రాతిపదికన దశాబ్దాలుగా పనిచేస్తున్న అధ్యాపకులే అధికం. పని ఒకటే అయినా కాంట్రాక్టు అధ్యాపకులకు నామమాత్రపు వేతనాలే చెల్లిస్తున్నారు. తాము దినసరి కూలీలుగా మిగిలిపోతున్నామని వారు ఆవేదన చెందు తున్నారు. ఇప్పుడు యూజీసీ సమానవేతన ప్రతిపాదన కచ్చితంగా వారికి న్యాయం చేసినట్లయింది. అయితే, దశాబ్దాలుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారి బోధనానుభవాన్ని దృష్టిలో ఉంచుకొని వారిని రెగ్యులర్ చేయాలన్న వాస్తవాన్ని యూజీసీ విస్మరించింది. వారు ఇప్పటికే అనేకసార్లు పాలకులను వేడుకొన్నారు. ఏళ్ల తరబడి ఒప్పంద సిబ్బందిగా కొనసాగు తున్నవారి భవిష్యత్తు అంధకార బంధురం కాకుండా, విద్యాప్రమాణాల పెంపుదలే లక్ష్యంగా లోతైన అవగాహనతో పటిష్ఠ కార్యాచరణ చేపట్టాల్సిన అత్యంత కీలకాంశాన్ని యూజీసీ గుర్తించినట్లు లేదు. ప్రక్షాళనంటూ ముందూవెనుకలు చూడకుండా కొన్ని నిర్ణయాలు తీసుకుంటూ ఈ ముసాయిదాను రూపొందిం చిందనేది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు సిబ్బంది న్యాయస్థానాలను ఆశ్రయిస్తే అసలుకే మోసం వచ్చిపడుతుంది. ఈ మార్పుల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మాత్రమే మానవ సమాజానికి అభివృద్ధిపథం అని పొరపాటు పడిన పాలకులు వర్సిటీల్లోని ఉన్నత విద్యను, పరిశోధనలను నిర్లక్ష్యం చేశారు. నిజానికి విశ్వవిద్యాలయాల్లో, శాస్త్రీయ రంగాల్లో కోర్ సైన్సెస్‌లో జరిగిన పరిశోధనలే ఏ ఇంజనీరింగ్, టెక్నాలజీ అభివృద్ధికైనా ఉపయోగపడేవి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ లాంటి రంగాల్లో విశ్వ విద్యాలయల్లో చాలా పరిశోధనలు జరిగితేనే శాస్త్ర, సాంకేతిక సంస్థల్లో పరిశోధన అడ్వాన్స్‌డ్ విషయాల్లో సాగుతుంది. ఈ మూల శాస్త్రాలు ప్రగతి సాధించకపోతే కష్టం. ఈ వాస్తవాన్ని విశ్వవిద్యాలయాలూ పట్టించు కోలేదు. అలాగే సామాజికశాస్త్రాలైన ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఎడ్యుకేషన్, పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ వంటి శాస్త్రాల ద్వారా సమాజాన్ని అర్థం చేసుకోవాలి. లేకపోతే సామాజిక విలువలు దెబ్బతింటాయి. అది అన్ని రంగాలకూ విస్తరిస్తుంది. ఇప్పుడు అదే జరిగింది. కాబట్టి ఉన్నత విద్యారంగాన్ని ప్రక్షాళించాలన్న సంకల్పం ఒక్కటే సరిపోదు, క్షేత్రస్థాయి స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలి, వాస్తవాలను అంచనా వేయాలి. యూజీసీ ముసాయిదా తీరు అలా లేదు. బీజేపీ సర్కారు.. యూజీసీ, అఖిల భారత సాంకేతిక విద్యామండలిని రద్దుచేసి వాటి స్థానే ఉన్నత విద్యా సాధికారత నియంత్రణ సంస్థను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నందున తన ఉనికిని నిలుపుకొనేందుకు హడావుడిగా యూజీసీ ఈ ముసాయిదాను తీర్చిదిద్ది నట్లుగా ఉంది. మోదీ ప్రభుత్వం చేస్తున్న అహేతుక చర్యను తిప్పికొట్టా ల్సిందేగానీ, అందుకు ఇది మార్గం కాదు.

చురక

తెలంగాణ పరిపాలన
తెరమీదకు డిజిటల్
అధికారుల క్షేత్రస్థాయి
ఆలోచన క్రిటికల్

రూములో్ల కూర్చొని
రాజ్యమేలే సులువు
ఆన్‌లైన్ ఫోన్‌లైన్
అధికారమే సులువు

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

కులాలు, తెగల ప్రత్యక్ష సంఘర్షణ



నల్లి ధర్మారావు

రాష్ట్ర ప్రభుత్వం వల్ల ఉత్తరాంధ్రలో కొత్త చిచ్చు రగిలింది. బహుశా, రాష్ట్ర చరిత్ర లోనే ఇది, మున్నెన్నడూ కనిపిం చని విషాదం. మత్స్యకారులను ఎస్.టిలలో చేరుస్తామని, 2014 ఎన్నికల్లో టీడీపీ వాగ్దానం చేసింది. ఏళ్లు గడుస్తున్నా, దాన్ని అమలుచేసే ప్రయత్నం చేయ లేదు. సరికదా, వారిని రెచ్చగొట్టి నట్టుగా బోయ, వాల్మీకి కులాలను ఎస్.టి జాబితాలో చేర్చు తున్నట్టు ప్రకటించింది. దీనికి నిరసనగా గిరిజన ప్రాంతాల్లో ఆందోళనలు ప్రారంభమయ్యాయి. సంఖ్యా పరంగా ఎక్కువగా ఉన్న, మత్స్యకారులు తమను విస్మరించారని, వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలో గిరిజనుల, మత్స్యకారుల మధ్య చిచ్చు రాజేసినవాళ్ళు ఎవరో గానీ, విద్వేషం రగిలింది. ఫిబ్రవరి అయిదో తేదీన, కొండ కోనలు దిగి, దాదాపు ఆరువేల మంది గిరిజనులు వివిధ వాహనాల్లో శ్రీకాకుళం చేరుకున్నారు. దాదాపు రెండు కిలోమీటర్లు నగర ప్రధాన రోడ్లపై మహాప్రదర్శన చేసి, కలెక్టరేట్‌కు వచ్చారు. అక్కడ 46రోజుల నుంచి కొనసాగుతున్న మత్స్యకారుల దీక్షా శిబిరం వుంది. రెచ్చగొట్టిన, రెచ్చిపోయిన శక్తులేవో తెలియదు. గిరిజనులు, కొద్ది నిమిషాల్లోనే ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. శిబిరాన్ని దగ్ధం చేశారు. ఆ తరువాత మత్స్యకార నాయకులు ఆగ్రహంతో గిరిజన సంఘాలకు సవాల్ విసిరారు. ఉత్తరాంధ్ర తీరమంతా భగ్గుమన్నది. మత్స్యకారుల పరామర్శకు వస్తానని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించడం, గిరిజను లకు ఆగ్రహం కలిగించింది. ఆ తరువాత, గిరిజన సంఘాలు మీడియా ద్వారా మత్స్యకారులకు క్షమాపణలు చెప్పారు. సంఘ విద్రోహ శక్తులు తమ ప్రదర్శనలో చొరబడ్డాయని అనుమానం వ్యక్తం చేశారు. శిబిరాన్ని దగ్ధం చేసే పెట్రోలు పాకెట్లతో కొందరు వచ్చారని, ఇది పథకం ప్రకారం ఎవరో పన్నిన కుట్ర అని, ప్రత్యక్ష సాక్షులైన మీడియా ప్రతినిధులతో పాటు చాలమంది అభిప్రాయపడ్డారు. వేల మంది తరలివచ్చిన కార్యక్రమం, సున్నితమైన అంశంతో ముడిపడిన ఆందోళనకు తగిన సంఖ్యలో పోలీసు బందోబస్తులేదు. వంశధార నిర్వాసితులను పరామర్శించడానికి సిపిఐ, సిపిఎం రాష్ట్ర నాయకులు రైళ్లో వస్తే, ముందుగానే పసిగట్టి రైల్వే స్టేషన్‌లోనే అరెస్టు చేసిన ఇంటెలిజెన్స్, పోలీసులకు వుంది. ఆందోళనలకు పిలుపునిస్తే, నాయకులను ముందుగానే అరెస్టులతో, గృహనిర్బంధాలతో అరెస్టు చేసిన అనుభవాలున్నాయి. ఇటువంటి 'ఇంటిలిజెంట్' పోలీస్ యంత్రాంగం, 50-100 కి.మీ నుంచి గిరిజనులు వేలాదిగా తరలిరావడాన్ని గుర్తించలేదంటే నమ్మశక్యంగా లేదు. టీడీపీ వాగ్దానాన్ని నమ్మి మోసపోయిన మత్స్యకారుల ఆందోళనలకు వైకాపా మద్దతిచ్చింది. మత్స్యకారుల్లో ప్రభుత్వం పట్ల, టీడీపీ పట్ల ద్వేషం పెరిగింది. దీన్ని గమనించి, గిరిజనులకు చేరువ కావడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యూహరచన చేసిందా? దానిలో భాగంగానే మత్స్యకారుల శిబిరంపై దాడి జరిగిందా? అనే అనుమానపు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆచరణ సాధ్యం కాని వాగ్దానం!

కొన్ని కులాలను బీసీ జాబితాలో చేర్చడం సులువు. ఒక కమిషన్‌ను నియమించి, అధ్యయనం చేయించి, అది సమర్పించిన నివేదికలోని సిఫార్సుల ఆధారంగా బి.సిలుగా ప్రకటించవచ్చు. ఎస్.సి., ఎస్.టి. జాబితాల్లో కొత్త కులాలను చేర్చడానికి రాజ్యాంగ బద్ధమైన, శాస్త్రీయమైన విధానం వుంది. 'సంప్రదాయ అంటరానితనం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా అత్యంత సాంఘిక, ఆర్థిక వెనుకబాటు తనానికి గురికావడం' అనే మార్గ దర్శక సూత్రం ప్రకారం, అర్హత గల కులాలను ఎస్.సి.జాబితాలో చేర్చుకోవచ్చు. ఎస్.టి.లకు సంబంధించి మార్గదర్శక సూత్రాలు మరీ, శాస్త్రీయమైనవి. ఆదిమ సమాజపు ఆనవాళ్లు, విశిష్ట సంస్కృతి, భౌగోళిక ఒంటరితనం, ప్రధాన జనస్రవంతిలో కలవని బిడియం, అంతర్వివాహం, సమిష్టి ఆంక్షల వంటి ఆచార, సంప్రదాయాలు - ఇలాంటి అంశాలన్నీ అధ్యయనం చేయాలి. దీనికి, పురాతత్వ, భాషా శాస్త్రాలు లేదా పునర్నిర్మాణ సాధనాలు ఉపయోగించాలి. సాధారణంగా ఎస్.సి., ఎస్.టి జాబితాల్లో కొత్త కులాలను చేర్చడానికి దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ప్రయత్నించదు. ఎందుకంటే, అలాచేస్తే కొరివితో తల గోక్కోవడమేనని వాటికి తెలుసు. పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న చంద్రబాబు మాత్రం, 2014లో ఎలాగైనా అధికారం సంపాదించాలనే తాపత్రయంతో ముందూ, వెనకా ఆలో చించకుండా వాగ్దా నాలు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలోనే రాతపూర్వ కంగా వాటికి కట్టుబడే సాహసం చేశారు. ఎన్నికల ప్రయోజనాలు తప్ప, చరిత్ర అనుభవాలు ఆయన గమనంలో లేవు. కాపులను బీసీల్లో చేర్చడానికి, బీసీ జాబితాలోని గ్రూపుల సవరణకు మంజునాథ కమిషన్ వేసిన రాష్ట్ర ప్రభుత్వం, బోయ, వాల్మీకి, మత్స్యకారుల కోసం ఎస్.టి. కమీషన్ కూడా వేసి ఉండాల్సింది. అలా చేయకుండా, రాయలసీమలో రాజకీయ ప్రయోజనాల కోసం బోయ, వాల్మీకులను ఎస్.టి జాబితాలో చేర్చుతున్నట్టు ప్రకటించారు. శాసనసభలో తీర్మానం చేయించారు. పొరుగు రాష్ట్రాల అనుభవాలను కూడా, చంద్రబాబు గమనించలేదు. ఒడిసాలో వాల్మీకి కులం, మత్స్యకారుల్లో ఒక ఉపకులమైన 'కంద్ర' ఎస్.సి. జాబితాలో ఉన్నాయి. తమిళనాడులో 'పరవార్' అనే మత్స్యకార కులాన్ని ఎస్.సిగానే పరిగణిస్తున్నారు. దేశంలో బ్రిటిష్ వారి అణచివేతకు గురైన 829 'విముక్తి జాతులు' ఉన్నాయి. బ్రిటిష్ పాలనలో, పాలనాయంత్రాగానికి సమస్యలు సృష్టిస్తున్నారని దాదాపు 200 సంచార తెగలపై 'క్రిమినల్ ముద్రవేసి 'నేరస్థ తెగలు' గా (క్రిమినల్ ట్రైబ్స్) ప్రకటించారు. దీన్ని క్రిమినల్ ట్రైబ్స్ చట్టంగా (1871) తీసుకువచ్చారు. ప్రపంచ చరిత్రలో ఒక జాతిపై 'నేరస్థులు' అనే ముద్రవేసి, అణచివేయడం అదే తొలిసారి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, 1952లో ఈ తెగలకు భారతప్రభుత్వం విముక్తి కలిగించింది. నాటి నుంచి వాటిని విముక్తి (డినోటిఫై) జాతులుగా గుర్తిస్తున్నారు. బ్రిటిష్ వారి అణచివేతవల్ల, అన్ని రంగాల్లోనూ చిదిగిపోయినా తమను, ఎస్.టిలుగా గుర్తించాలని చాలా కాలం నుంచి అవి డిమాండ్ చేస్తున్నాయి. వీరి స్థితి , గతులు తెలుసుకోవడానికి, 2005లో కేంద్ర ప్రభుత్వం బాలకృష్ణ రెన్‌కే కమిషన్ ఏర్పాటు చేసింది. 2008లో ఈ కమిటీ నివేదిక వచ్చింది. దీని ప్రకారం, దేశంలోని ఎస్టీలలో 260, ఎస్సీలలో 148, బీసీల్లో 301 తెగలను కలుపుకొని మొత్తం 829 ఉన్నట్టు నివేదిక తెలిపింది. ఎస్సీ, బీసీల జాబితాల్లో ఉన్న తెగలు చాలా దయనీయంగా జీవిస్తున్నారని తెలిపింది. ఆ కులాలు కూడా, ఎంతో కాలంగా ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నాయి. కానీ ప్రభుత్వాలు సాహసించడం లేదు

> ఉత్తరాంధ్రలో కొత్త చిచ్చు

రాజకీయ ప్రయోగానికి కాంగ్రెస్ శ్రీకారం

రాజకీయ ప్రయోజనాల కోసం, రిజర్వేషన్ పాచికలు విసిరే అమానవీయ ప్రయోగానికి శ్రీకారం చుట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే, 1970 నుంచి బి.సి-ఎలో ఉన్న లంబాడీలను, ఎరుకల, యానాదులను 1976లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్.టి.జాబితాలో చేర్చింది. పార్లమెంట్‌లో బిల్లు, రాష్ట్రపతి ఆమోదముద్ర లేకుండానే ఈ ప్రకటన చేసింది. సంచార తెగలను ఎస్.టీలుగా గుర్తించడం సబబేనని సమర్థిం చుకుంది. ఈ నిర్ణయాన్ని అంతవరకూ, ఎస్.టిజాబితాలో ఉన్న తెగలన్నీ వ్యతిరేకించాయి. ఉద్యమం ప్రారంభించాయి. 2005లో నక్కల, పిట్టల వారిని ఎస్.టీల్లో చేర్చారు. దీన్ని, టీడీపీ అందుకుంది. తెలంగాణాలో టి.ఆర్.ఎస్. కూడా 2015లో వాల్మీకి, బోయ, రజక, కైతాలంబాడీలు, అంబలంబాడీలను చేర్చడానికి జస్టిస్ చెల్లప్ప కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నిజానికి, శాసనసభ సిఫార్సు తీర్మానాలను పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతి పరిశీలనకు పంపించాలి. గవర్నర్ సలహా తీసుకొని, రాష్ట్రపతి తిరిగి పార్లమెంట్‌కు పంపిస్తే, అక్కడ మూడువంతుల మెజార్టీతో ఆమోదం లభించాలి. ఆ తరువాత, రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే, చట్టంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ వ్యవహారమంతా తెలియనిది కాదు. పూర్తిగా తెలియనది, అమాయక జనానికే! రిజర్వేషన్ల వ్యవహారం దేశంలో ఎప్పుడూ, ఎక్కడో, ఓ చోట ఏదో దుమారం రేపుతూనే వుంది. ఆందోళనలు, ఉద్యమాలు జరుగుతూనే వున్నాయి. రాజకీయ, ఎన్నికల ప్రయోజనాల కోసం అధికారం కోసమే పనిచేస్తున్న పార్టీలు వాటికి ఆజ్యం పోస్తూనే వున్నాయి. కానీ, కులాల మధ్య ప్రత్యక్ష ఘర్షణ ఏనాడూ దాదాపు లేదు. కులాలు, తెగల మధ్య ఘర్షణకు ఆస్కారమేకలగలేదు. బహుశా, నాగరిక, ప్రజాస్వామిక దేశ చరిత్రలోనే తెగలు, కులాల మధ్య ప్రత్యక్ష సంఘర్షణ తొలిసారిగా శ్రీకాకుళంలో జరిగింది. ఏవో ప్రేరేపిత శక్తుల పాత్ర లేకపోతే, కల్మషం ఎక్కువగా ఎరుగని గిరిజనులు, సహజంగా మైదాన ప్రాంతీయులను చాలా వరకు శంకిస్తూ, వారికి దూరంగా వుండే గిరిజనులు సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో కదిలిరావడమే ఆశ్చర్యం. వచ్చిన తరువాత, కలెక్టర్‌కు తమ గోడు విన్నవించుకునే దానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, మత్స్యకారుల శిబిరంపై దాడి చేయడం చాలామందిని దిగ్భ్రాంతులను చేసింది. శ్రీకాకుళం వామపక్ష ఉద్యమం, గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో గిరిజనులు, మత్స్యకారులు కలిసిపనిచేసి, ఒకరి కోసం ఒకరు ప్రాణా త్యాగాలు చేసిన నేపథ్యం వుంది. ఇంతటి చరిత్ర గలిగిన మట్టిపై కులాల, తెగల మధ్య ప్రత్యక్ష ఘర్షణకు జావాబుదారీ టీడీపీ ప్రభుత్వమే! సామాజిక, మానవీయ కోణంలో ఆపార్టీకి ఇది మాయని మచ్చగానే మిగిలిపోతుంది.

మోడీ.. మాటల మాంత్రికుడు

కె.రవీంద్రన్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ దుబాయిలో జరిగిన ప్రపంచ ప్రభుత్వ శిఖరాగ్ర సమావేశంలో కీలక ప్రసంగం చేశారు. ఫ్రాన్స్ ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టిన్ లగార్డే, ఎంటర్‌టెయిన్మెంట్ ఐకాన్ రాబర్ట్ డి నిరో, ఆస్ట్రోఫిజిస్ట్ నీల్ డిగ్రాస్సె టైసన్ వంటి దిగ్గజాలు ప్రధాన ప్రసంగికుల్లో ఉన్నారు. భవిష్యత్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వాలు ఏ విధంగా ముందుకు సాగాలన్న అంశంపై ప్రధానంగా చర్చించారు. ఇది మోడీకి ఇష్టమైన అంశం.. భవిష్యత్‌లో ప్రభుత్వాల విధివిధానాల గురించి ఆయన అనర్గళంగా మాట్లాడారు. ఆచరణలో పరిస్థితి ఏదైనాగానీ మాటలతో తనదైన ముద్ర వేసుకోగల మాటల మాంత్రికుడు ఆయన.



ఇటీవల పార్లమెంటులో బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన అద్భుతంగా ప్రసంగించారు. మాటలతో మాయచేశారు. భారత పార్లమెంటులో ఎన్నడూలేని విధంగా మాట్లాడి అందరిని ఆకర్షించారు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో సీపీఐ(ఎం) నాయకులు ఏకే గోపాలన్ తర్వాత అంతటి వాగ్ధాటి గల వ్యక్తి మోడీ అని చెప్పవచ్చు. ఏకే గోపాలన్ ఇష్టాయిష్టాలు ఎప్పుడో మరుగునపడ్డాయి. నేడు పార్లమెంటులో మోడీకి ఉన్నంత వాక్ చాతుర్యం మరెవ్వరికీ లేదు. భాషపై మంచి పట్టు, చలోక్తులతో పాటు ఆశువుగా సామెతలను చెప్పడంలో అతల్ బిహారీ వాజ్‌పేయికి మంచి శిష్యుడిగా మోడీ ఎదిగారు. అయితే, మోడీ ఆంగ్ల ప్రసంగాల గురించి రాసేందుకు పెద్దగా ఏమీ లేదు. కానీ హిందీలో మాట్లాడితేగనుక శ్రోతలను కట్టిపడేస్తారు. అందరూ మోడీ మాయలో పడిపోతారు. ఇదే పరిస్థితి మొన్న పార్లమెంటులో కళ్లకుకట్టినట్టు కనిపించింది. ఆధార్ గురించి మాట్లాడుతున్న సమయంలో రేణుకా చౌదరి కిసుక్కుమన్నందుకు ఆయన రామాయణం నాటి రోజుల గురించి మాట్లాడిన తీరు దుమారం రేపింది. ఆయన కచ్చితంగా ఎవ్వరి వ్యక్తిత్వం గురించి మాట్లాడనప్పటికీ ఆయన మాటల ప్రభావం కాంగ్రెస్‌నేతపై తీవ్రంగా ఉండివుంటుంది.

ఏదిఏమైనా మోడీని మాటల్లో జయించడం ఎవ్వరి తరం కాదని స్పష్టమవుతోంది. అయితే చెప్పినది చేయడంలో ఆయన వరుసగా విఫలమవుతున్నారు. నాలుగేళ్ల పాలనలో మాటలతో మాయ చేస్తున్నారే తప్ప ఆచరణలో చెప్పుకో దగ్గ విధంగా ఏమీ చేయలేదు. మోడీ ఉద్దేశాలు మంచివే అయివుండవచ్చు కానీ వాటిని ఆచరణలో పెట్టడంలో ఆయన బృందం పూర్తిగా విఫలమవుతోంది. ఏదో కొంతమంది మినహా ఆయన బృందంలోని చాలా మంది సభ్యులు విజన్‌ను సాధించేంత సమర్థులు కాదు. మోడీ విధానాలు, ముఖ్యంగా అరుణ్‌జైట్లీ నేతృత్వంలో ఆర్థికశాఖ నిర్వహణపై యశ్వంత్ సిన్హా చేసిన వ్యాఖ్యలు ఓ అసంతృప్తిపరుడి మాటల్లా అనిపించవచ్చుగానీ, ఆయన వాదనల్లో నిజం లేకపోలేదు. పెద్దపెద్ద హామీలు ఇచ్చినప్పటికీ ఇటీవల జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ తమను తామే మోసగించుకొనే విధంగా ఉంది.

మూడేళ్ల క్రితం మోడీ దుబాయి వెళ్లినప్పుడు ఆయన ప్రసంగాన్ని వినేందుకు క్రికెట్ స్టేడియం వద్దకు సుమారు 50వేల మంది భారతీయులు తరలివచ్చారు. భారత ప్రధాని రాకను వేడుకగా జరుపుకున్నారు. కానీ ఈసారి దుబాయి ఒపేరాలో కేవలం 2వేల మందిని ఉద్దేశించి మోడీ మాట్లాడారు. ఎందుకంటే హామీలు ఇవ్వడానికి.. వాటిని నెరవేర్చడానికి మధ్య తేడాను ప్రజలు గ్రహించారు. అయితే మస్కట్‌లో ఆయన భారీ సభలో మాట్లాడారు. మోడీ ఇప్పటివరకు తన పర్యటనలో భాగంగా చెప్పుకోదగ్గ పరిణామం అబుదాబీలో హిందూ దేవాలయానికి శంకుస్థాపన చేయడం ఒక్కటే. కాగా, దుబాయిలో ఇప్పటికే ఒక పురాతన ఆలయం ఉంది. అది రాచరిక కుటుంబం ప్రార్థనలు ఆచరించే మసీదు పక్కనే ఉంటుంది. ఈ దేవాలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆలయ నగరాన్ని తలపిస్తుంది. సమీపంలోనే రెండు మసీదులు ఉండడం, అదీ అరబ్ దేశం కావడంతో ఇలాంటి పరిస్థితి ఆశ్చర్యకరమే. బుర్ దుబాయి ఆలయంగా అది ప్రసిద్ధి. యావత్ గల్ఫ్‌లోనే అది మొట్టమొదటి ఆలయం. ఆ తర్వాత మస్కట్‌లో ఓ శివాలయం నిర్మితమైంది. దీన్ని సుల్తాన్ సహకారంతో ఒమన్‌కు చెందిన భారతీయ కుటుంబం ఖిమ్‌జీలు కట్టించారు. దుబాయిలో పెద్ద గురుద్వారా కూడా ఉంది. ఇది అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం తర్వాత అతిపెద్ద సిక్కుల ఆలయంగా ప్రాచుర్యం పొందింది.

ప్రభుత్వ సేవల ద్వారా ప్రజలకు సంతోషం, సంతృప్తి కలిగించాలన్న ప్రయాస మోడీ చేయాల్సి ఉంటుంది. ఆనందం కోసం ఒక మంత్రిత్వశాఖను నెలకొల్పిన దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఇ) ఒక్కటే. సంతోషకరమైన సమాజ నిర్మాణానికి అవసరమైన అన్ని చర్యలను అక్కడి ప్రభుత్వం తీసుకొంటోంది. 2021 నాటికి తమ దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన ఐదు అగ్రదేశాల్లో దేశాల్లో చూడాలన్నదే యూఏఇ ప్రభుత్వం లక్ష్యం. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి జీవనశైలి, సంతృప్తికరంగా ఉన్నదా లేదా, వారి ఆదాయం తదితర వివరాలను సర్వేల ద్వారా ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుంటుంది. ప్రతిఒక్క ప్రభుత్వ విభాగాన్ని ప్రజాప్రతినిధులుగా కాకుండా కస్టమర్లలా చూడడం యూఏఇ ప్రత్యేకత. ఇలాంటి పాఠాలనే మోడీ నేర్చుకోవాలి. తద్వారా భారతీయుల జీవితాల్లో సుఖసంతోషాలను నింపేందుకు యత్నించాలి.

ఇ-మెయిల్

కేంద్రంతో అంటకాగినందుకే రాష్ట్రానికి అన్యాయం జరిగింది

మన దేశంలో దాదాపు 60 సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలన తర్వాత యన్.డి.ఏ. అవతారమెత్తి రెండవసారి అధికారంలోకి వచ్చిన భారతీయజనతా పార్టీ తెలుదేశం కూటమి రెండు కలిపి విభజిత హామీలు పొందివున్న మన రాష్ట్రానికి విదిలింపులే లేక హక్కులను కూడా అడుక్కునే స్థితికి తెచ్చారు. నోట్లరద్దు, జి.యస్.టి. లాంటి కేంద్రప్రభుత్వ నిర్ణయాలవల్ల కుదేలైపోతున్న అనేక పారిశ్రామిక రంగాల నష్టాలతో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి కూడా గణనీయంగా దెబ్బతిన్నది. ఇచ్చామని, తెచ్చామని చెప్పి కలిసి మభ్యపెట్టటానికి చాంతాడంత ఉందిగాని ముడివేయడానికి కుదరడంలేదు.

ఎవరి లెక్కలు వారివే. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీదే ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత అని ప్రజలు భావిస్తున్నారు. ఈ ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థలో రాష్ట్రాల హక్కులను హరించే కేంద్ర విధానలకు మొదటిసారిగా వంతపాడిన మన రాష్ట్రం పూర్తిగా నష్టపోవడమే కాక నిందమోయాల్సివచ్చింది. ఇక పరిపాలన విషయానికి వస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విదేశాలకు వెళ్ళి మరీ బహుళజాతి కంపెనీలను, కార్పోరేట్ పరిశ్రమలను రాయితీలతో ప్రోత్సహిస్తూ వాటివల్ల కాలుష్యం బారిన పడి నాశనమయ్యే పంటలకు, చనిపోయే ప్రజలకు పూర్తిస్థాయి బీమా సౌకర్యం కల్పిస్తుండడం వింత పరిణామం. ఈ జాతికి పట్టిన దురదృష్టమూ మేమే, అదృష్టమూ మేమే అంటోంది కేంద్ర ప్రభుత్వం. వ్యవసాయరంగంలో దళారుల వ్యవస్థకి అడ్డుకట్టవేయలేదు, రైతుల పంటలకు, కౌలు రైతులకు బ్యాంకి రుణాలు కల్పించలేదు, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లాంటివాటిని అరికట్టే వ్యవస్థలమీద నిఘాలేదు. కానీ రైతులు అకౌంటబులిటీ. ఆత్మహత్య చేసుకుంటే పరిహారం మాత్రం రెడీ అంటూ, మీకు జీవించే సౌకర్యాన్ని కల్పించలేకపోయినా మృత్యువాత పడితే ఆదుకుంటాం అండగా ఉంటాం అన్న భావన అంతుపట్టని విషయమే. ఈ దేశంలో బ్లాక్‌మనీని వెలికితీయడానికి, ఉగ్రవాదాన్ని మట్టుబెట్టడానికి నోట్లరద్దును తెచ్చి ఇళ్లల్లో దాచుకున్న పాతనోట్లన్నీ బ్యాంక్‌లకు తెప్పించి ఆరునెలలు టైమిచ్చి, అందరూ బ్యాంకుల్లో వేశాక మనడబ్బు మనం తీసుకోవడానికి మనల్ని నెలలతరబడి లైన్లో నిలబెట్టి, శ్రమపడడం అంటే ఏమిటో మనుషులకు తెలియజెప్పి మేలు చేశామంటున్నారు. ఈ దేశంలో మొత్తం ఎంతడబ్బు రొటేషన్ అవుతుందో తెలుసుకున్న ది గ్రేట్ ప్రభుత్వం మాదే అని మోడీ చెప్పుకుంటున్నారు. ఏ రాష్ట్రానికైనా నిధులు సమకూర్చడానికి మేం బడ్జెట్‌లో ప్రతిపాదించక్కరలేదు. మేమే పార్లమెంటులో చేసిన ప్రకటనలకు విలువ ఇవ్వనక్కరలేదు, ఆర్థిక సంఘాలు, నీతి ఆయోగ్‌ల సలహాలతో ప్యాకేజీల ప్రకటనలతో కొత్తవరవడి సృష్టిస్తాం, రాష్ట్రాలు పొదుపుగా ఖర్చుపెట్టేందుకు, ఎప్పుడూ మాతో టచ్‌లో ఉండేందుకు నిధులకు లెక్కలడిగి నింపాదిగా రిలీజ్ చేస్తాం అంటూ ఈ ఫెడరల్ వ్యవస్థను కూడా అపహాస్యం చేసిన పద్ధతికి మన రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామి అయింది. పార్లమెంటు సాక్షిగా ప్రత్యేకహోదా, రైల్వేజోన్ లాంటి విషయాలన్నీ, కుండబద్దలు కొట్టినట్లు అడిగేది మేమే..వాటిని అటకెక్కించే హక్కు కూడా మాదే అని గట్టిగా చెబుతున్నారు. హిందువుల మనోభావాలను గౌరవిస్తూనే ముస్లింల ట్రిబుల్ తలాక్ లాంటి వాటిల్లో వేలుపెట్టి వారి అభిమానాన్ని కూడా ఓట్లుగా మల్చుకోవడం మాకు వెన్నతోపెట్టిన విద్య అని చెప్పకనే చెబుతున్నారు.

ఒకే దేశం, ఒకే పన్ను విధానం పూర్తిగా సమర్థించి బిల్లు తెచ్చారు... కానీ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే కొన్ని ఉత్పత్తులను పన్ను నించి మినహాయింపునిచ్చారు. ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం ఇవ్వాలంటే కష్టమే కాబట్టి బ్యాంక్‌లో జీరో అకౌంట్‌తో ఖాతా తెరిపించి లోన్ ఇప్పిస్తాం. దాంతో కష్టపడి వ్యాపారంచేసి, వడ్డీలు, పన్నులు తిరిగి మాకే కట్టండి అంటూ ఈ దేశంలో ప్రథమంగా శ్రమపడే తత్వం యువకులకు అలవాటు చేసిన ఘనత మాదేనంటున్నారు. పచ్చని పొలాలన్నీ ఆర్డినెన్స్‌ల రూపంలో ప్రజలవద్దనుంచి లాక్కున్న తర్వాత ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో కాలయాపనకు టైం లిమిట్ లేదు, ఈలోగా నదులన్నీ కూడా అనుసంధానం చేస్తాం. కానీ వాటికి కేటాయింపులు మా ఇష్ట ప్రకారం అనేది వారి ఉవాచ. అన్నమో రామచంద్రా అని అరచి అరచి దిక్కులేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులకు వారు త్రాగి ప్రాణంతీసుకునే పురుగు మందులకు సబ్సిడీ దొరుకుతుందన్న సంతృప్తి తప్ప వేరే ప్రయోజనంలేదు. వారి మరణాన్ని విస్తృతంగా ప్రచారం చేసుకున్న టి.వీ. ఛానల్స్ రేటింగ్ విపరీతంగా పెరుగు తోందంతే. ప్రతి పక్షాలను తుంగలో తొక్కి ప్రభుత్వంలో భాగస్వామ్య మైన నాయకులకు, పనిచేసే పార్టీ కమిటీలకు నిధులు కేటాయిస్తూ కార్మికులను పట్టించుకోవడంలేదనే వాదన సరికాదు, ప్రజలకోసం నిరంతరం శ్రమిస్తున్న వారంతా కూడా శ్రమజీవులే అనేది వారి భావన. అన్ని రాష్ట్రాలు, ప్రజలు, క్యాష్ లెస్ విధానాన్ని కోరుకుంటున్నారు... ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం చేసింది కూడా అదేకదా. ఉన్న క్యాషంతా బ్యాంకుల్లోకి పంపించి జనం దగ్గర క్యాష్ లెస్ చేశారు కదా! విమానాలకు, ఫస్ట్‌క్లాస్ రైలు టిక్కెట్లకు బోలెడన్ని రాయితీలు ప్రకటి స్తున్నా ఉపయోగించుకోలేని సామాన్య జనం విషయంలో వారేం చేస్తారు. హోదా బదులు ప్యాకేజీ, రైల్వేజోన్ బదులు మరింకేదైనా, చేస్తామనేది వారి వాదన. అభివృద్ధి నిరంతర ప్రక్రియ, ఒకే సారి నిధులు ఇవ్వడం కుదరదనే సరికొత్తవాదనతో రాష్ట్ర ప్రభుత్వం ఏకీభవిం చడంతోనే ఇన్ని ఇబ్బందులు వచ్చాయి.

వెనుకబడిన జిల్లాలకు నిధులు కావాలని అడిగితే అసలు మా పరిపాలనలో వెనుకబడిన జిల్లాలే లేకుండా అంతా సశ్యశ్యామలం చేస్తామంటున్నారు. సీబీఐని అస్త్రంగా వాడుకున్న వారిందరిమీద అదే అస్త్రాన్ని ప్రయోగించి దారిలో పెడుతున్నామంటున్నది ప్రభుత్వ మనసులో మాట. వారి మనోగతం ఎవరికీ అర్థం కావడంలేదు. అధికార వ్యామోహంతో ఊగిపోయే వారందరినీ దానికి దూరంగా ఉంచుతాం. ఎందుకంటే మేము చేస్తున్న అభివృద్ధికి రాబోయే కాలంలో ప్రజలు శాశ్వతంగా మాకే పట్టం కట్టబోతున్నారు అని ధీమాగా ఉన్న కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకోవాలంటే రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షాలు సమిష్టిగా కృషి చేయక తప్పదు.

- జోస్యుల వేణుగోపాల్, విజయవాడ

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
15 ఫిబ్రవరి 2018



మంచు కురిసే వేళలో!

రహదారులు, వాటి చుట్టూ ఉన్న చెట్లు అన్నీ మంచుమయమైన ఈ దృశ్యం హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలోది. అక్కడున్నవారు ఈ విపరీతమైన మంచు కారణంగా ఎలాంటి పాట్లు పడుతున్నారో తెలీదు కానీ చూడడానికి మాత్రం 'మంచు కురిసే వేళలో మనసు మురిసేదెందుకో..." పాటని గుర్తు చేసేంతగా...మంచి అనుభూతిని కలిగిస్తోంది కదూ!



పాకిస్తాన్ పక్కా ముస్లిం దేశం...ఇక్కడ మైనార్టీలుగా ఉన్న హిందువులు పడే కష్టాలు, బాధలు అన్నీఇన్నీకావు. వారిపై వివక్ష, వేధింపుల గురించి ఎన్నో కథనాలు వచ్చాయి, వస్తున్నాయి. మొత్తంగా హిందువులు పరిస్థితే ఇలా ఉంటే హిందువుల్లో అట్టడుగు వర్గంగా పేర్కొనే దళితుల వేదనల గురించి ఇంక చెప్పేదేముంది. ఇలాంటి దారుణమైన పరిస్థితులను ఎదిరించి నిలబడింది ఆమె...బురదలో నుంచి కమలం వికసించినట్లుగా....బానిసత్వం బాధలను ఛేదించుకుని బయటకు వచ్చింది.....ఉన్నత విద్య, సామాజిక సేవ బాటలో ఇప్పుడు చట్టసభ వరకూ ఎదిగింది....ఆమే...కొల్హీ కృష్ణకుమారి. సింధ్ నుంచి పాకిస్తాన్ సెనేట్ (ఎగువ సభ)కు ఎన్నిక కానున్న మొట్టమొదటి దళిత మహిళగా, రెండో హిందూ మహిళగా చరిత్ర సృష్టించనుంది.



బానిసత్వం నుంచి చట్టసభ వరకూ..!!

పాక్ సెనేట్‌కు దళిత మహిళ!

పూర్తిగా ముస్లిం ఆధిపత్యం ఉన్న పాకిస్తాన్‌లో ఒక హిందూ మహిళ అందునా దళిత మహిళ చట్టసభల వరకూ వెళ్ళడం అంటే ఆషామాషీ విషయం కాదు. ఈ విషయంలో విజయం సాధించిన కృష్ణకుమారి వెనక కూడా పెద్ద కథే ఉంది...కాదు వాస్తవ గాథ ఉంది. ఆమెది బానిస కుటుంబం. భూస్వాముల పెత్తనాన్ని చవిచూసిన కుటుంబం. వారి కారణంగా మొత్తంగా కుటుంబమే జైలు పాలైంది. ఈ రకంగా జైలు జీవితం గడిపిన ఆ కుటుంబ సభ్యుల్లో కృష్ణకుమారి కూడా ఉంది. తెలీసి తెలీని వయస్సులోనే, మూడో తరగతి చదువుతున్నప్పుడే తల్లిదండ్రులతో పాటు ఆమె జైలు జీవితాన్ని అనుభవించింది. ఇప్పుడు ఇదే భూస్వాముల పక్కన తనకూ ఒక కుర్చీ వేయించుకుని చట్టాలు చేయనుంది కృష్ణకుమారి. ఇదీ ఆమె సాధించిన గొప్ప విజయం. పాకిస్తాన్ ఎగువసభకు మరో రెండు వారాల్లో జరగనున్న ఎన్నికల్లో ఆమె ప్రతిపక్ష పీపీపీ (పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ) తరపున పోటీ చేస్తోంది. ఆమె విజయం దాదాపుగా ఖరారైంది. ఎన్నిక కేవలం లాంఛనప్రాయమే. ఈ నేపథ్యంలో ఇప్పుడు కృష్ణకుమారి పేరు, ఆమె గురించిన వార్తలు ఒక్క పాకిస్తాన్‌లోనే కాదు ప్రపంచ దేశాలలో మార్మోగుతున్నాయి.

బాసటగా నిలిచిన భర్త

కృష్ణకుమారికి పదహారేళ్ల వయస్సులోనే పెళ్ళి అయ్యింది. భర్త లాల్ చంద్ ఆమె చదువును ఆపలేదు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఉన్నత విద్యను కొనసాగించటంతోపాటు సింధ్ యూనివర్సిటీ నుంచి 2013లో సోషియాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్‌నూ పూర్తి చేశారు.



సామాజిక సేవా కార్యక్రమాలు

కృష్ణకుమారి ఈ పేరు సింధ్ ప్రాంత వాసులకు బాగా సుపరిచితం. 2005 నుంచి ఆమె ఆ ప్రాంతంలో సామాజిక సేవా కార్యకర్తగా పని చేస్తున్నారు. థార్పార్కర్ ప్రాంతంలో జరిగే పలు సదస్సులు, సమావేశాలలోనూ పాల్గొన్నారు. 2007లో పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన మూడవ మెహర్గర్ హ్యూమన్ రైట్స్ యూత్ లీడర్‌షిప్ ట్రైనింగ్ క్యాంప్‌నకు ఎంపికయ్యారు. ఆ సమయంలోనే ప్రపంచ ప్రజా ఉద్యమాలపై అవగాహన, పాకిస్తాన్‌లో సామాజిక ఉద్యమాల చరిత్ర, దేశంలో పాలనా వ్యవస్థపై పూర్తిగా అవగాహన కలిగింది. అక్కడ నుంచే సాంఘిక మార్పునకు వ్యూహాత్మక ప్రణాళికలు, ఉప కరణాలను కూడా ఆమె నేర్చుకున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఆమె బంధన కార్మికుల కేసులను గుర్తించటానికి యువత, సివిల్ యాక్షన్ ప్రోగ్రామ్ కోసం పని చేశారు. ప్రధానంగా బానిసత్వం, మహిళా బానిస బతుకులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై పని ప్రదేశాలలో సెమినార్లు నిర్వహించటంతోపాటు వారి సమస్యలపై పలు వార్తపత్రికలకు వ్యాసాలు కూడా రాశారు.

పీపీపీలో చేరిక

సామాజిక సేవా కార్యక్రమాల నేపథ్యం నుంచే ఆమె రాజకీయాల వైపు దృష్టి మళ్ళించారు. పాకిస్తాన్‌లో దళితుల సమస్యలపై పని చేస్తూ మంచి సామాజిక సేవా కార్యకర్తగా పేరు తెచ్చుకున్న కృష్ణకుమారి తన సోదరుడు వీర్‌జీ కొల్హీతో కలిసి ఇటీవలే పీపీపీలో చేరారు. ఇప్పుడు ఆ పార్టీ తరపునే చట్టసభకు పోటీ చేయనున్నారు. అత్యంత ధనవంతులు, భూస్వాములున్న సింధ్ నుంచి పాకిస్తాన్ సెనేట్‌కు (ఎగువ సభ)కు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని ఆమె దక్కించుకున్నారు.

గెలుపు ఖాయం!

ఒకప్పుడు బానిసత్వాన్ని చవి చూసిన కృష్ణకుమారి నేడు చట్టాలు చేసే సెనేట్‌కు ఎన్నికకానుంది. గతంలో 2006 నుంచి 2012 వరకు రత్నా భగవాన్‌దాస్ చావ్లా సెనేట్‌కు ప్రాతినిధ్యం వహించగా, రెండో మహిళగా కృష్ణకుమారి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ ఘనత సాధించిన మొదటి దళిత మహిళగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న కృష్ణకుమారికి పీపీపీ అధినేత బిల్వాన్ భుట్టో సింధ్ ప్రావిన్స్ నుంచి సెనేట్‌లో ప్రాతినిధ్యం వహించేందుకు అభ్యర్థిగా ఎంపిక చేశారు. పీపీపీ సీనియర్ నాయకుల సమక్షంలో ఇప్పటికే ఆమె నామినేషన్‌ను దాఖలు చేశారు. సింధ్ ప్రావిన్స్‌లో మొత్తం 168 స్థానాలుండగా, పీపీపీకి 94, ప్రతిపక్షానికి 72 సభ్యుల బలం ఉంది. దీంతో కృష్ణకుమారి గెలుపు నల్లేరు మీద నడకేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ధైర్యం నింపిన తల్లిదండ్రులు!

దళిత కుటుంబంలో పుట్టినందుకు తమ బతుకులు ఇంతేనని కుంగిపోలేదు కృష్ణకుమారి తల్లిదండ్రులు. పిల్లల్లో ధైర్యాన్ని నూరిపోశారు. జైలు జీవితంతో సహా ఎన్ని కష్టాలొచ్చినా ఎలా ఎదురొడ్డి నిలబడాలో నేర్పించారు. కడు పేదరికంలోనూ, వాళ్ళు ఎలాంటి బాధలు పడినా తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించారు. ఇన్నేళ్ల తర్వాత వారి కష్టానికి ఫలితం దక్కింది. చట్టాలను అడ్డం పెట్టుకుని ఇప్పటికీ తమపై పెత్తనం చెలాయిస్తున్న భూస్వాములతో పాటు సరిసమానమైన స్థానాన్ని తమ కూతురు అందుకునేంత సామర్థ్యాన్ని అందించారు.



సింధ్, థార్ బాలికల విద్యే ప్రధమ లక్ష్యం

పాకిస్తాన్ సెనెట్ అభ్యర్థిత్వాన్ని పొందిన కృష్ణకుమారి బాలికా విద్యపైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహించనున్న సింధ్, థార్ ప్రాంతాల్లో బాలికలను విద్యాపరంగా చైతన్య పరచటమే తన లక్ష్యమని ఆమె చెబుతున్నారు. పేద రైతు కుటుంబంలో జన్మించిన తనకు పాక్‌లో చట్టాలు చేసే సభకు ప్రాతినిధ్యం వహిస్తానని ఎన్నడూ ఊహించలేదని అంటున్నారు. మహిళా సమస్యలపైనా పని చేస్తాననంటున్నారు. అన్ని వర్గాల ప్రజలకు విద్య ప్రాధాన్యాన్ని తెలియజేయటంతోపాటు ప్రాథమిక హక్కుల సాధనకు పోరాడే దిశగా చైతన్యవంతుల్ని చేసేందుకు కృషి చేస్తానన్నారు. సింధ్ ప్రాంత బాలికలు, మహిళల గొంతును పాకిస్తాన్ సెనేట్‌లో వినిపించేందుకు సిద్ధమవుతున్న తొలి హిందూ దళిత మహిళ కృష్ణకుమారికి ఆల్ ది బెస్ట్ చెబుదాం.

దాసరి శ్రీనివాసరావు, విజయవాడ

స్వాతంత్ర్య పోరాట నేపథ్యం...!

సింధ్ రాష్ట్రంలోని థార్ ప్రాంతం ఉమర్‌కోట్, నాగార్పర్కర్ జిల్లా థానా గ్రామంలో 1979 ఫిబ్రవరి 1న కృష్ణకుమారి జన్మించారు. ఆమె తండ్రి కొల్హీ జుగ్నో దళిత రైతు. 1857లోనే బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వీరి పూర్వీకులు పోరాటం చేశారు. బ్రిటీష్ సైన్యం సింధ్ ప్రాంతంపై దాడి చేసినపుడు వారిని రూపో్కొ కొల్హీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. దీంతో బ్రిటీష్ పాలకులు ఆయన్ని అరెస్టు చేసి 1858లో ఉరి తీశారు. ఈ ప్రాంతంలో మొదటినుంచీ భూస్వాములదే పెత్తనం. ఈ నేపథ్యంలో కృష్ణకుమారి కుటుంబం ఆమెకు ఊహ తెలిసేనాటికి భూస్వామి వద్ద బానిస బతుకును గడుపుతోంది. తల్లిదండ్రులు పొలంలో పనిచేసేవారు. రోజు వారీ వచ్చే కూలీ డబ్బులే వారి జీవనాధారం. పూట గడవడమే కష్టమైన దారుణమైన పరిస్థితుల్లోనూ కృష్ణకుమారి, ఆమె సోదరుడు వీర్‌జీ కొల్హీని వారు చదివించారు. న్యాయవాదిగా ఉన్న వీర్‌జీ కొల్హీ సింధ్ ప్రాంతంలోని యూనియన్ కౌన్సిల్ బెరానో చైర్మన్‌కు జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సోదరి కృష్ణకుమారితో కలిసి పాకిస్తాన్ మాజీ ప్రధాని బేనజీర్ భుట్టోకు చెందిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)లో చేరారు. సహజంగా పాకిస్తాన్ రాజకీయ పార్టీలు....ధనవంతులు, భూస్వాములు, అందులోనూ ముస్లింలకే సెనేట్ టిక్కెట్‌లను ఇస్తుంటాయి. అలాంటిది పార్టీలో చేరిన కొద్ది రోజులకే నాన్ ముస్లిం (హిందూ దళిత) అయిన కృష్ణకుమారికి సింధ్ ప్రావిన్స్ నుంచి సెనేట్‌కు పోటీ చేసే అవకాశం ఇవ్వడం విశేషం. సింధ్ ప్రావిన్స్‌లో అధికారంలో ఉన్న పీపీపీ 12 మందిని సెనెట్‌కు ఎంపిక చేసింది. వారిలో మహిళా కోటాలో కృష్ణకుమారికి సీటు లభించగా, వచ్చే నెల మూడున ఎన్నికలు జరగనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కృష్ణకుమారి తప్పకుండా సెనెట్‌కు ఎన్నికవుతుందని పీపీపీ నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు.

గుండె కోసం... గుమ్మడి గింజలు !

కూర వండుకునే తీపి గుమ్మడికాయ తెలుసుగా....ఈ గుమ్మడిని కూర వండినప్పుడు అందులో గింజలు ఏం చేస్తున్నారు? తీసి పాడేస్తున్నారా? సాధారణంగా మనం ఏ గింజలనైనా తీసిపడేస్తుంటాం. కానీ ఇది సరైనది కాదు. అన్నింటికంటే ముఖ్యంగా తీపి గుమ్మడికాయలోని గింజలను ఏరిపారేయకుండా ఎంచక్కా తినేయండి. కూరలోనే కాదు ఈ గింజలను స్నాక్స్‌గానూ తీసుకోవచ్చు. ఇవి చూడడానికి చీమంతే ఉంటాయి కానీ వీటినిండా పోషకాలే. గుమ్మడి గింజలు మీరు తరచూ తింటూ ఉంటే మీ శరీరానికి కావలసిన జింక్, మెగ్నీషియం, కాపర్, ప్రోటీన్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులూ అందుతాయి. వీటిల్లో ఐరన్, బీ విటమిన్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ గింజల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వుల్లో రక్తనాళాల ఆరోగ్యానికి అవసరమైన ఆమ్లాలు ఉంటాయి. ఇవి రక్తంలోని అనారోగ్యకరమైన కొవ్వులను కరిగిస్తాయి. ఈ గింజల్లో ఉండే పీచుపదార్థం ఎక్కువసేపు ఆకలివేయకుండా అదుపు చేస్తుంది. మహిళలు, పురుషులు ఎవరికైనా ఇవి మంచివే. ఈ గింజలు గుండె ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతాయి. చెడు కొవ్వులను తగ్గించేందుకు దోహదం చేసే మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ ఇందులో ఉండడమే కాదు శరీరానికి కావలసిన మంచి కొవ్వులను ఇవి పెంచుతాయి. ఈ గింజల్లో ఉండే సెరటోనిన్, ట్రైటోఫాన్‌లు మంచి నిద్ర పట్టేలా చేస్తాయి. మీకు సరిగ్గా నిద్రపట్టడం లేదా? అయితే నిద్రకు ఉపక్రమించడానికి ముందు గుప్పెడు గుమ్మడి గింజలను తినండి. ఇవి కీళ్ళ నొప్పులను తగ్గిస్తాయి. కీళ్ళల్లో నొప్పులు ఉన్నవాళ్ళు ఈ గింజలను తినడం లేదా ఈ గింజల నుంచి తీసిన ఆయిల్‌ను వాడడం మంచిది. గుమ్మడి గింజల్లో సమృద్ధిగా ఉండే ఫైటోకెమికల్స్, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఫ్లూ, జలుబు లాంటి వైరల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా చూస్తాయి. పుష్కలంగా పీచుపదార్థం ఉండడం వల్ల ఇది అరగడానికి ఎక్కువసమయం పడుతుంది. దీనివల్ల తొందరగా ఆకలి వేయదు. తద్వారా బరువు తగ్గడానికీ ఇవి దోహదపడతాయి. బ్రెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, పొట్ట కేన్సర్, ప్రోస్టేట్ కేన్సర్, పేగు కేన్సర్ లాంటి అనేక రకాల కేన్సర్ ముప్పునీ తొలగిస్తుంది. మెనోపాజ్ దశకు చేరిన మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటివారు.

గుమ్మడిగింజలు తింటే కేన్సర్ భయం ఉండదు. డయాబెటీస్ రోగులకూ ఇది మంచిదే. రక్తంలో షుగర్‌స్థాయిలను తగ్గిస్తుంది. వీటిని తింటే జుట్టూ బాగా పెరుగుతుంది. ఇన్ని రకాల ప్రయోజనాలు ఉన్న వీటిని వదిలేస్తే ఎలా? ఇకనుండి కూర లేదా సలాడ్ల రూపంలో తప్పనిసరిగా తీసుకోండి. ఇష్టమైతే పచ్చివీ అలాగే తినేయవచ్చు. ఇలా తినలేనివాళ్ళు కాల్చుకునీ తినవచ్చు.



అతడు-ఆమె

74



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

నాకు దేశంమీద భక్తి - సంసారం అంటే సంతోషం - సుభ మీద వాత్సల్యం - పాపాయి అంటే ప్రేమ - శాస్త్రిమీద మోహం - ఆనందమైన మనుగడ భ్రమకాదు - ఇహం భ్రాంతికాదు-ఇదే వాస్తవం...అయినా - స్వార్థ త్యాగులు-విరాగులు-అతీతులు అయిన నాయకుల క్రింద పని చేయడమా అని అనుమానం కాని, అభిజాత్యంకాని నాకు లేదు. "ఎందరో మహానుభావులు - అందరికీ వందనములు!" మహా భావులందరిలోనూ మహానుభావుడైన మహాత్మునికి సాష్టాంగ నమస్కృతులు అర్పిస్తున్నాను. ఆయన నామం స్మరిస్తూనే దెబ్బలు తిన్నాను.

....సామానులు కట్టేశాను. మరోగంట యింకా వ్యవధి వుందని చెప్పినా వినకుండా పాపాయి, సుభ శాస్త్రికోసం రైలు కిటికీలోనుంచి తొంగి చూస్తున్నారు: నేనూ వుండలేకుండా వున్నాను - అతని కంఠస్వరం చెవిని పడేదాక - అతని ప్రేమలో లీనం అయిపోయేదాక - అతని కౌగిట్లో కరగిపోయేదాక...

(నిన్నటి సంచిక తరువాయి)

88 అతడు

ఆదివారం బొంబాయి చేరుతూన్నట్టు శాంతం టెలిగ్రాం వేసింది. అబ్బ, ఇప్పటికి నాకు బెంగతీరింది!

ప్రయాణం ఖర్చులకోసం పదివేలున్నూ, యూరప్‌లో ఖర్చులకోసం యాభై వేలున్నూ మొత్తం అరవై వేలకి చెక్కు రాసి బ్యాంకు నుంచి డబ్బు తీసేసరికి ప్రాణం చివుక్కుమంది: కష్టార్జితం అలా అనిపిస్తుంది. నాలుగు రోజులై ఒకటే వీడ్కోలు విందులు! అన్నిటి గురించి శాంతంతో పూసగుచ్చినట్టు చెప్పాలి. ఈ యెన్నికల కుతంత్రాలు - యిప్పటినుంచీ రాబోయే మంత్రి వర్గాన్ని కూడగట్టేందుకు మంత్రాంగం యీ సమయంలో నేను వుండకపోవడం నాకు చాలా కష్టంగానే వుంది. కాని నా స్నేహితులకి అమిత సంతోషంగా వుంది - ఒక పోటీదారుడు తగ్గినా తగ్గడమేనని! ఆ విందుల్లో అంతర్థానమే అది:

షెవ్రలెట్టుకారు టాక్సీ కంపెనీకి అమ్మేశాను. ప్యాకార్డు పురుషోత్తపురం వాడు కొనుక్కున్నాడు. వెనక తమ రైతులమీద క్రోధంకొద్దీ పెట్టిన కేసుల్లో గెలిపించినా నా ఫీజుల్లో రెండువేలు ఎగ్గొట్టి నా నోట్లోనే కరక్కాయ కొట్టినందుకు - ఆ రెండువేలు యీ కారు అమ్మకంలో లాగేశాను! వీళ్ళకి మనుష్యులమీద మోజుండదు - యెంతసేపూ కార్లమీదే మోజు. కృతజ్ఞత, అంతఃకరణ లేనివాళ్ళు - తగిన శాస్తి చేశాను! బంగళా అద్దెకిచ్చేశాను. మళ్ళీ ఆ సినిమావాళ్ళకే. తారలు యిద్దరూ కళంకం వొచ్చి కాబోలు కొంచెం వెలవెల బోతున్నారు. బ్రహ్మచారి దర్శకులిద్దరూ ముదిరిన బెండకాయలయ్యారు.

...నన్ను సాగనంపడానికందరూ సెంట్రలు స్టేషను కొచ్చారు. భాష్యం తన కారుమీద నన్ను స్టేషనుకి తీసుకొచ్చాడు. సుబ్రహ్మణ్యం, లేడీ అయ్యం గారూ శాంతాన్ని మరీమరీ అడిగామని చెప్పమన్నారు. ఈ నూతన దాంపత్యం వచ్చాక అతను ఉత్సవ విగ్రహం లాగున్నాడు! ఆవిడ సౌందర్యం మరీ కొట్టొస్తున్నట్టుంది! కళ్ళని పొడుస్తూంది ఆవిడ వొయ్యారం! రైలు కదులుతూంటే "బారసాల వేళకల్లా శాంతం మీరూ రావాలి సుమండీ శాస్త్రిగారూ!" అంది. శాంతంతో యీ విశేషం చెప్పాలి!

రామస్వామీ - పదిమంది మల్లవరం కంబార్లు - రైలు కొచ్చారు. "ఈ అనాథ పక్షుల ప్రాణాలు మీ చేతిలో వున్నాయి. వాళ్ళని రక్షించాలి సుమండీ!" అని నమస్కరించి, "మా శిబిరం వారందరి తరపున శాంతం గారికి నమస్తేలు చెప్పండి - గాంధీ మహాత్మకు జై!" అన్నాడు. హరిజన రైతులు పదిమందీ నా కాళ్ళమీద పడ్డారు. "తాత ముత్తాల కాలంనుంచి మా చమట చుక్కలతో ఆ మడి చెక్కలని తడుపుతూ కనిపెట్టుకున్నాం - బాబూ! యేలినవారు మమ్మల్ని ఆ మట్టిమీద నిలబెట్టించాలి!" అంటూ వాళ్ళు వాళ్ళచేతులతో నా జోళ్ళు కళ్ళ కద్దుకునే సరికి నా వొళ్ళు జజ్జరిల్లి పోయింది. "యేం ఫరవాలేదు! నేనున్నానుగా - మీరేం భయపడకండి!" అని వాళ్ళకి అభయం యిచ్చాను. పాపం ఆ అనాథ ప్రేతాలని చూసి జాలివేసింది.

నా జూనియర్లు అశ్వత్థ నారాయణమూర్తి, రామన్, కురువిళ్ళ, తీర్థగిరి - పెద్ద పువ్వులదండ ఒకటి మోసుకొచ్చి నా మెడలో వేశారు. అంతటితో పూరుకున్నారా! పది పదిహేను గళాసుల్లో సోడాలు పోసి, జేబుల్లోంచి చిన్న హోమోపతీ సీసాలు తీసి - దానిలోనించి ఒక్కొక్క చుక్క సోడాల్లో పోశారు. "ఏమిటదీ?" అన్నా. "సోడాలోని కల్మషాన్ని శుద్ధి చేయడానికి జాన్ ఎక్షావారి ద్రాక్షాసవం!" అన్నాడు తీర్థగిరి. అశ్వత్థ నారాయణమూర్తి తుదిగళాసులో రెండు చుక్కలు నేలమీద పోసి - "ఓం! సుమిత్రయాన ఆప ఓషధయ్యస్సంతు - దుర్మిత్రియాః తస్మైస్సంతు!" అంటూ అందరికి గళాసులు అందజేశాడు. దాంతో కురువిళ్ళ "కాబోయే సుప్రీము కోర్టు జడ్జీగారికి జై!" అంటూ గడగడ త్రాగేశాడు. వీళ్ళందరికీ నేనంటే యెంత అభిమానం!



ఊర్వశికూడా వచ్చింది చక్కని చుక్కలాగు తయారై - నన్ను సాగనంపడానికి! నే నిన్నాళ్ళున్నూ గమనించేలేదు. - ఊర్వశి బుగ్గని చిన్న లొత్తుంది. "సెక్కిట సిన్నీమచ్చ - సెప్పితే సాలదు లచ్చ" అన్నట్టు ఆమె నవ్వితే యెంతో అందంగా వుంది! దగ్గరకొచ్చి అంది: "మీరు నిరాకరించిన స్థానానికి మా పక్షం వాళ్ళచేత మరి ఒకరిని నిలబెట్టించాను."

"ఎవరిని?" అని అడిగే.

"నామధేయం - ఊర్వశిమిత్ర, వృత్తి - మెరీనామీద పర్యటనం! సాకీను - రాయపేట, మద్రాసు!" అంది.

సోడా పుచ్చుకొని చెవిలో అంది: "శాస్త్రిగారూ! ఇక అంతా మామాప్యర్థమే!" అమ్మామ్మా! గడుసుదనం అంటే అలాగుండాలి! రాజకీయం అంతా లావాదేవీ క్రింద మార్చేసింది. చాకచక్యం - దానికి తోడు అదృష్టం కలిసిరావాలి.

"శాంతానికి నా ప్రేమ తెలుపండేం?" అని కేకేసింది - రైలు కదులుతూంటే చేతితో ముద్దులు విసురుతూను!

...రైలు రాయచూరు దాటింది. ఇంకా రెండురోజులు ఓపికపట్టి వుండాలి శాంతాన్ని చూసేందుకు! శాంతం యీపాటికి ఢిల్లీ చేరుకుని సాయంత్రం బయలుదేరుతుంది. బొంబాయి....శాంతానికి ఇంగ్లండంతా చూపిస్తాను. లండనులో బ్రిటిష్ పార్లమెంటు భవనానికి తీసుకెళ్లి ప్రజాస్వామ్యం యొక్క జన్మస్థానం చూపిస్తాను. నిజంగా చూస్తే కన్సర్వేటివు ప్రభుత్వం క్రిందే సోషలిజం జయప్రదంగా ముందుకు నడు స్తూంది. తన కళ్ళతో తనే చూస్తే శాంతానికి తెలుస్తుంది. సత్యాగ్రహం సత్యాగ్రహం అని బండతనం పంతం పనికొస్తుందా? రాజకీయంలో అన్నిటికీ తయారయి ఉండాలి. అందుచే తల-లేకపోతే కాళ్లు! ఈ రహస్యం శాంతం బోధపర్చుకోదు! బ్రిటిషువాడిచేతిలోనుంచి అర్ధస్వరాజ్యం ఎలాగ లాగనే లాగేం, ఆ మిగిలిన సగమున్ను అవలీలగా కడుపులో చల్ల కదలకుండా హస్తలాఘవం చేసి లాగెయ్యాలీ అంటే - దొంగ వాకిట్లో మంచం వేసినట్లు - వాడు అవలంభించిన పంథానే మనుమున్ను అవలంభించాలి. అంటే - పార్లమెంటు, కామన్సు, లార్డ్సు, మంత్రివర్గం, కాబినెట్టు, సెక్రటరీలు, లార్డు ఛాన్సలరు, ప్రీవికౌన్సిలర్లు, సొలిసిటర్ జనరల్, అటార్నీ జనరలు - మనంకూడా అన్నిటికీ ఒక నకలు తయారుచేసి అమలులో పెట్టాలి. అప్పుడు మనని మెచ్చుకుని వాడే పారేస్తాడు సంపూర్ణ స్వరాజ్యం.

షేక్స్పియరు పుట్టిన వూరు చూపిస్తాను శాంతానికి. స్కాట్లండులో మెల్ రోజు ఎబ్బేకి తీసుకెళతాను. ఏకాంత సరస్సుల దృశ్యాలు చూపిస్తాను. లండనులో ఓల్డువిక్ - శాడ్లర్సు వెల్సు - లిటిల్ థియేటర్లకి వెళతాం. సిబిల్ థారన్‌డైకు, జోసే కాలిన్సు నోయర్ కవర్డు సి.బి కాక్రేన్ - వీళ్ళ నాటక కళని చూపిస్తాను. గిల్బర్టు అండు సల్లి వన్ను నాటకాలకి తీసుకువెళ్ళి పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్విస్తా! మా ప్రేమ శాంతాన్ని నన్ను ఎలా బంధించేసిందో సంగీతాభిమానం కూడా మమ్మల్నిద్దరినీ అలాగే బంధించేసింది. నాకదొక గొప్ప సంతోషం! క్వీన్సు హాలు ప్రోమినేడు కచేరీలకీ, ఆల్బర్టు హాలు కచేరీలకీ కలిసి వెళతాం. ఆ ఇంగ్లీషు వాగ్గేయకారులని బీచాము, వుడ్డు, సార్జెంటుగార్లరీని - చూచి శాంతం ఆశ్చర్యపడక మానదు. కవెంటు గార్డెను గ్రాండు ఓపెరాకి వెళతాం! ఒక్కసారి వెయ్యిమంది గాత్రజంత్ర సమ్మేళనం వింటే శాంతం తన్మయం అయిపోతుంది. క్రైస్లరు పాడెరెవ్స్కీ - కరూసో - షాలియాపిన్ - హైఫెట్జు - మెనుహిన్ను - వీళ్ళ సంగీత కాలక్షేపాలకి తీసుకు వెళతాను. క్రాయిట్జరు సొనాటా రాగచ్ఛాయలు - మూనులైటు సొనాటాలోని ప్రేమతరంగాలు - బాఖ్ భక్తిరస గానామృతం - బెథోవెన్ను తొమ్మిదో సింఫొనీలోని నాదభావాల జిలుగు అల్లికలు - షూబర్టు ప్రణయగీతాలు తానాలు - మొజార్టు సంగీత ప్రబంధాలు - వాగ్నరు విప్లవగర్జన స్వరాలు - స్ట్రాసు నాద శబ్దస్వర బీభత్సం - డీ బుస్సీ వెండిమువ్వల స్వరజతులు - గెర్ష్విన్ నీగ్రో కూని రాగాల గమకాల - వీటిని వింటే - శాంతం త్యాగరాజుగారినీ, దీక్షితులవారినీ, శ్యామశాస్త్రులవారినీ మరి మూలపెట్టేసి, గుంట పెట్టి గంట వాయిస్తుంది! ఆ ఉత్సాహంతో మన సంగీతంతో కొత్త మార్పులు నూతన ప్రయోగాలు ప్రయత్నిద్దాం అంటుంది తప్పకుండా...ఒక్కజాతికే చెందిన రెండు మూడు రాగాలు కలిసి పాడితే యెలా గుంటుందో, ఒక్క రాగమే వేరువేరు స్థాయిల్లో యేక సమయంలో నలుగురు పాడితే యెలా ధ్వనిస్తుందో? సాంప్రదాయం అంటే చెవికోసుకొనేవాడిని నాకే యీ విప్లవ బుద్ధులు పుడుతున్నాయే? అయినా నేను మొదటి దగ్గర నుంచీ - తెలుగువాడిదీ, తెల్లవాడిదీ అన్నింటిలోనూ మిళితం చెయ్యాలి అని చెవికోసిన మేకలాగు అరుస్తూనే వున్నాను. కాని నా గోడు వినేవాడేవడు - ఈ ఉద్యమం రోజుల్లో! మీదుమిక్కిలి నన్ను దేశద్రోహి అని తిట్టిపోశారు కూడాను! ఎప్పటికైనా నా దారికే వచ్చితీరాలి. లేకపోతే మన కలలకీ మనకీ కూడా మోక్షంలేదు...

....సంగీతం చక్కగా యెవరిమటుకు వాళ్ళు పాడుకుంటే, కానీ ఖర్చులేకుండా ఆనందం పొందవచ్చు - కళనీ అభివృద్ధి చెయొచ్చు. అయితే నాకూ శాంతానికీ యిచ్చినట్టు - దేవుడు అందరికీ గాత్రం యిచ్చాడా?

- ఇంకా వుంది.

రైల్వేలో కొలువుల జాతర

దేశవ్యాప్తంగా 62,907 గ్రూప్-డి పోస్టుల్లో చేరే అద్భుత అవకాశాన్ని భారతీయ రైల్వేశాఖ కల్పిస్తోంది. 18 నుంచి 31 సంవత్సరాల మధ్య వయసుండి, పదోతరగతి/ ఐటీఐ/ నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ పొందినవారు ఈ ఉద్యోగాలకు పోటీపడవచ్చు. వీటిలో చేరితే రూ.18,000 నెల వేతనంతోపాటు ఎన్నో సౌకర్యాలు లభిస్తాయి. మొత్తం పోస్టుల్లో 6523 పోస్టులు కేవలం సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో భర్తీ చేయనున్నారు.



62,907 గ్రూప్-డి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఈ నియామక ప్రక్రియలో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష నిర్వహిస్తారు. అందులో అర్హత మార్కులు సాధించినవారికి శారీరక దారుఢ్య పరీక్ష ఉంటుంది. రాతపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా పోస్టులు భర్తీ చేయనున్నారు. 12.03.2018 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసుకోవాలి.

- కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలో 100 ప్రశ్నలను పూర్తి చేయడానికి 90 నిమిషాల సమయాన్ని కేటాయించారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 40శాతం, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ వారు 30శాతం కనీస అర్హత మార్కులు పొందాలి.
- అర్థమెటిక్, మేథమెటిక్స్, జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు రుణాత్మక మార్కులున్నాయి.

అర్థమెటిక్, మేథమెటిక్స్

వ్యాపార గణితంలోని ప్రశ్నలు రోజువారీ దినచర్యలో భాగంగా మనం చేసే పనికి వర్తించుకుంటూ ఆలోచిస్తే సమాధానాలు తక్కువ సమయంలో పూర్తి చేయవచ్చు. నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకుని, ఇంటీజర్లు, భిన్నాలు, డెసిమల్ నంబర్లకు బాడ్‌మాస్, పెడ్‌మాస్ సూత్రాలను అప్లై చేయడం నేర్చుకోవాలి. వర్గాలు, వర్గమూలాలు, ఘనాలు, ఘనమూలాలు చేయడం సాధన చేయాలి. కసాగు, గసాభా, నిష్పత్తి-అనుపాతం, శాతాలు, వ్యాపార భాగస్వామ్యం, లాభనష్టాలు, చక్రవడ్డీ, బారువడ్డీ, కాలం-పని, కాలం-దూరం, వైశాల్యాలు, ఘన పరిమాణాలకు సన్నద్ధమవ్వాలి. తక్కువ సమయంలో షార్ట్‌కట్ ఫార్ములాలను వాడుతూ సమాధానాలు గుర్తించడం సాధన చేయాలి.

క్యాలెండర్, గడియారాలకు సంబంధించిన ప్రశ్నలనూ సాధన చేయాలి. బీజీయ సమాసం, రేఖాగణితం, త్రికోణమితి, సాంఖ్యకశాస్త్రాలకు సంబంధించిన సమాధానాలను గుర్తించాలంటే ఫార్ములాలను ఉపయోగించడం తెలియాలి. వీటి ఫార్ములాలను ఒక పట్టిక రూపంలో తయారు చేసుకుని, ప్రతిరోజూ 10 నిమిషాలు వెచ్చించాలి. రోజూ ఇలా మననం చేసుకోవడం ద్వారా ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలను గుర్తించవచ్చు.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

రీజనింగ్‌లో లాజికల్ రీజనింగ్ నుంచి నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, ఆడ్‌మాన్ అవుట్, సింబల్స్, నొటేషన్స్, వెన్ చిత్రాలు, రక్తసంబంధాలు తదితర అంశాలపై ప్రశ్నలు వస్తాయి. సీటింగ్ అరేంజ్‌మెంట్ నుంచి గ్రూప్‌గా 2-3 ప్రశ్నలు వస్తాయి. డైరెక్షన్స్, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్, స్టేట్‌మెంట్-అసంప్షన్, డెసిషన్ మేకింగ్, సిలాజిజం నుంచీ ప్రశ్నలు వస్తాయి.

ప్రశ్నలో ఉన్న తర్కం (లాజిక్) ఆధారంగా నంబర్లు ఎలా మారుతున్నాయో గమనించి, సమాధానాన్ని గుర్తించాలి. గుర్తించేప్పుడు పూర్తి సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే సిలాజిజం, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్స్, స్టేట్‌మెంట్-అసంప్షన్స్ ప్రశ్నలకు సమాధానాలను కచ్చితంగా గుర్తించవచ్చు. ఎక్కువ ప్రశ్నలు సాధన చేసి ఎన్ని మోడల్స్ ఉన్నాయో వాటిని నోట్స్ రూపంలో రాసుకోవాలి. పరీక్షలోపు వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలు సాధన చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అంశాల్లో నంబర్ పజిల్స్, సిమిలారిటీ, డిఫరెన్సెస్, మిర్రర్ ఇమేజ్, వాటర్ ఇమేజ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అలాగే డేటా సఫిషియన్సీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచీ ప్రశ్నలుంటాయి. ఎంత ఎక్కువ సాధన చేస్తే అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు. సులభంగా మార్కులు తెచ్చుకుని స్కోర్ పెంచుకోవడానికి అవకాశం ఉన్న సెక్షన్ ఇది.

జనరల్ సైన్స్

పదోతరగతి స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆబ్జెక్టివ్ విధానంలో అడగడానికి అవకాశం ఉన్న ప్రశ్నలకు సంబంధించిన మెటీరియల్ సేకరించాలి. దానికి ఎక్కువ సమయం కేటాయించి సమాచారాన్ని గుర్తుంచుకునేలా చదవడం అలవాటు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పునశ్చరణ (రివిజన్) చేస్తే చదివిన సమాచారం ఎక్కువ రోజులు గుర్తుంచుకోవచ్చు.

జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్

పదోతరగతి స్థాయిలో ఉండే చరిత్ర, భౌగోళిక, ఆర్థిక, రాజనీతి శాస్త్రాలపై అవగాహన ఉండాలి. శాస్త్రీయ, సాంకేతిక అంశాలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులు గమనించాలి. రోజువారీ దినపత్రికలు చదువుతూ వాటి సమాచారాన్ని సేకరించాలి. కేంద్రప్రభుత్వ పథకాలు, ఇతర దేశాలతో కుదుర్చుకున్న సంబంధాలు, దేశాధినేతలు, కరెన్సీ, రాజధానులు, వార్తల్లోని వ్యక్తులు, ప్రదేశాల ప్రాముఖ్యం, పుస్తకాలు-రచయితలు, అవార్డులు, ఆటలకు సంబంధించిన విషయాలు తదితర అంశాలపై సన్నద్ధమవ్వాలి.

విద్యార్హత : కొన్ని విభాగాలకు పదోతరగతి ఉత్తీర్ణత. మిగిలిన వాటికి పదోతరగతితోపాటు ఐటీఐ లేదా నేషనల్ అప్రెంటీస్ సర్టిఫికెట్ ఉండాలి (ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లు అనర్హులు)

వయోపరిమితి : జులై 1, 2018 నాటికి 18 నుంచి 31 ఏళ్లు (ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి)

ఎంపిక విధానం : ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష ద్వారా

వేతనం : ఎంపికైనవారికి రూ.18,000 మూలవేతనంగా చెల్లిస్తారు. దీంతోపాటు ఇతర అలవెన్సులు ఉంటాయి.

పరీక్ష ఫీజు : ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు రూ. 250; జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500

దరఖాస్తులు : ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ : ఫిబ్రవరి 10.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ : మార్చి 12, 2018.

విశాలాంధ్ర ప్రజ్ఞ

డీఆర్‌డీఈలో 7 జేఆర్‌ఎఫ్ ఖాళీలు

గ్వాలియర్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీఆర్‌డీఈ).. 7 జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హతలు : మైక్రోబయాలజీ/ బయోటెక్నాలజీ/ బయోకెమిస్ట్రీ/ ఫార్మకాలజీ/ జువాలజీ(ఎంటమాలజీ)/ కెమిస్ట్రీ(ఆర్గానిక్/ ఇనార్గానిక్/ అనలిటికల్/ ఫిజికల్) లో ఎంఎస్సీ ప్రథమశ్రేణి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో నెట్ క్వాలిఫై అయి ఉండాలి.

వయోపరిమితి : దరఖాస్తు గడువు ముగిసే నాటికి వయసు 28 ఏళు మించకూడదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన ముప్పై రోజుల్లోపు దరఖాస్తు చేరాలి.

వెబ్‌సైట్: www.drdo.gov.in

ఎన్‌ఐఏబీలో 6 ఫెలోషిప్స్

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏనిమల్ బయోటెక్నాలజీ (ఎన్‌ఐఏబీ).. 6 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ పరిధిలోని అటానమస్ ఇన్‌స్టిట్యూట్.

పోస్టు-ఖాళీలు : రీసెర్చ్ అసోసియేట్ (ఆర్‌ఏ)-1; ప్రాజెక్ట్ అసిస్టెంట్ (పీఏ)-1; ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్‌ఏ)-4.

ఫెలోషిప్ : ఆర్‌ఏ-రూ.46,800; పీఏ-రూ.22,000; ఎఫ్‌ఏ-రూ.20,000.

అర్హతలు : ఆర్‌ఏకి.. బయోఇన్ఫర్మాటిక్స్/ కంప్యూటేషనల్ బయాలజీ/ కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాల్లో పీహెచ్‌డీ లేదా ఎంటెక్ + కనీసం మూడేళ్ల అనుభవం; పీఏకి.. ఏదైనా డిగ్రీతోపాటు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో అనుభవం; ఎఫ్‌ఏకి.. డిప్లొమా (ఏనిమల్ హజ్బెండరీ) లేదా ఇంటర్మీడియెట్ (సైన్సెస్) తోపాటు లార్జ్ ఏనిమల్ హ్యాండ్లింగ్‌లో కనీసం ఏడాది అనుభవం.

దరఖాస్తు విధానం : ఆర్‌ఏ, పీఏకి ఆన్‌లైన్; ఎఫ్‌ఏకి ఆఫ్‌లైన్.

దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ : ఫిబ్రవరి 23, 2018.

వెబ్‌సైట్: www.niab.org.in

పరిశోధనలకు ప్రోత్సాహం..ఈ స్కాలర్‌షిప్‌లు

కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కొత్తగా పలు రీసెర్చ్ స్కాలర్‌షిప్/ ఫెలోషిప్ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఔత్సాహికులు, యువ శాస్త్రవేత్తలు మొదలు ఇప్పటికే పరిశోధనలు కొనసాగిస్తున్న సీనియర్ శాస్త్రవేత్తల వరకూ.. ప్రతిఒక్కరూ మరింత ఉత్సాహంగా పరిశోధనలు కొనసాగించేలా ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కొత్త రీసెర్చ్ స్కీమ్స్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. ఆయా స్కాలర్‌షిప్/ఫెలోషిప్ పథకాల గురించి తెలుసుకుందాం...

టీచర్ అసోసియేట్‌షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్(టీఏఆర్‌ఈ) :

టీఏఆర్‌ఈ.. రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీలు, కళాశాలలు, ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లలో విధులు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ సభ్యులకు ప్రభుత్వ సంస్థల్లో పరిశోధనలు చేసే అవకాశం కల్పించే పథకం ఇది. దీని ప్రకారం.. సదరు ఔత్సాహిక ఫ్యాకల్టీ సభ్యులు ఐఐటీలు, ఐఐఎస్సీ, ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర ప్రముఖ రీసెర్చ్ కేంద్రాల్లో పరిశోధనలు చేసేందుకు అవకాశం లభిస్తుంది. ప్రధానంగా లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్సెస్, భౌగోళిక-వాతావరణ శాస్త్రం, మ్యాథమెటికల్ సైన్సెస్‌లో పరిశోధనలు చేయాలనుకున్న ఫ్యాకల్టీ సభ్యులకు ఇది ఎంతో ఉపయుక్తం. దాదాపు 500 మంది ఫ్యాకల్టీకి దీని వల్ల ప్రయోజనం చేకూర్చనున్నారు. టీఏఆర్‌ఈ కింద ఎంపికైన వారికి ప్రతి ఏటా అయిదు లక్షల రీసెర్చ్ గ్రాంట్ లభిస్తుంది. దీంతోపాటు ప్రతి నెల పాకెట్ ఎక్స్‌పెన్సెస్ పేరుతో రూ.5వేల నగదు అందిస్తారు. రెగ్యులర్ వేతనంలోనూ ఎలాంటి కోత ఉండదు. అంటే.. ఈ స్కీమ్‌కు ఎంపికైన ఫ్యాకల్టీకి ప్రతినెల జీతంతోపాటు పైన పేర్కొన్న ప్రోత్సాహకాలు లభిస్తాయి. పీహెచ్‌డీ లేదా మెడిసిన్‌లో ఎంఎస్/ఎండీబీ ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులు అర్హులు. ఎంపిక ప్రక్రియ, దరఖాస్తులు తదితర పూర్తి వివరాలు సెర్బ్(సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్)లో ప్రకటిస్తారు.

వివరాలకు వెబ్‌సైట్: http://serb.gov.in/tare.php

డిస్టింగ్విష్డ్ ఇన్వెస్టిగేటర్ అవార్డ్ :

సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్(సెర్బ్) నిధులతో నడుస్తున్న ప్రాజెక్ట్‌లలో ప్రధాన పరిశోధకులుగా పనిచేస్తూ...అసాధారణ ప్రతిభ చూపిన వారికి ఫెలోషిప్ అందించే ప్రత్యేక స్కీమ్ ఇది. ప్రతిఏటా వంద మందికి ఈ ఫెలోషిప్ లభిస్తుంది. మూడేళ్లపాటు నెలకు రూ.15వేల ఫెలోషిప్ అందుతుంది. దీంతోపాటు సదరు పరిశోధకులు అందించిన ప్రాజెక్ట్ ప్రతిపాదనల ఆధారంగా అదనపు రీసెర్చ్ గ్రాంట్ ఇస్తారు. గుర్తింపు పొందిన లేబొరేటరీ, ఇన్‌స్టిట్యూట్, యూనివర్సిటీలలో గత పదేళ్ల కాలంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో అదుతే ప్రతిభ చూపిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. సదరు ఇన్వెస్టిగేటర్ జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థల్లో సభ్యత్వం కలిగుండాలి. ఔత్సాహికులను.. జాతీయ సైన్స్ అకాడమీల ప్రస్తుత లేదా మాజీ అధ్యక్షులు, నేషనల్ లేబొరేటరీస్ డైరెక్టర్లు, యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు లేదా సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ బోర్డ్ సభ్యులు నామినేట్ చేయాల్సి ఉంటుంది. అలాంటి దరఖాస్తులనే సెర్బ్ పరిగణనలోకి తీసుకుంటుంది.



వివరాలకు వెబ్‌సైట్ : www.serb.gov.in

మరో కొత్త పథకం... పీఎం రీసెర్చ్ ఫెలో ప్రోగ్రామ్

ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో... కొత్తగా ప్రధాన మంత్రి రీసెర్చ్ ఫెలో ప్రోగ్రామ్(పీఎంఆర్‌ఎఫ్)ను ప్రారంభించనున్నట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రముఖ విద్యా సంస్థల నుంచి ఏటా 1000 మంది ప్రతిభావంతులైన బీటెక్ విద్యార్థులను గుర్తించి ఐఐటీలు, ఐఐఎస్సీలో పీహెచ్‌డీ చేసేలా సౌకర్యాలు కల్పించడంతోపాటు భారీగా స్కాలర్‌షిప్‌ను కూడా అందించనున్నట్లు తెలిపారు. ఈ పీఎంఆర్‌ఎఫ్‌కు ఎంపికైన 1000 మంది అభ్యర్థులు తమ పరిశోధనలతోపాటు ప్రతి వారం నిర్దేశిత గంటలు ఉన్నత విద్యా సంస్థల్లో బోధిస్తారు. ఈ పథకం ఎంపిక ప్రక్రియ, దరఖాస్తు విధానంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓవర్సీస్ విజిటింగ్ డాక్టోరల్ ఫెలోషిప్ :

భారతీయ పరిశోధక విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి శిక్షణ పొంది.. ప్రపంచ స్థాయి ప్రమాణాలు సొంతం చేసుకునే ఉద్దేశంతో రూపొందించినదే.. ఓవర్సీస్ విజిటింగ్ డాక్టోరల్ ఫెలోషిప్. జాతీయ స్థాయిలో యూనివర్సిటీలు,రీసెర్చ్ లేబొరేటరీస్‌లో ఇప్పటికే పీహెచ్‌డీ చేస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రూపొందించిన స్కీమ్ ఇది. ఈ స్కీమ్ ప్రకారం- ప్రతి ఏటా వంద మంది పీహెచ్‌డీ స్కాలర్స్ విదేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలు, లేబొరేటరీల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన ఆర్థిక సదుపాయం లభిస్తుంది. ఏడాదిపాటు ప్రతి నెల రెండు వేల అమెరికన్ డాలర్లకు సమానమైన మొత్తాన్ని ఫెలోషిప్‌గా అందిస్తారు. దీనికి అదనంగా కాంటింజెన్సీ అలవెన్స్, ప్రయాణ ఖర్చులు, వీసా ఫీజు కోసం రూ.60వేలు లభిస్తుంది. ఈ స్కీమ్‌కు సంబంధించిన అర్హతలు, ఇతర విధి విధానాలపై త్వరలోనే నిర్ణయం వెలువడనుంది. భారతీయ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన 100 మందికి ఈ ఫెలోషిప్ లభిస్తుంది. ఎంపిక ప్రక్రియ, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర వివరాలు వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

వెబ్‌సైట్ : http://www.serb.gov.in/odf.php

అగ్‌మెంటింగ్ రైటింగ్ స్కిల్స్ ఫర్ ఆర్టిక్యులేటింగ్ రీసెర్చ్ (ఏడబ్ల్యుఎస్ఏఆర్) :

సెర్బ్, నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్‌లు సంయుక్తంగా అమలు చేయనున్న పథకం. యువ పీహెచ్‌డీ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్ వార్తా పత్రికలు, మ్యాగజీన్‌లు, బ్లాగ్‌లు, సోషల్ మీడియా ద్వారా తమ పరిశోధనలను ప్రచురించేలా ఔత్సాహికులను ప్రోత్సహించే ఉద్దేశంతో నెలకొల్పిన కొత్త స్కాలర్‌షిప్ స్కీమ్ ఇది.

ఏటా వంద బెస్ట్ ఎంట్రీస్(పరిశోధన పత్రాలు)కు రూ.పదివేల ఇన్సెంటివ్ లభిస్తుంది. టాప్-3 జాబితాలో నిలిచిన ప్రచురణలకు వరుసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేలు అందుతాయి. వీటికి అదనంగా మరో 20 మంది పోస్ట్ డాక్టోరల్ అభ్యర్థులకు రూ.పది వేలు చొప్పున, మొత్తం ప్రచురణల్లో అద్భుతమైన ప్రచురణకు రూ.లక్ష నగదు బహుమతి లభిస్తుంది. ఉత్తమ ప్రచురణను గుర్తించే క్రమంలో వార్తాపత్రికలు, మ్యాగజీన్స్, సోషల్ మీడియా, బ్లాగ్స్, ఇతర మాధ్యమాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తారు.

వివరాలకు వెబ్‌సైట్: www.dst.gov.in

విశాలాంధ్ర బిజినెస్

-144.52 సెన్సెక్స్	-38.85 నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
34,155.95	10,500.90	28,900 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	28,860 / ప్రొద్దుటూరు 28,910 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	39,400 (కిలో (రూపాయల్లో))	41,400 / ప్రొద్దుటూరు 40,962 (కిలో (రూపాయల్లో))	64.09

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోల్ ఇండియా	307.60	2.47
భారతీ ఎయిర్‌టెల్	434.20	2.39
అదానీపోర్ట్స్	411.90	2.06
రిలయన్స్	941.50	1.94
విప్రో	296.70	1.77

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్ బ్యాంక్	320.20	-4.40
ఎస్‌బీఐ	276.80	-4.06
యాక్సిస్ బ్యాంక్	534.95	-3.35
ఓఎన్‌జీసీ	191.60	-2.62
సన్‌ఫార్మా	593.90	-2.53

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి. ముగింపు	రూ.విలువ ప్ర. ముగింపు
డాలర్	64.31	64.09
యూరో	79.35	79.13
పౌండ్	89.35	88.82
ఆస్ట్రేలియా డాలర్	50.55	50.39
సింగపూర్ డాలర్	48.64	48.58

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,960	30,973
చెన్నై	28,890	30,898
బెంగళూరు	28,300	30,267
ముంబై	29,640	31,700
విజయవాడ	28,900	31,250
విశాఖపట్నం	28,860	31,483
ప్రొద్దుటూరు	28,910	30,790
ముడి చమురు		62.72



24పైసలు బలపడిన రూపాయి

ముంబై: డాలర్ మారకంతో రూపాయి విలువ 24పైసలు బలపడి 64.08 వద్ద నిలిచింది. బ్యాంకులు, ఎగుమతుల నేపధ్యంలో డాలర్ అమ్మకాలు పెరగడంతో ఇతర దేశాల కరెన్సీతో చూసుకుంటే డాలర్ విలువ తగ్గిందని చెప్పవచ్చు. జపాన్ యెన్‌తో డాలర్ ఐదునెలల కనిష్టానికి దిగజారింది. పారిశ్రామికోత్పత్తి డిసెంబర్‌లో 7.1శాతానికి చేరడంతో డాలర్ అమ్మకాలు పెరిగినట్లు తెలుస్తోంది. సోమవారం రూపాయి 8పైసల లాభంతో 64.32 వద్ద ముగిసింది.



రెడ్‌మీ నోట్ 5 వచ్చేసిందోచ్

న్యూఢిల్లీ: ప్రముఖ స్మార్ట్ ఫోన్ ఉత్పత్తుల సంస్థ షియోమీ వినియోగదారులకు ప్రేమికుల రోజు బహుమతిని ప్రకటించేసింది. షియోమీ ఈ ఏడాది తొలి స్మార్ట్‌ఫోన్‌ను వాలంటైన్స్ డే రోజు విడుదల చేసింది. న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రెడ్‌మీ సిరీస్ నుంచి నోట్ 5, రెడ్‌మీ నోట్ 5ప్రొ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. రెండు స్మార్ట్‌ఫోన్లతో పాటు ఎంఐటీవీను కూడా విడుదల చేసింది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల్లో దిగ్గజం శామ్ సంగ్‌ను వెనక్కి నెట్టి షియోమీ అగ్ర స్థానాన్ని సొంతం చేసు కున్న విషయం తెలిసిందే. రెడ్‌మీ నోట్ సిరీస్‌లోనే 6 జీబీ ర్యామ్‌తో తొలిసారిగా విడుదలైన స్మార్ట్‌ఫోన్ నోట్ 5ప్రొ. ఈ స్మార్ట్‌ఫోన్ బ్లాక్, లేక్ బ్లూ, గోల్డ్, రోస్ గోల్డ్ రంగుల్లో వినియోగదారులకు లభ్యం కానుంది. డ్యూయల్ కెమెరాతో రెడ్‌మీసిరీస్ నుంచి వచ్చిన తొలిఫోన్‌గా నోట్ 5ప్రొ నిలిచింది.

హుందాయ్‌కి అనూహ్య స్పందన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలో పాసింజర్ కార్ల ఉత్పత్తిలో రెండవ అతిపెద్ద సంస్థగా గుర్తింపు పొందిన హుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ ఎంఐఎల్) కార్లకు ఆటో ఎక్స్‌పోలో అనూహ్య స్పందన లభిస్తోంది. తమ బీ ది బ్యాటరీ గ్రై జోన్‌కు మంచి స్పందనొస్తోందని సంస్థ మార్కెటింగ్ హెడ్, జీఎం పునీత్ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తామని 1,25,000 మంది ప్రతిజ్ఞ చేశార న్నారు. రోడ్డు నియమ నిబంధనలపై వినియోగ దారులకు అవగాహన కల్పించేందుకు హుందాయ్ ఈ-జోన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అంతా రాజకీయమే...

దేశభక్తి ఒట్టి డొల్ల

- వేర్పాటువాదంపై బీజేపీ ద్వంద్వ వైఖరి
- కాశ్మీర్, త్రిపురలో ఇలా.. కాషాయం రంగు బహిర్గతం
- రక్తచరిత్ర గల ఐపీఎఫ్‌టీతో కమలం జత
- ప్రధాని జోక్యంతో పొత్తు ఖరారు
- త్రిపుర రాజకీయ ముఖచిత్రం





విశాలాంధ్ర-ప్రత్యేక ప్రతినిధి :అధికారం కోసం బీజేపీ ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుంది. అసత్యాలు ప్రచారం చేస్తుంది. ఏ రోటికాడ పాట..ఆ రోటి కాడ పాడుతుంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. దేశభక్తి గురించి పదేపదే ప్రకటనలు గుప్పిస్తుంది. అసలు సిసలు దేశ భక్తులం తామేనంటూ నమ్మ బలుకుతుంది. ప్రత్యేకించి ఎన్నికల వేళ ఏ రాష్ట్రంలో పాడాల్సిన పాట ఆ రాష్ట్రంలో పాడుతుంది. ఓ వైపు కాశ్మీర్‌లో వేర్పాటువాద ఉద్యమాలను అణగదొక్కుతామని ఎన్డీఏ సర్కారు ప్రగల్భాలు పలుకుతోంది. మరోవైపు అలాంటి రక్తచరిత్ర కలిగిన పార్టీతో జతకట్టడానికి బీజేపీ ఏమాత్రం వెనకడుగు వేయలేదు. ప్రాంతీయంగా ఉన్న పార్టీలతో జత కట్టడానికి, మంచి చేసుకోవడానికి బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా సాధారణంగా రంగంలోకి దిగుతాడు. కానీ త్రిపురలో మాత్రం అందుకు భిన్నంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ సీన్‌లోకి వచ్చారు. త్రిపురలో రెండున్నర దశాబ్దాలుగా వామపక్ష పార్టీ అధికారంలో కొనసాగుతోంది. ఈ లెఫ్ట్ పార్టీని ఎదుర్కోవడం ఒంటరిగా సాధ్యంకాదని బీజేపీ అధిష్టానానికి అర్థమైంది. ఎలాగైనా త్రిపుర కోట దక్కించుకోవాలన్న వ్యూహంతో చివరకు వేర్పాటువాద సంస్థతో సైతం బీజేపీ పొత్తుకు దిగజారింది. త్రిపురలోని మాణిక్ సర్కార్ ప్రభుత్వానికి అసాధారణమైన జనాదరణ ఉంది. మాణిక్ సర్కారు ప్రభుత్వానికి రాష్ట్రప్రజలు నీరాజనం పడుతున్నారు. దేశానికి ఆదర్శపాలన అందిస్తూ ఆయన ముందుకుసాగుతున్నారు. ఇది బీజేపీకి మింగుడు పడటం లేదు. అందుకే ప్రధానమంత్రి స్థాయిలో లాబీ నడిచింది. స్థానిక గిరిజన తెగకు చెందిన వేర్పాటువాద సంస్థ ఇండిజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుకుదుర్చుకుంది. ఈ నెల 18న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కలసి పోటీ చేసేందుకు కనీస ఉమ్మడి ప్రణాళికను ఖరారు చేశారు. 'జాతీయవాద', 'దేశభక్తి' శక్తులుగా పదేపదే చెప్పుకుంటున్న బీజేపీ... చిన్నపాటి సరిహద్దు రాష్ట్రంలో అధికారం కోసం వేర్పాటువాద బృందానికి మిత్రపక్షంగా మారింది. ఇది బీజేపీకి ఎన్నికల్లో గెలుపే ముఖ్యమని, దేశభక్తి గురించి చెప్పేదంతా అబద్ధమేనని రాజకీయ పరిశీలకులు విమర్శిస్తున్నారు. ఐపీఎఫ్‌టీ చరిత్ర గురించి దేశ ప్రజలకు పూర్తిగా తెలియకపోయినప్పటికీ... త్రిపుర ప్రజలకు మాత్రం దాని రక్తచరిత్ర సుపరిచితమే. ఎన్నికల కోసం బీజేపీ పొత్తు పెట్టుకున్న వేర్పాటువాద సంస్థ చరిత్రను పరిశీలిద్దాం...త్రిపుర ఉపజాతి జుబు సమితి (టీయూజేఎస్) అని పిలవబడే గిరిజన సంస్థ నుంచి వేరుపడ్డాక 1990 చివరిలో హరినాథ్ దేవ్‌బర్మ, నరేంద్ర చంద్ర దేవ్‌బర్మ ఐపీఎఫ్‌టీని స్థాపించారు. 1980లో హరినాథ్ దేవ్‌బర్మ టీయూజేఎస్‌లో ఉన్నప్పుడు బెంగాలీలను త్రిపుర నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. 1990లో గిరిజన అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (టీఏడీసీ) ఎన్నికల సందర్భంగా జరిగిన హింసను ఎవరూ మరువలేరు. ప్రశాంతంగా ఉండే ఆదివాసులు భయపడేలా దాడులు చేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. 2000లో టీఏడీసీకి జరిగిన ఎన్నికల్లో గిరిజనులను భయపెట్టడం ద్వారా ఐపీఎఫ్‌టీ విజయం సాధించేందుకు సాయుధ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఎన్‌ఎల్‌ఎఫ్‌టీ) సహాయపడింది. ఐపీఎఫ్‌టీ మరో నేత నరేంద్ర చంద్ర దేవ్‌బర్మ ఆలిండియా రేడియో అగర్తల స్టేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. తీవ్రవాదులతో అతనికి బలమైన సంబంధాలున్నాయనీ, బంగ్లాదేశ్ తరచుగా వెళ్లేవాడని విస్తృత ప్రచారం జరిగింది. 1998 నుంచి 2007 వరకు త్రిపురలో పలు తీవ్రవాద సంస్థలు రక్తపాతాన్ని సృష్టించాయి. గిరిజన హక్కుల కోసం పోరాడుతున్నామని ఆ సంస్థలు చెబుతూనే.. మరోపక్క దాడులకు తెగబడ్డాయి. ఈ హింసాత్మక దాడుల్లో 2,200 మంది హత్యకు గురయ్యారు. అందులో అత్యధిక మంది గిరిజనుల కావడం విచారకరం. లెఫ్ట్ ఫ్రంట్ తెలివైన నాయకత్వం నీడలో చైతన్యవంతులైన గిరిజనులు తీవ్రవాద సంస్థల హింసాత్మక చర్యలకు ముగింపు పలికారు. 2002లో టీయూజేఎస్, ఐపీఎఫ్‌టీ రెండూ విలీనమై ఇండిజీనస్ నేషనల్ పార్టీ ఆఫ్ త్రిపుర (ఐఎన్‌పీటీ)గా కొత్త అవతారం ఎత్తింది. 2003 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కూటమిని ఏర్పాటుచేసింది. 60 మంది సభ్యులు గల అసెంబ్లీలో 6 స్థానాలను గెలుచుకుంది. 2009 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎన్.సి. దేవ్‌బర్మ ఐఎన్‌పీటీ నుంచి బయటకువచ్చారు. ఐపీఎఫ్‌టీని పునరుద్ధరించారు. టీఏడీసీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నది. అన్నిటిలోనూ తీవ్ర పరాభవం ఎదురైంది. దీంతో ఐఎన్‌పీటీ నుంచి ఒక్కొక్కరుగా బయటకువచ్చి సొంత కుంపటి ప్రారంభించారు. అందులోంచి చీలినవే... నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ త్రిపుర, త్రిపుర పీపుల్స్ ఫ్రంట్, త్రిపురాలాండ్ స్టేట్ పార్టీ, త్రిపుర దొఫాని సిక్లా స్రింగ్నై తదితర సంస్థలు.


చివరకు ఐపీఎఫ్‌టీలోనూ గతేడాది చీలిక వచ్చింది. బీజేపీకి లాభం కలిగించేందుకు ఆ పార్టీ నుంచి పెద్దమొత్తంలో మూటలు అందాయని ఐపీఎఫ్‌టీని పునరుద్ధరించిన ఎన్‌సీ దేవ్‌బర్మపై ఆరోపణలు వచ్చాయి. అనేక చీలికలు, విలీనాలు, అంతర్గత కుమ్ములాటలతో ఐపీఎఫ్‌టీ బలహీనపడినప్పటికీ.. దానికంటూ ప్రత్యేక సూత్రాలతో దాని విధానాలను నిర్వచించుకుంది. అవి ఏమంటే త్రిపుర నుంచి గిరిజన ప్రాంతాన్ని వేరుచేసి త్రిపుర లాండ్ పేరుతో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేయడం, త్రిపురలో ఉన్న బెంగాలీలను ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారిని తరిమికొట్టడం, లెఫ్ట్‌ఫ్రంట్‌కు దీటుగా బీజేపీ, కాంగ్రెస్ సహా ఏ పార్టీతో అయినా పొత్తుకు సిద్ధం కావడం, గిరిజనులను దోపిడీ చేసే త్రిపుర రాజ వంశానికి బలమైన మద్దతు ఇవ్వడం. ఇవీ ఆ సంస్థ విధానాలు. అధికార దాహం, స్వార్థ ప్రయోజనాల కోసం, జాతి వివాద జ్వాలలు రేపడం సహా, దేశ సరిహద్దుల నుంచి పనిచేసే చట్టవిరుద్ధమైన ఇతర సంస్థలతో పొత్తుపెట్టుకున్న చరిత్ర ఐపీఎఫ్‌టీకి ఉంది.

2013లో అగర్తలలో ప్రత్యేక త్రిపుర ల్యాండ్ డిమాండ్‌తోపాటు త్రిపురలో ఉన్న బెంగాలీలకు వ్యతిరేక నినాదాలు చేస్తూ హింసాత్మక ర్యాలీని నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2017 నుంచి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నది. వామపక్ష ఆధిపత్యం గల రాష్ట్రంలో పై చేయి కోసం ఆరాటపడుతున్న జాతీయ పార్టీల ప్రోద్బలంతోనే ఈ చర్యలకు పాల్పడి ఉండొచ్చన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి 2017 జూలైలో రాష్ట్రంతో మిగిలిన ప్రాంతాలకు ఏకైక అనుసంధానం ఉన్న జాతీయ రహదారిని రెండు వారాలపాటు దిగ్బంధనం చేసింది. తద్వారా త్రిపురకు నిత్యావసర వస్తువుల సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగించింది. 2009 నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం తాము పోరాడుతున్నామని, రాష్ట్రంలోని లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం, కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తమ డిమాండ్లకు ప్రాధాన్యం ఇవ్వలేదని, 2017లో జాతీయ రహదారి దిగ్బంధనం సాగుతుండగా.. తమ ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ నేతలతో సమావేశమైందని, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పీఎంఓతో చర్చలు జరిపిందని, ప్రత్యేక రాష్ట్రం త్వరలో నిజం కాబోతున్నట్టు తమకు హామీ లభించడంతో జాతీయ రహదారి దిగ్బంధనాన్ని విరమించుకుంటున్నామని ఐపీఎఫ్‌టీ నేత ఎన్‌సీ దేవ్‌బర్మ ప్రకటించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలోనే ఆ హామీ ఇచ్చినట్టు అప్పట్లో విమర్శలు వచ్చాయి. కాషాయపార్టీ అవకాశవాదం, వంచనను బీజేపీ-ఐపీఎఫ్‌టీ పొత్తు మరోసారి బహిర్గతం చేసింది.

నష్టాల్లో సెన్సెక్స్

145పాయింట్ల పతనం

ముంబై: స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాలతో ముగిశాయి. గత రెండు వారాల్లో తీవ్ర నష్టాలను చవిచూసిన మార్కెట్లు ఈ వారం ప్రారంభంలో కాస్త పుంజుకున్నా మళ్లీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 145 పాయింట్లు పడిపోగా, నిఫ్టీ 10,501 పాయింట్ల వద్ద ముగిసాయి. సెన్సెక్స్ 145 పాయింట్ల నష్టంతో 34,155.95 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 38.85 పాయింట్లు నష్టపోయి 10,500.90 పాయింట్లకు చేరింది. ముంబై బ్రాంచిలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11వేల 300కోట్ల కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు బాగా నష్టపోయాయి. పీఎస్‌బీ షేర్లు దాదాపు పది శాతం పడి పోయాయి. అలహాబాద్ బ్యాంక్, ఓబీసీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనెరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల షేర్లు 5 నుంచి 8శాతం దాకా నష్టాల్లో ముగిసాయి. టెక్‌మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, కోల్ ఇండియా, రిలయన్స్ తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. ఎస్‌బ్యాంకు, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు, భారతి ఇన్‌ఫ్రాటెల్, ఓఎన్‌జీసీ తదితర కంపెనీల షేర్లు నష్టాల పాలయ్యాయి.




నష్టాల్లో ముగిసిన పీఎన్‌బీ షేర్లు: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రెండో అతిపెద్ద బ్యాంక్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు షేర్లు బుధవారం మధ్యాహ్నం అనూహ్యంగా నష్టాల్లోకి జారుకున్నాయి. పీఎన్‌బీ ముంబయి బ్రాంచ్‌లో దాదాపు రూ.11వేల300 కోట్ల మేర భారీ కుంభకోణం జరిగినట్లు వార్తలు రావడంతో ఆ కంపెనీ షేర్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. రూ.160 షేరు విలువతో బీఎస్‌ఈలో ట్రేడింగ్ ప్రారంభించిన పీఎన్‌బీ మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 8శాతం పడిపోయింది. ప్రస్తుతం ఆ బ్యాంక్ షేరు విలువ రూ.150 వద్ద కొనసాగుతోంది. ముంబయిలోని పీఎన్‌బీ బ్రాంచీలో కొంతమంది ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చే నిమిత్తం జరిగిన కుంభకోణంపై పీఎన్‌బీ బుధవారం ఎక్స్‌చేంజి ఫైలింగ్‌లో వెల్లడించింది. ఈ కుంభ కోణంపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు బ్యాంకింగ్ సెక్రటరీ వెల్లడించారు. ఇప్పటి వరకు పది మంది పీఎన్‌బీ ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియన్ స్టాక్స్ మిశ్రమ ఫలితాలు వెల్లడించాయి. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం మార్కెట్లుసెలవు ప్రకటించాయి. అమెరికా ద్రవ్యోల్బణ ఫలితాలు ప్రకటించనుండటం, వడ్డీ రేట్లలో పలు మార్పుల నేపథ్యంలో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. నిక్కీ యావరేజ్ 90.51 పాయింట్లతో 0.43 శాతంతో 21,154.17 వద్దనిలిచింది. అక్టోబరు 12 తరువాత ఇదే అత్యల్పమని చెప్పవచ్చు. బ్రాడర్ టాపిక్స్ ఇండెక్స్ 0.82 శాతంతో 1702.72 వద్ద ముగిసింది. బెంచ్ మార్కు షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 14. 20 పాయింట్లు ఎగిసింది. హాంగ్‌కాంగ్ హాంగ్‌సేంగ్ ఇండెక్స్ 2.5శాతం పెరిగింది.

చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో మార్పులు

న్యూఢిల్లీ: ప్రజల అవసరాలకు అనుగుణంగా పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్) వంటి స్మాల్ సేవింగ్స్ పథకాల నుండి నగదును విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రస్తుతం పీపీఎఫ్ వంటి స్మాల్ సేవింగ్స్ అకౌంట్లను ఐదేళ్లు పూర్తి కాకుండా మూసివేయడం కుదరదు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త ప్రొవిజన్లతో అకౌంట్ యూజర్లు ఎప్పుడు కావాలంటే అప్పుడు గడువు ముగియకుండానే స్మాల్ సేవింగ్ మొత్తాలను విత్ డ్రా చేసుకోవచ్చు. దీనికి అనుగుణంగా పీపీఎఫ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ వంటి స్మాల్ సేవింగ్స్ చట్టాల్లో సవరణలు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అత్యవసర వైద్యానికి, ఉన్నత విద్యకోసం డబ్బు తీసుకునే వెసులుబాటు కల్పించనుంది. మైనర్లపేరిట పొదుపు చేసే అవకాశాన్ని ఇవ్వనుంది. ఖాతాదారుల ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికిగాను ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆర్థిక బిల్లు-2018లో ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించింది. కొత్త చట్టం తీసుకురావడం ద్వారా చిన్న మొత్తాల పొదుపు పథకాల నిబంధనలు, నియమావళిని డిపాజిట్‌దారులు సులభంగా అర్థం చేసుకోగలుగుతారని ఆర్థిక శాఖ అభిప్రాయపడింది. పోస్టాఫీసు పొదుపు ఖాతాలు, జాతీయ పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతాలన్నీ చిన్నమొత్తాల పొదుపు పథకాలుగా పరిగణిస్తారు. వీటన్నింటికి ఇప్పుడిస్తున్నట్లే ఆదాయపు పన్ను మినహాయింపు, బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ ఇస్తారు. మైనర్ తరుపున గార్డియన్ స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్‌లో పెట్టుబడులు పెట్టొచ్చని కూడా తెలిపింది. దీనికి సంబంధించిన హక్కులు, బాధ్యతలన్నీ గార్డియన్ చేతుల్లో ఉంటాయన్నారు. అయితే ప్రస్తుతమున్న చట్టాల్లో మైనర్ల డిపాజిట్లకు సంబంధించి ఎలాంటి ప్రొవిజన్లు లేవు. అంతేకాక దివ్యాంగుల స్మాల్ సేవింగ్స్ అకౌంట్లకు కూడా ప్రత్యేక ప్రొవిజన్‌ను తీసుకొచ్చింది. ప్రస్తుతం చేసిన సవరణలతో స్మాల్ సేవింగ్స్ స్కీమ్‌పై వడ్డీ రేటు లేదా పన్ను పాలసీలో ఎలాంటి మార్పులు కాలేదని ఆర్థికమంత్రిత్వ శాఖ తెలిపింది.



ఇంపోర్టెడ్ బైకులిక చౌక!

న్యూఢిల్లీ: విదేశాల నుంచి దిగుమతి చేసుకునే హై ఎండ్ బైకులు ఇక నుంచి కాస్త చౌకగా లభించనున్నాయి. వాటి దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని 50 శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు 800 సీసీ లేదా అంతకంటే తక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న మోటార్ సైకిళ్ల దిగుమతిపై 60 శాతం, 800 సీసీ కంటే అధిక సామర్థ్యం కలిన బైక్‌లపై 75 శాతం కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సి వచ్చేది. ఈ రెండు విభాగాలపై దిగుమతి సుంకాన్ని 50 శాతానికి తగ్గిస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) ఈ నెల 12న జారీ చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఇక ఇంజన్, గేర్‌బాక్స్ వంటి ప్రీ అసెంబుల్డ్ పార్ట్స్ దిగుమతిపై సుంకం 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గింది. హార్లీ డేవిడ్‌సన్, ట్రయంఫ్, ఇండియన్ మోటార్స్, డీఎస్‌కే బెనెల్లీ వంటి ప్రీమియం బ్రాండ్లు భారత్‌లో షోరూంలను ఏర్పాటు చేసినప్పటికీ బైకులను మాత్రం విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి.

విజ్ఞానం

స్కానింగ్‌తో లివర్ వ్యాధుల చికిత్స



ఫ్యాటీ లివర్ రోగులకు అవసరమైన బయోప్సీలనను నూతన స్కానింగ్ సాంకేతికతతో సగానికి సగం తగ్గించినట్లు బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ, ఎడిన్‌బరో యూనివర్సిటీ సంయుక్తంగా చేసిన పరిశోధనలో వెల్లడించారు. లివర్‌పూల్,ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలు చేసిన ప్రయోగంలో ఈ నూతన స్కానింగ్ టెక్నాలజీతో 1000 లివర్ బయోప్సీలలో సుమారు 458 వరకు తగ్గించినట్లు తెలిపారు. ఈ విధానంతో రోగికి సుమారు 150 డాలర్ల ఖర్చు తగ్గినట్లయింది. అంతర్జాతీయంగా లివర్ బయోప్సి విధానంతో లివర్ వ్యాధులను అంచనా వేయవచ్చు. నాన్‌ఆల్కాహోలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు, వేగంగా సంబంధిత చికిత్స నందించేందుకు బయోప్సీతోనే నిర్ధారణ చేయడం జరుగుతుంది. 50మంది లివర్ వ్యాధి గ్రస్థులపై చేపట్టిన ప్రయోగంలో కాలేయం యొక్క మూడు బయోకెమికల్ లక్షణాలు కొవ్వు కాలేయ లక్షణాలను అంచనా వేయడానికి డిజిటల్ ఇమేజ్‌స్కానింగ్ టెక్నాలజీని వినియోగించారు. ఈ విధానంతో కాలేయ పరిస్థితిని అంచనా వేయగలిగారు. ఈ విధానంతో 20 నుండి 30శాతం వరకు వ్యాధి పెరగకుండా నియంత్రించారు. ఈ విధానంతో నీడిల్ వినియోగించకుండా తక్కువ ఖర్చుతో నొప్పిలేకుండా వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయవచ్చునని నిపుణులు వెల్లడించారు.

గుండెను పదిలంగా చూసుకునే జన్యువు గుర్తింపు

గుండెను ఆరోగ్యంగా ఉంచే జన్యువును శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. గుండెనుసురక్షితంగా ఉంచుతూ గుండె జబ్బులు రాకుండా పదిలంగా కాపాడే ఈ జన్యువును ఉక్లా శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలో గుర్తించారు. మెక్సిస్ అనే ఈ జన్యువు రక్తనాళాల నుండి అదనపు కొవ్వును తొలగించేందుకు తోడ్పడతాయని తెలుస్తోంది. ధమనుల్లో పేరుకుపోయిన ఈ కొవ్వు ముఖ్యంగా గుండె జబ్బులకు కారణమవుతోంది. మెక్సిస్ అనే ఈ జన్యువు ఆర్టరీ గోడలకు ఉండే కొలెస్ట్రాల్‌లు సహాయపడే ప్రోటీన్‌ను నివారిస్తుందని వీరి పరిశోధనలో తేలింది. మెక్సిస్ అనేది స్వార్థపూరిత జన్యువు. ఇది ప్రోటీన్‌ను ఉత్పత్తి చేయనందున ఏ విధమైన పనిని చేయలేదని ఇప్పటివరకు అంచనా. ఎలుకలపై వీరు చేపట్టినప్రయోగంలో మెక్సిస్ జన్యువు లోపించడంతో వీరు చేసిన ప్రయోగం విజయవంతమైంది. మెక్సిస్ లెవెల్స్‌ను పెంచడంతో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గించినట్లు తెలుస్తోంది.



మ్యాక్స్ బూపా 'గోఆక్టివ్'

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మ్యాక్స్ బూపా కొత్త వైద్య బీమా 'గో ఆక్టివ్'ను అందుబాటులోకి తెచ్చింది. ఇది రోజువారీ వైద్య అవసరాలను తీర్చుతుందని కంపెనీ సిఈవో ఆశిష్ మెహ్రోత్రా తెలిపారు. ఇన్ పేషెంట్ హాస్పిటలైజేషన్, అవుట్ పేషెంట్ డిపార్టుమెంట్ (ఓపీడీ), వ్యాధుల నిర్ధారణ, వ్యక్తిగత వైద్య శిక్షణ, సెకండ్ మెడికల్ ఒపీనియన్ తదితర సేవలను అందిస్తామన్నారు. దేశంలో 80 శాతం మంది బీమా లేని వారున్నారని, 4500 ప్రాంతాల్లోని తమ శాఖ ద్వారా వీరిని బీమా రంగంలోకి తీసుకు రావడమే తమ లక్ష్యమన్నారు. ప్రతీ ఐదుగురిలో ఒక్కరు లైఫ్‌స్టైల్ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ పాలసీ తీసుకున్న మొదటి రోజే రూ.2500 విలువ చేసే బాడీ చెకప్ చేసుకునే సౌలభ్యం ఉందని వివరించారు. రెన్యూవల్ సమయంలో 20 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు తెలిపారు. 35 ఏళ్లలోపువారు బీమా తీసుకున్నట్లయితే వారికి 10 శాతం రాయితీ కల్పిస్తున్నామని ఆశీష్ చెప్పారు.



పర్యావరణహితంగా అదానీ విల్మర్ ఉత్పత్తులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: పర్యావరణానికి హితం చేకూర్చే దిశగా అదానీ విల్మర్ లిమిటెడ్ ముందడుగు వేసింది. వంట నూనెల ఉత్పత్తి, విక్రయాల్లో ముందున్న అదానీ.. సంస్థాగత ఉత్పత్తుల ప్యాకేజింగ్‌నకు రీసైక్లింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. నెలకు సుమారు 300 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ ఫిల్ములను సంస్థ వినియోగిస్తోంది. దీనిలో ఒక కేజీ ఫిల్మ్‌తో 130 హెచ్‌ఎస్ తయారవుతాయని సీఓఓ అన్షూ మాలిక్ తెలిపారు. పర్యావరణానికి హానికలిగించే ఉత్పత్తులను నియంత్రించేందుకు సంస్థ యత్నిస్తున్నట్టు చెప్పారు.

ముగియనున్న నుమాయిష్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: జాతీయ పారిశ్రామిక ప్రదర్శనగా పేరొందిన నుమాయిష్ సందడి ముగియనుంది. భాగ్యనగరంలో జరిగే ఈ నుమాయిస్ మరో రెండు, మూడు రోజుల్లో ముగియనుంది. దీంతో సందర్శకుల తాకిడి పెరిగింది. నుమాయిష్ అంటే తక్కువ ధరకు అన్ని వస్తువులు లభించే చోటుగా ప్రసిద్ధి. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ నుమాయిష్‌ను ఇష్టపడతారు. బట్టలు, ఆర్నమెంట్స్, ఫర్నిచర్ తదితరాలు దొరుకుతాయి. ఇక్కడకు వచ్చి కావలసిన వస్తువు కనిపించకుండా వెనుతిరగని వారు లేరంటే అతిశయోక్తి కాదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి స్వయం సహాయక సంఘాలు, పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లకు చెందిన సాంస్కృతిక సంస్థలు, అసోసియేషన్లు, లక్నో, జమ్మూకాశ్మీర్ నుంచి మహిళా పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శ నకు ఉంచారు. మొత్తం 2500 స్టాళ్లు అందు బాటులో ఉంటాయి. ఇంటి అలంకరణకు సంబం ధించిన అన్నిరకాల వస్తువులు నుమాయిష్‌లో లభిస్తాయి. పిల్లల కోసం గేమింగ్ జోన్లు ప్రత్యేక ఆకర్షణ కాగా, మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి కొత్త షాపింగ్ అనుభూతిని పొందుతున్నారు.

దేశంలో తొలి హైపర్ లోకల్ మొబైల్ ప్లాట్‌ఫాం

అన్ని వ్యాపారాలకు ఒకటే పరిష్కారం

రెండేళ్ల కిందట హైదరాబాద్ అమీర్‌పేట మైత్రీవనం దగ్గర ముగ్గురు మిత్రులు టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో ఒక కుర్రాడు చేతిలో పాంప్లెట్‌తో వచ్చి ఈ అడ్రస్ ఎక్కడో కాస్త చెప్తారా? అని అడిగాడు. రెండు నిమిషాల వ్యవధిలో ఇంకో యువకుడు అదే పాంప్లెట్ పట్టుకుని అదే అడ్రస్ ఎంక్వయిరీ చేశాడు. మరో ఐదు నిమిషాల గ్యాప్‌లో మరో వ్యక్తి అదే పాంప్లెట్ తీసుకొచ్చి అదే అడ్రస్ కనుక్కున్నాడు. ఈ ముగ్గురూ ఆశ్చర్య పోయారు. ఒకే అడ్రస్‌ని ముగ్గురు వ్యక్తులు వెంట వెంటనే అడిగారంటే.. అక్కడేం జరుగుతుందో తెలుసుకోవాలనుకున్నారు. ఇంతలో ఒకరి బుర్రలో మెరుపులాంటి ఐడియా వచ్చింది. ఇంకో మూడు టీలు చెప్పి వాడివేడిగా చర్చించుకున్నారు. ఆ వేడివేడి ఐడియా టీ హబ్‌కి చేరింది. అక్కడ ఆవిష్కరణగా మారి బయటకొచ్చింది. ఆ ఇన్నోవేషన్ పేరే 'ఫైండ్ మి ఎట్ స్మార్ట్ సైట్స్'.



ఆదివారం పొద్దున్నే గడప ముందు పడివున్న పేపర్ తీయగానే.. అందులోంచి రకరకాల సైజుల్లో, రకరకాల రంగుల్లో పాంప్లెట్స్ కిందపడతాయి. అయితే వాటిని ఎంతమంది చదువుతారు? అందులో ఎన్ని పాంప్లెట్స్ జనాన్ని ఆకర్షిస్తాయి? దీనికి సమాధానం చెప్పడం కష్టం. అంటే, వ్యాపార సంస్థలు అనుకున్న కస్టమర్లను చేరుకోలేదనే చెప్పాలి. సాధారణంగా పట్టణాల నుంచి నగరాల వరకు రోడ్డుకు ఇరు పక్కల బోలెడన్ని బేనర్లు కనిపిస్తాయి. వాటిని ఎంతమంది ఆగి చదువుతారు? ఇక్కడా అనుకున్న స్థాయిలో చేరడం లేదు. పోనీ ఆటో వెనకాల యాడ్- ఏమైనా వర్కవుట్ అవుతుందా? సగం వంతు కూడా అవకాశం లేదు. దేశంలో సూక్ష్మ, మధ్య, చిన్న తరహా వ్యాపార సంస్థలు అన్నీ కలిపి సుమారు ఐదు కోట్ల దాకా వుంటాయని అంచనా. అవన్నీ ప్రచార పరంగా చూసుకుంటే అసంఘటితంగానే ఉన్నాయి. వాటన్నిటినీ ఒకే తాటిమీదికి తేవాలన్న లక్ష్యంతో ఊపిరి పోసుకున్నదే 'ఫైండ్ మి ఎట్ స్మార్ట్ సైట్స్'. మీరు దిల్‌సుఖ్‌నగర్‌లో ఫలానా కోచింగ్ సెంటర్‌కి వెళ్లాలనుకోండి. అదెక్కడుందో వాళ్లను వీళ్లను అడగాల్సిన అవసరం లేదు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. 'ఫైండ్ మి ఎట్ స్మార్ట్ సైట్స్' యాప్ ద్వారా కావాల్సిన గమ్యాన్ని టైప్ చేసి దాన్ని నావిగేట్ చేసుకుంటూ వెళ్లడమే. దారి చూపడంతో యాప్ ఆగిపోలేదు. ఇంకో క్లిక్ ద్వారా అవతలి వాళ్లకు కాల్ కూడా వెళ్తుంది. ఇంకో బటన్ ప్రెస్ చేస్తే సమాచారం వేరేవాళ్లకు షేర్ అవుతుంది.

ఆ పేరే ఎందుకు పెట్టారంటే..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల విని యోగదారులు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే ఉంటారు. అలాంటి వాళ్లను రప్పించాలంటే- ముందు అలాంటి బిజినెస్ ఒకటుందని ప్రజలకు తెలియాలి. వాళ్ల ఉత్పత్తులు, సేవలు వినియోగదారులకు చేరాలి. ఇలాంటి వాటికి ప్రత్యేకమైన ఏర్పాట్లేమీ లేవు. ఉన్నదల్లా పాంప్లెట్స్. లేదంటే బేనర్స్. ఇంకాస్త ముందుకు పోతే ఆటోల వెనకాల యాడ్స్. ఇవి తప్పితే ప్రత్యామ్నాయం లేదు. ఇలాంటి సమస్యను పరిష్కరిస్తుంది 'ఫైండ్ మి ఎట్ స్మార్ట్ సైట్స్'. ఇది టెక్నాలజీకి సంబంధించినప్పటికీ, దానికోసం వేరే ఎవరినో సంప్రదించాల్సిన అవసరం లేదు. పూర్తి యూజర్ ఫ్రెండ్లీగా తయారు చేశారు. దీన్నే హైపర్ లోకల్ మొబైల్ ప్లాట్‌ఫాం అంటారు.

ఇంకో విషయం ఏంటంటే బేసిగ్గా చిన్నచిన్న వ్యాపార సంస్థల బిజినెస్ మార్జిన్లు తక్కువగా వుంటాయి. అందువల్ల వాళ్లకు అందుబాటులో ఉండే టెక్నాలజీనే ప్రొవైడ్ చేశారు. ఒక పాంప్లెట్‌ని డిజిటలైజ్ చేసి పోస్టర్‌లా పెట్టుకునేలా రూపకల్పన చేశారు. స్మార్ట్ ఫోన్ వాడటం తెలిస్తే చాలు. కావల్సినన్ని పోస్టర్లు కావాల్సిన సైజులో పెట్టుకోవచ్చు. నెలకి వంద రూపాయల చందా(సబ్ స్క్రిప్షన్). పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు కూడా ఇందులో ఎన్నో సదుపాయాలున్నాయి. ఉదాహరణకు లాయల్టీ ప్రోగ్రామ్స్, హోం డెలివరీ అయితే వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్, లేదంటే డీలర్లతో సంప్రదించి ఆఫర్లు అవీ చెప్పడానికి బిజినెస్ టు బిజినెస్, సిచ్యువేషన్ వేకెంట్ అంటే సేల్స్ బోయ్ గానీ సేల్స్ గర్ల్ గానీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గానీ అవసరం ఉంటే అలాంటి వాటికోసం క్లాసిఫైడ్.. ఇలా ఎలా అవసరం ఉంటే అలా వాడుకోవచ్చు. ఇది ఒక తరహా, ఒక టైప్ బిజినెస్ కాదు. అన్ని రకాల వ్యాపారాలకు ఉపయోగకరంగా ఉంటుంది. హోం ట్యూషన్ మొదలుకొని మొబైల్ రిపేర్, యోగా సెంటర్లు, కొరియర్ సర్వీసులు చివరికి ప్లంబర్ దాకా అందరికీ ఈ యాప్ మంచి బిజినెస్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. ఇంటిముందు బోర్డు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఇంకెక్కడో వాణిజ్య ప్రకటన ఇవ్వాల్సిన హైరానా అంతకన్నా లేదు. దేశంలో ఐదు కోట్ల మందికి రీచ్ కావడమే ఈ స్టార్టప్ లక్ష్యం. ఈ రెండు మూడు నెలల్లోనే ఐదు వేల కమర్షియల్ యూజర్లను ఎన్‌రోల్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదట తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో పైలట్ లాంచ్ చేశారు. అది బిజినెస్ దాకా వచ్చింది. ఇప్పుడు హైదరాబాద్‌పై దృష్టి పెట్టారు. ఇక్కడ లక్ష యూజర్లను ఎంగేజ్ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రెగ్యులర్ యూజర్లకు మాత్రం ఉచితం. బిజినెస్ యూజర్లు నెలకు వంద సబ్ స్క్రిప్షన్ ఇవ్వాల్సి వుంటుంది. ఆ తర్వాత వేర్వేరు ఆర్గనైజేషన్లతో, ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటూ, దేశం మొత్తం విస్తరించే ప్రయత్నంలో ఉన్నారు.



ఫైండ్ మి టీమ్

యాప్ స్పేస్ ఎండీ రాజీవ్ రావులపాటి దీనికి వ్యవస్థాపకుడు. అజయ్, శంకర్ సహ వ్యవస్థాపకులు. ఖమ్మం జిల్లాకు చెందిన రాజీవ్.. 23 ఏళ్లుగా ఐటీ పరిశ్రమలో ఉన్నారు. కొంతకాలం ఐబీఎంలో (అమెరికా) పనిచేశారు. తర్వాత వేర్వేరు కంపెనీల్లో కమాండ్ సెంటర్‌ని లీడ్ చేశారు. మారుమూల గ్రామాలు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నదే రాజీవ్ ఆశయం. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ హబ్ యువ వ్యాపారవేత్తలకు వరం లాంటిది అంటారాయన. వేరే దేశాలతో పోల్చి చూస్తే ఎక్కడా లోటు లేదని చెప్తున్నారు. టీ హబ్ నుంచి సరికొత్త ఆవిష్కరణలతో బయటకొచ్చిన స్టార్టప్ కంపెనీల్లో తమదీ ఒకటైనందుకు గర్వంగా ఉందన్నారు రాజీవ్.



ఔత్సాహికులకు వరం.. ఫుడ్ ట్రక్ బిజినెస్

ఈ రోజుల్లో లాభసాటి వ్యాపారం ఏదైనా ఉందీ అంటే అది ఫుడ్ బిజినెస్సే. విదేశాల్లో ఏనాడో దీని కిటుకు కనిపెట్టారు కానీ మనదగ్గర ఇప్పుడిప్పుడే వ్యాపారం ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ప్రజల జీవన శైలి మారినకొద్దీ వ్యాపార వృద్ధి అవకాశాలు పెరుగుతూ ఉంటాయి. ప్రస్తుతం ప్రజానీకం పరిస్థితి ఎలా ఉందంటే.. తీరిగ్గా హోటల్‌కు వెళ్లి ఫుడ్ ఆర్డరిచ్చి, అది వచ్చేదాకా ఫోన్లో ఫేస్‌బుక్ చూసుకుంటూనో, వాట్సప్‌లో చాట్ చేసుకుంటూనో వేచి ఉండే రోజులు పోయాయి. ప్రజలకు అంత సమయం లేదు. వాళ్ల ప్రాధాన్యతలు, అభిరుచులు ఎప్పటికప్పుడు మారుతూ ఉన్నాయి. ఆర్డర్ చేసిన ఐదు నిమిషాల్లో రాకుంటే అసహనం ప్రదర్శిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు విజయవంతం కావడానికి ఇదొక ప్రధాన కారణం. అలాగని జనం ఎక్కడ పడితే అక్కడ.. ఏది పడితే అది తినేద్దాం అనుకోవడం లేదు. అప్పటికప్పుడు, నాణ్యతతో, ధర అందుబాటులో ఉండే ఫుడ్ ఎక్కడైతే దొరుకుతుందో.. అక్కడికి రెక్కలు గట్టుకుని వాలిపోతున్నారు.

పెద్దగా రిస్క్ లేని వ్యాపారాల్లో ఫుడ్ బిజినెస్ ఒకటి. కాకపోతే కొన్ని విషయాలు గుర్తుంచుకుంటే ఈ వ్యాపారం విజయవంతం అవుతుంది. అవేంటో చూద్దాం. మన దగ్గర చేయి తిరిగిన వంటవాడు ఉన్నా.. ఫుడ్ ట్రక్ పెట్టాల్సిన చోట పెట్టకుంటే వ్యాపారం కుప్పకూలుతుంది. అందుకే సరైన స్థలాన్ని ఎంచుకోవడంలోనే ఉంది మన మొదటి విజయం. ట్రక్ మరీ పెద్దగా కాకుండా, మరీ చిన్నగా ఉండకుండా.. బేసిక్ మోడల్ ఎంచుకుంటే ఉత్తమం. రూ.7 నుంచి రూ. 11 లక్షల్లో అయిపోతుంది. మనం ఏదైతే మెనూ అనుకుంటామో దాన్ని బట్టే వంట సామాను ప్లాన్ చేసుకోవాలి. అవసరం లేని సామాగ్రితో కిచెన్ గందరగోళం చేయొద్దు. రైస్ ఐటెమ్స్ లాంటివి మెనూలో ఉంటే, దాన్ని ఇంటిదగ్గర వండి తీసుకుని వస్తే ఇంకా ఉత్తమం. రవాణా భారం ఎంతోకొంత తగ్గుతుంది. ఇక్కడో చిన్న ఉదాహరణ. అహ్మదాబాద్‌లో ఒక మొబైల్ ఫుడ్ ట్రక్ ఉంది. చూస్తే ఆశ్చర్యపోతారు. ఒక ఓపెన్ ఆటోలోనే మొత్తం సెటప్ దించేశాడు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. ఆహార పదార్థాలు అద్భుతం. స్టవ్, కొన్ని గిన్నెలు, మసాలా దినుసులు.. ఇలా బేసిక్ మెటీరియల్‌తోనే ఐటెమ్స్ చేస్తాడు. అలాంటి వంటకం అద్భుతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. కేవలం నలుగురూ చెప్పుకోవడం ద్వారా ఆ ఫుడ్ ట్రక్ చాలా బాగా విజయవంతమైంది. ట్రక్ విషయంలో ఎందుకు రాజీపడాలని అనుకుంటే, కాస్త ఖర్చుపెట్టి డిజైన్ చేయించొచ్చు. పబ్లిసిటీకి అదొక మంచి అవకాశం. అలాగని ఏదో రెండు రంగులేసి నాలుగు అక్షరం ముక్కలు రాస్తే సరిపోదు. సృజనాత్మకంగా ఆలోచించాలి. చూడగానే ఆకర్షించేలా ఉండాలి. సాధారణంగా హోటల్లో అయితే దోశ మాస్టర్ అనీ, టీ ఎక్స్‌పర్ట్ అనీ, ఇడ్లీల కోసమని ఒకరు, చపాతీ పిండి పిసికేం దుకు మరొకరు.. ఇలా ప్యాంట్రీ నిండా మనుషులే కనిపిస్తారు. అయితే ఫుడ్ ట్రక్ విషయంలో అలా కాదు. మల్టీ టాలెంటెడ్ చెఫ్ ఒక్కరిని తీసుకుంటే చాలు. మరీ కష్టమనిపిస్తే గరిష్టంగా ఇద్దరితో నిర్వహించుకోవాలి. ఎడాపెడా సిబ్బందిని పెడితే సంచీ లాభం చిల్లుకే అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఈ విషయంలో కాస్త తెలివిగా వ్యవహరించాలి.

లైసెన్స్ ముఖ్యం

ఫుడ్ బిజినెస్ చిన్నదైనా పెద్దదైనా లైసెన్స్ మాత్రం చాలా ముఖ్యం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి అనుమతి తప్పనిసరి. దాంతోపాటు ఫుడ్ ట్రక్ కమర్షియల్ వెహికిల్ కిందకి వస్తుంది కాబట్టి స్థానిక ఆర్టీయే నుంచి లైసెన్స్ తీసుకోవాలి. అంతేకాదు అగ్నిమాపకశాఖ నుంచి కూడా లైసెన్స్ అవసరం. చాలామంది దాన్ని తేలిగ్గా తీసుకుంటారు గానీ, రేపు ఏదైనా జరగరానిది జరిగితే ఫైర్ గైడ్ లైన్స్ ఉన్నాయా? అని ప్రశ్నిస్తారు. ఇక చిట్టచివరి లాంఛనం- ట్రక్, కిచెన్ పరికరాల బీమా.

మార్కెట్ అన్వేషణ

ఇదే విజయానికి చివరి మెట్టు. ట్రక్ ఎక్కడ పెట్టాలి, ఎలాంటి మెనూ రూపొందించాలి, ఏ వయసు వారిని ఆకర్షించాలి, ఏమేం వెరైటీలు చేయాలి, అవెంత ఆరోగ్యకరంగా ఉండాలనేది కీలకం. ఈ విషయాలే మన మార్కెట్ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదిస్తాయి. ఉదాహరణకు ట్రక్‌ని స్కూల్ దగ్గర పెట్టాలని ప్లాన్ చేశారనుకో, సాయంత్రాలే బిజినెస్‌కు అనుకూలం. స్కూల్ వేళల్లో ఓపెన్ చేస్తే ఫాయిదా ఉండదు. ఒకవేళ కమర్షియల్ ఏరియాలో.. అంటే షాపింగ్ కాంప్లెక్సుల దగ్గర పెట్టాలనుకుంటే రోజంతా బిజినెస్ చురుగ్గా ఉంటుంది. లేదూ వీకెండ్, లేట్ నైట్స్ మాత్రమే అను కుంటే మ్యూజిక్ ఫెస్టివల్, ఎగ్జిబిషన్, జనం ఎక్కువగా వచ్చే ప్రదేశాలు ఎంచుకోవడం మంచిది. ఇతర వ్యాపారాల్లో ఆప్షన్లు ఉండొచ్చు ఉండకపోవచ్చుగానీ, ఫుడ్ ట్రక్‌లో మాత్రం అవకాశాలకు, ఆప్షన్లకు కొదవలేదు. ప్రతిభ, ఓపిక ఉండాలేగానీ ఫుడ్ బిజినెసంత లాభసాటి మరోటి లేదు.

పర్వాలేదనింపించిన 'ఇది నా లవ్ స్టోరి'



ఒకప్పటి లవర్ బాయ్ తరుణ్ కాస్త గ్యాప్ తర్వాత నటించిన 'ఇది నా లవ్ స్టోరి' సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. అప్పట్లో వరుస లవ్ స్టోరీస్‌తో సూపర్ హిట్స్ అందుకున్న తరుణ్‌కి ఈ వెల్ కం బ్యాక్ మూవీ ఎలాంటి హిట్ అందించిందో.. ప్రేక్షకులను ఎలా ఎంటర్‌టైన్ చేసిందో.. తెలుసుకుందాం.

కథ :

అభిరామ్(తరుణ్) ఒక యాడ్ ఫిల్మ్ మేకర్.. గతంలో లవ్ ఫెయిల్యూర్ కావడంతో కెరీర్‌పై దృష్టి పెడతాడు. తన యాడ్ ఫిల్మ్ లొకేషన్స్ చూడటం కోసం అరకు వెళ్లిన అభి అనుకోకుండా శ్రుతి (ఓవియా) అనే అమ్మాయిని చూసి మొదటి చూపులోనే ప్రేమలో పడతాడు. అయితే తను ప్రేమిస్తున్న శ్రుతినే అభినయ అని తను ఓ హెల్త్ ప్రాబ్లమ్‌తో భాదపడుతోందని తెలుసుకుంటాడు. అసలు అభినయ ఎవరు..? ఆమెకి ఉన్న ఆరోగ్య సమస్య ఏమిటి..? చివరికి అభిరామ్, అభినయ ఎలా ఒకటయ్యారు అనేది మిగతా కథ.

నటీ నటుల పని తీరు :

కెరీర్ స్టార్టింగ్‌లో వరుస లవ్ స్టోరిస్‌తో లవర్ బాయ్ ఇమేజ్ అందుకున్న తరుణ్ మరోసారి ప్రేమికుడిగా బెస్ట్ అనిపించుకున్నాడు. గ్యాప్ వచ్చినప్పటికీ ఎప్పటిలాగే తన పెర్ఫార్మెన్స్‌తో సినిమాకు హైలైట్‌గా నిలిచాడు. ఇప్పటికే మలయాళం, తమిళ్‌లో కొన్ని సినిమాలు చేసి ఇటీవలే తమిళ బిగ్ బాస్ షో ద్వారా మంచి పాపులరిటీ పొందిన ఒవియా తన గ్లామర్ , పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. ఓ సందర్భంలో వచ్చే గెస్ట్ రోల్‌తో మంచు మనోజ్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఇక అశోక్, ఖయ్యుం తదితరులు తమ క్యారెక్టర్స్‌తో పరవాలేదనిపించుకున్నారు.

టెక్నీషియన్స్ పనితీరు :

ఇలాంటి రొమాంటిక్ ఎంటర్‌టైనర్ సినిమాలకు మ్యూజిక్ ఎంత ఇంపార్టెంటో తెలిసిందే.. రిలీజ్‌కి ముందే తను కంపోజ్ చేసిన సాంగ్స్‌తో ఎట్రాక్ట్ చేసి సినిమాపై హైప్ తీసుకొచ్చిన సంగీత దర్శకుడు శ్రీనాథ్ విజయ్ సినిమాకు పర్ఫెక్ట్ అనిపించే బాగ్రౌండ్ స్కోర్ అందించి సినిమాకు మెయిన్ హైలైట్‌గా నిలిచాడు. క్రిస్టోఫర్ జోసఫ్ సినిమాటోగ్రఫీ బాగుంది. ముఖ్యంగా పాటల చిత్రీకరణలో తన పనితనం చూపించాడు జోసఫ్. ఎడిటింగ్ పరవాలేదు. కొన్ని సందర్భాలో వచ్చే పంచ్ డైలాగ్స్ ఎంటర్‌టైన్ చేసాయి. రమేష్ గోపి డైరెక్షన్ వీక్ అనిపించింది. మొదటి సినిమాకు ఒక రీమేక్ సినిమాను ఎంచుకున్న దర్శకులు రమేష్ గోపి తన స్క్రీన్ మెస్మరైజ్ చేయలేక తడబడ్డారు. ప్రొడక్షన్ వాల్యూస్ పరవాలేదు

సమీక్ష:

హీరోగా కాస్త గ్యాప్ తీసుకున్న తరుణ్ తనకి కలిసొచ్చిన లవ్ స్టోరితోనే మళ్ళీ ప్రేక్షకుల ముందు కొస్తున్నాడనగానే 'ఇది నా లవ్ స్టోరి' సినిమాపై కాస్త బజ్ క్రియేట్ అయింది. అయితే ఆ మధ్య ఈ సినిమా టీజర్‌ని నాగార్జున రిలీజ్ చేయడం, రిలీజ్‌కి ముందు తరుణ్ టూర్ ద్వారా కాలేజీస్ అన్ని తిరిగి సినిమాను ప్రమోట్ చేయడంతో ఈ సినిమా తరుణ్‌కి ఓ మంచి వెల్ కం బ్యాక్ సినిమాగా నిలుస్తుందనే టాక్ వినిపించింది. ఇక సినిమా విషయానికొస్తే ఒకప్పటి లవర్ బాయ్ తరుణ్ తన రీఎంట్రీ సినిమాకు కన్నడలో సూపర్ హిట్‌గా నిలిచిన ఓ లవ్ స్టోరీని సెలెక్ట్ చేసుకోవడం బాగానే ఉన్నా.. ఈ రీమేక్‌తో పూర్తిస్థాయిలో ఎంటర్‌టైన్ చేయలేకపోయాడు తరుణ్. నిజానికి ఈ సినిమా విషయంలో సాంగ్స్, డైలాగ్స్ మీద పెట్టిన శ్రద్ధ ఎమోషనల్ సీన్స్ మీద లవ్ ట్రాక్ మీద కూడా పెట్టి ఉంటే బాగుండేదనిపించింది. గతంలో తన పెర్ఫార్మెన్స్‌తో కొన్ని సినిమాలకు హైలైట్‌గా నిలిచి సక్సెస్‌లో భాగం పంచుకున్న తరుణ్ కూడా ఈ సినిమా విషయంలో ఏం చేయలేకపోయాడు. ఒకానొక సందర్భంలో సంచులకొద్దీ వచ్చే పంచ్ డైలాగ్స్, కొన్ని సన్నివేశాలు చూస్తుంటే ప్రేక్షకులకు విసుగు రావడం ఖాయం. ఓ భాషలో హిట్ అయిన సినిమాను తెలుగులో రీమేక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు వహించాల్సి ఉంటుంది. కాని ఈ సినిమా విషయంలో దర్శకులు రమేష్ గోపి ఇంకాస్త జాగ్రత్త వహించి లవ్ ట్రాక్ మీద ఎమోషనల్ సీన్స్ మీద దృష్టి పెట్టి ఉంటే రిజల్ట్ బెటర్ గా ఉండేది.

ఇప్పటికే ఎన్నో ప్రేమకథలొచ్చినా మెస్మరైజ్ చేసే స్క్రీన్ ప్లేతో ప్రేక్షకులను కనెక్ట్ చేయగలిగితే ఈ జోనర్ సినిమాకి డోకా ఉండదనే విషయం ఇటీవలే చాలా సినిమాలు నిరూపించాయి కూడా.. కానీ రమేష్- గోపి ఈ లవ్‌స్టోరిని ప్రేక్షకులకు కనెక్ట్ చేయడంలో విఫలం అయ్యారు.

తరుణ్ క్యారెక్టర్, ఒవియా గ్లామర్, సాంగ్స్, కొన్ని డైలాగ్స్ సినిమాకు హైలైట్‌గా నిలవగా బోర్ కొట్టించే సన్నివేశాలు, అసందర్భంగా వచ్చే పంచ్ డైలాగ్స్, లవ్ ట్రాక్, ఫ్లాష్ బ్యాక్ లవ్ స్టోరీస్ సినిమాకు మైనస్‌గా నిలిచాయి.

నటీ నటులు : తరుణ్, ఒవియా తదితరులు, సంగీతం : శ్రీనాథ్ విజయ్ , ఛాయాగ్రహణం : క్రిస్టోఫర్ జోసఫ్, నిర్మాత : ఎస్.వి.ప్రకాష్, నిర్మాణం : రామ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, దర్శకత్వం : రమేష్-గోపి.



'ఆట నాదే వేట నాదే' అంటున్న వెంకటేష్



విక్టరీ వెంకటేష్ ఈ మధ్యే తేజ డైరెక్షన్లో ఒక సినిమాను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఫ్యామిలీ థ్రిల్లర్‌గా ఉండబోతున్న ఈ చిత్రంలో వెంకటేష్ ప్రొఫెసర్ పాత్రలో నటించనుండగా 'ఆట నాదే వేట నాదే' అనే ఆసక్తికరమైన టైటిల్ ను ఈ చిత్రానికి ఖరారు చేశారు. ఈ చిత్రంలో ముందుగా బాలీవుడ్ నటి అధితిరావ్ హైదరిని హీరోయిన్‌గా అనుకున్నా ఆమె డేట్స్ కుదరకపోవడంతో శ్రియ శరన్‌ను ఫైనల్ చేశారు. శ్రియ, వెంకీలు గతంలో 'సుభాష్ చంద్రబోస్, గోపాల గోపాల' వంటి సినిమాల్లో కలిసి నటించిన సంగతి తెలిసిందే. త్వరలో రెగ్యులర్ షూట్ మొదలుపెట్టుకోనున్న ఈ సినిమా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండనుంది. ఇకపోతే ఈ చిత్రంలో యంగ్ హీరో నారా రోహిత్ ముఖ్యమైన పాత్రలో కనిపించబోతుండటం విశేషం. సురేష్ బాబు, అనిల్ సుంకరలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



భారీస్థాయిలో 'తొలిప్రేమ' వసూళ్లు

వరుణ్ తేజ్, రాశీఖన్నాల 'తొలిప్రేమ' చిత్రం గత వారం విడుదలై బాక్సాఫీస్ వద్ద దిగ్విజయంగా నడుస్తోంది. మల్టీప్లెక్స్ ఆడియన్స్, యువతలో మంచి ఆదరణ పొందిన ఈ సినిమా వసూళ్లు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే అన్ని ఏరియాల్లో డిస్ట్రిబ్యూటర్లు లాభాల దిశగా అడుగులు వేస్తున్నారు. నిర్మాణ సంస్థ లెక్కల ప్రకారం మొదటి నాలుగు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 25.8 కోట్ల గ్రాస్, రూ. 14.6 కోట్ల షేర్‌ను రాబట్టిన ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో రూ. 10.77 కోట్ల షేర్‌ను వసూలు చేసింది

'ఛల్ మోహన్ రంగ' టీజర్



వాలెంటైన్ డే సందర్భంగా నితిన్ 'ఛల్ మోహన్ రంగ' టీజర్ రిలీజైంది. 'లై' మూవీ తరవాత ఈ సినిమా కోసం మరోసారి జోడీ కట్టారు నితిన్, మేఘా ఆకాష్. కృష్ణ చైతన్య డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ టీజర్ యూత్ ని ఎట్రాక్ట్ చేస్తోంది. 'మీ స్టోరీ ఏంటి భయ్యా అనగానే హీరో తన లవ్ స్టేటస్‌ని మూడు ముక్కల్లో చెబుతాడు. ఆ డైలాగ్ వింటే ఇదొక రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ అనే విషయం అర్థమౌతోంది. డైలాగ్ చివర్లో పంచ్ వింటుంటే సినిమాలో త్రివిక్రమ్ మార్క్ ఉందనే విషయం కూడా తెలుస్తోంది. తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్‌లో మరో హైలెట్. త్రివిక్రమ్, పవన్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమాకు మరో నిర్మాతగా నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 5న ఛల్ మోహన్ రంగ థియేటర్లలోకి రానుంది.

జూలైలో రానున్న నవాబ్

ఇండియన్ ఏస్ డైరెక్టర్ మణిరత్నం ఇప్పుడు భారీ మల్టీస్టారర్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. చెక్క చివంద వానమ్ అనే పేరుతో తమిళంలో.. వచ్చిన సినిమా నవాబ్ పేరుతో తెలుగులో విడుదల కానుంది. అరవింద్ స్వామి, విజయ్ సేతుపతి, జ్యోతిక, అదితీరావ్ హైదరీ, ఐశ్వర్యా రాజేష్, ప్రకాష్ రాజ్, మన్సూర్ అలీఖాన్ తారాగణంగా నటిస్తున్నారు. 60 రోజుల్లో చిత్రీకరణను పూర్తి చేస్తారట. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నింటినీ పూర్తి చేసుకుని సినిమాను జూలైలో విడుదల చేయాలని నిర్మాతలు యోచిస్తున్నారు. మద్రాస్ టాకీస్‌తో పాటు లైకా ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

నాగార్జున, నానిల సినిమాలో కన్నడ హీరోయిన్



సీనియర్ హీరో అక్కినేని నాగార్జున, యంగ్ హీరో నానిలు కలిసి ఒక మల్టీ స్టారర్ చేయనున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 24 నుండి సెట్స్ మీదికి వెళ్లనున్న ఈ చిత్రాన్ని శ్రీరామ్ ఆదిత్య డైరెక్ట్ చేయనున్నాడు.

ఈ సినిమా గురించి తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఇందులో కన్నడ స్టార్ నటి శ్రద్ధా శ్రీనాథ్ నటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. శ్రీరామ్ ఆదిత్య చెప్పిన స్క్రిప్ట్ నచ్చడంతో ఆమె ఈ సినిమాపై సుముఖంగా ఉన్నారట. అయితే ఇంకా అధికారికంగా ప్రాజెక్ట్ మీద సైన్ చేయలేదని సంచారం. శ్రద్ధా శ్రీనాథ్ 'విక్రమ్ వేద' వంటి సూపర్ హిట్ సినిమాతో ప్రేక్షకులకి బాగా దగ్గరైన సంగతి తెలిసిందే.

నిహారిక హ్యాపీ వెడ్డింగ్ సమ్మర్‌లో



'ఒక మనసు' సినిమాతో ఇంప్రెస్ చేసిన నిహారిక ఇప్పుడు తన నెక్స్ట్ సినిమాతో రెడీ అవుతుంది. బ్యూటిఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకి 'హ్యాపీ వెడ్డింగ్' అని టైటిల్ ఫిక్స్ చేసిన సినిమా యూనిట్, ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేసింది. పాకెట్ సినిమా, యువి క్రియేషన్స్ బ్యానర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో సుమంత్ అశ్విన్ హీరోగా నటిస్తున్నాడు. పెళ్ళి ఫిక్స్ అయిన రోజు నుండి పెళ్ళయ్యే రోజు వరకు జరిగే రొమాంటిక్ జర్నీలోని హార్ట్ టచింగ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతుంది హ్యాపీ వెడ్డింగ్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ ప్రాసెస్‌లో ఉన్న ఈ సినిమా ప్రతి ఒక్కరు రిలేట్ అయ్యేలా, న్యాచురల్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కినట్టు తెలుస్తుంది. లక్ష్మణ్ కార్య డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ సినిమాకి శక్తికాంత్ కార్తీక్ మ్యూజిక్ కంపోజర్. ఈ సినిమాని సమ్మర్‌లో రిలీజ్ చేసే ఆలోచనలో ఉంది సినిమా యూనిట్.

ఆ ఆరోగ్య పథకం మాకొద్దు

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం స్పష్టీకరణ



కోల్‌కతా : కేంద్ర బడ్జెట్‌లో అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన జాతీయ ఆరోగ్య రక్షణ పథకం తమకు అవసరం లేదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇప్పటికే తమ రాష్ట్రంలో 50 లక్షల మంది స్వాస్థ్య సాథీ కార్యక్రమంలో భాగస్వా ములయ్యారని, మోడీ కేర్ తమకెందుకని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. దీంతో ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం నుంచి తప్పుకున్న తొలి రాష్ట్రంగా పశ్చిమ బెంగాల్ నిలిచింది. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ పథకంలో 40 శాతం రాష్ట్రాలు భరించాలి. కానీ మాకు ఇప్పటికే ఓ కార్యక్రమం ఉన్నపుడు మరోదానిపై ఎందుకు ఖర్చు చేయాలని మమతా ప్రశ్నించారు. అసలు ఈ స్కీమ్ గురించి చెప్పిన మరుసటి రోజే.. ఇది కేవలం పేపర్లకే పరిమితయ్యేదని మమతా పేర్కొన్నారు.

యూపీలో అల్లర్లేమీ జరగలేదు : డీజీపీ

లక్నో : ఇటీవల కాస్గంజ్‌లో మత ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో అల్లర్లు జరిగినట్టు వచ్చిన వార్తలను ఉత్తరప్రదేశ్ డీజీపీ సింగ్ ఖండించారు. గత ఏడాదిగా యూపీలో అల్లర్లు ఏమీ జరగలేదని, సమర్ధమంతంగా తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్రంలో తిరంగా యాత్రతోపాటు అటువంటివే ఇతర ఊరేగింపులు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు.ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోనివ్వకుండా స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రమంతటా అల్లర్లు ఏమీ చోటుచేసుకోలేదని అయితే కొన్ని జిల్లాల్లో గ్రూప్ ఘర్షణలు తలెత్తడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొందని, చెప్పారు. గ్రూపు ఘర్షణ వల్ల కాస్గంజ్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొందని, అయితే సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించి అల్లర్లు వ్యాప్తి చెందకుండా నిరోధించగలిగినట్లు చెప్పారు. కాస్గంజ్‌లో తిరంగా బైక్ ర్యాలీ జరుగుతున్న సందర్భంలో ఏబీవీపీ వర్గానికి, ముస్లిం మైనారిటీకి చెందిన స్థానికుల వర్గానికి మధ్య తలెత్తిన ఘర్షణలో 22 ఏళ్ల విద్యార్థి మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు.



ఆరెస్సెస్‌కు ఇదే సరైన సమాధానం..

ప్రియాప్రకాశ్ వీడియోపై జిగ్నేష్ ట్వీట్

అహ్మదాబాద్ : మలయాళ నటి ప్రియాప్రకాశ్ వారియర్ వీడియోపై గుజరాత్ దళిత నేత, ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ స్పందించారు. ప్రేమికుల రోజుపై నిరసనలు వ్యక్తంచేసే ఆరెస్సెస్‌కు ఆమె వీడియోనే సమాధానమని పేర్కొన్నారు. 'మాణిక్య మలరయ పూవీ' వైరల్ హిట్ కావడం.. వాలెంటైన్స్ డేను నిరసించే ఆరెస్సెస్‌కు ఒక సమాధానం. ఒకరిని ద్వేషించడం కన్నా ప్రేమించడాన్ని అధికంగా ఇష్టపడతామని భారతీయులు మరోసారి రుజువు చేశారని జిగ్నేశ్ ట్వీట్ చేశారు. హిందుత్వ అతివాద సంస్థలు మొదటినుంచి ప్రేమికుల రోజును వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. హిందూ మహాసభ, శ్రీరామసేన, భరతసేన, బజరంగ్ దళ్ మొదలైన సంస్థలు మోరల్ పోలీసింగ్ పేరిట ప్రేమికులరోజున బయట కనిపించే జంటలపై దౌర్జన్యం చేసి.. బలవంతంగా పెళ్లిళ్లు చేస్తున్న ఘటనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రియాప్రకాశ్ వారియర్ ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారింది. మహామహులకు సాధ్యంకానిరీతిలో ఆమె ఇంటర్నెట్‌ను ముంచెత్తింది. ఒక్కరోజులోనే సోషల్ మీడియాను తన సామ్రాజ్యం చేసుకుంది. ఆమె కనుసైగల వీడియో సోషల్ మీడియాలోనే.. దేశమంతటా మీడియాలో మార్మోమోగుతోంది. ఈ వాలెంటైన్స్ డే స్పెషల్‌గా హల్‌చల్ చేస్తోంది. ప్రియాప్రకాశ్ వీడియోపై ఇప్పటికే సినీస్టార్లు మొదలు ఎంతోమంది ప్రముఖులు స్పందించారు.

నివేదిక ఇవ్వండి

సీఎస్ఎల్ పేలుడుపై కేంద్రం



కొచ్చి : ఓఎన్‌జీసీ డ్రిల్ నౌకకు మరమ్మతులు జరుపు తుండగా పేలుడు సంభవించిన ఘటనపై కొచ్చిన్ షిప్ యార్డు(సీఎస్ఎల్) నుంచి కేంద్ర ప్రభుత్వం బుధవారం నివేదిక కోరింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. ఓఎన్‌జీసీ నౌక సాగర్‌భూషణ్‌లో పేలుడు జరిగిన ఒక రోజు తర్వాత కేంద్ర నౌకాయాన శాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్ బుధవారం ఉదయం షిప్ యార్డును సందర్శించి 'సాగర్‌భూషణ్'పై పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తు జరిపి నౌకాయాన మంత్రిత్వ శాఖకు సవివరమైన నివేదిక సమర్పించా ల్సిందిగా సీఎస్ఎల్‌ను మంత్రి ఆదేశించారని సీఎస్ఎల్ ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదిలాఉండగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ నౌక లోపల అగ్ని ప్రమాదం సంభవించిన దాఖలాలేవీ లేవన్నారు. ఘటనపై ఒక ఉన్నతస్థాయి అంతర్గత విచారణను సీఎస్ఎల్ ప్రారంభిం చిందన్నారు. సాంకేతికపరమైన విచారణలను డీజీ షిప్పింగ్స్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగాల ద్వారా చేపట్టారు. 'పోలీసులు ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టారు. దర్యాప్తు తర్వాత మాత్రమే పేలుడుకు గల కారణాలు వెల్లడవుతాయి' అని ఇక్కడ ఆస్పత్రిలో గాయపడిన వారిని పరామర్శించిన తర్వాత మంత్రి చెప్పారు. గాయపడిన వారికి, బాధిత కుటుంబాలకు నౌకాయాన మంత్రిత్వ శాఖ నుంచి పూర్తి సహాయం అందుతుందని మంత్రి హామీ ఇచ్చారు. కాగా పేలుడు ఘటనలో ఐదుగురు మరణించగా, ఏడుగురు గాయపడినట్లు సీఎస్ఎల్ ప్రకటనలో తెలిపింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంపై కేంద్ర రోడ్డు, రహదారుల, నౌకాయాన మంత్రి నితిన్ గడ్కరీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎసిటిలీన్ లీకే పేలుడుకు కారణమా..?

భద్రతా విధానాలను అధిగమించాలనే ధోరణి, కార్మికులలో అతి విశ్వాసమే కొచ్చిన్ షిప్ యార్డులో ఓఎన్‌జీసీలో నౌకలో పేలుడుకు కారణమై ఉండవచ్చునని భద్రతా నిపుణుల ప్రాథమిక నివేదిక సూచిస్తోందని పారిశ్రామిక ప్రమాదాలపై దర్యాప్తు జరిపే ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగ అధికారులు పేర్కొన్నారు. భద్రతా బృందాల ద్వారా తనిఖీలు, ఆడిట్‌లు జరపడంతో పారిశ్రామిక సంస్థలు, విభాగాలలో కొన్నేళ్లుగా భద్రతా వ్యవస్థ మెరుగైందని తెలిపారు. అయితే ఇప్పటికీ కార్మికులు లేదా కాంట్రాక్టర్లు ప్రమాదాలకు దారితీసే భద్రతా నిబంధనలను తప్పించుకునే అవకాశ ఉందని ఆ విభాగానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కాగా వెల్డింగ్ పని కోసం భారీ పరిమాణంలో నిల్వ ఉంచిన ఎసిటిలీన్ లీకవడంతోనే ఈ పేలుడు సంభవించినట్లు ప్రాథమిక తనిఖీ సూచిస్తోంది. ఇది 3 శాతం నుంచి 100 శాతం స్థాయిలో మంట ఉంటుంది' అని ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగం డైరెక్టర్ పి.మోహన్ తెలిపారు. మరిన్ని తనిఖీల తర్వాత మూడు రోజుల్లో పూర్తి నివేదిక వస్తుందన్నారు.

ఆత్మహత్యలకు ఇది పరిష్కారమా ?

మహారాష్ట్ర సచివాలయం వద్ద రక్షణ కవచంపై శివసేన ఫైర్

ముంబై : మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వంపై మిత్ర పక్షమైన శివసేన మరోసారి విమర్శలు గుప్పించింది. రాష్ట్రంలో ఆత్మహత్యలను నివారించేందుకు అవసరమైన పరిష్కార చర్యలను తీసుకోకుండా సచివాలయం వద్ద రక్షణ కవచం (సేఫ్టీ నెట్) ఏర్పాటు చేయడం ఏమిటని నిలదీసింది. ఈ చర్య కడుపులో నొప్పికి కాళ్లకు మందు రాసినట్టుగా ఉందంటూ ఎద్దేవాచేసింది. మూడేళ్లలో 4వేల మందికిపైగా ఆత్మహత్యలు చేసుకున్నారని, వారిలో కొందరు తమ ఇళ్లల్లో మరికొందరు పొలాల్లో ప్రాణాలు తీసుకున్నారని, చాలా తక్కువ మంది సచివాలయం వద్ద బలవన్మరణానికి యత్నించారని పేర్కొంది. కార్మికులు, కర్షకులు ఆత్మహత్యలు చేసుకునేందుకు మంత్రాలయ (సచివాలయాన్ని అలా సంబోధిస్తారు) మెట్లను ఎక్కే పరిస్థితి రాకుండా వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సచివాలయం వద్ద రక్షణ కవచం ఏర్పాటు చేసి చేతులు దులుపుకొనేందుకు యత్నిస్తోందని శివసేన ఘాటుగా విమర్శించింది. మంత్రాలయ 'సూసైడ్ పాయింట్'గా మారిందని, దీంతో అక్కడకు వచ్చే ప్రతి ఒక్కరిని ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చారా అని అనుమానిస్తున్నారంటూ ఎద్దేవా చేసింది. ఆత్మహత్య లన్నది రాష్ట్రప్రభుత్వానికి చెరగని మచ్చ అని ... దీనికి నైలాన్ నెట్లను ఏర్పాటు చేయడం పరిష్కారం కాదని తమ అధికారిక పత్రిక సామ్నా సంపాదకీయంలో పేర్కొంది.

ఏడు అంతస్తుల మంత్రాలయ మొదటి అంతస్తు వద్ద రక్షణ కవచాన్ని పీడబ్ల్యూడీ శాఖ ఇటీవల ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు సెక్రటేరియట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది.

భారత్ 'విశ్వగురువు' కావాలి : రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ : భారత్‌ను విశ్వగురువుగా తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో 'జల్ మిట్టీ రథయాత్ర'ను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 'శక్తిమంతులుగా ఎదిగి ఇతర దేశాల ప్రజల గుండెల్లో దడ పుట్టించడం మా ఉద్దేశం కాదు. సుసంపన్న భారతావనిని కోరుకుంటున్నాం.. దేశాన్ని విశ్వగురువుగా చూడాలని ఆకాంక్షిస్తున్నాం' అని అన్నారు. జాతి నిర్మాణం, అభివృద్ధి ఈ యాత్ర ఉద్దేశంగా తెలిపారు. 'ఈ రథయాత్ర మిగతా యాత్రల వంటిది కాదు. దీన్ని ఓ ప్రభుత్వాన్ని సంఘటితపర్చేందుకో... అసంఘటిత పర్చేందుకో చేపట్టడం లేదు.. జాతి నిర్మాణమే ఈ యాత్ర ఉద్దేశం' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. జల్ మిట్టీ రథ యాత్రలో పాల్గొనేవారు దేశంలోని 'చార్‌ధామ్' నుంచి జలం, మన్నును తీసుకొస్తారన్నారు. మార్చిలో బీజేపీ సీనియర్లు, కేంద్ర మంత్రులు తలపెట్టే మహాయజ్ఞానికి ఈ యాత్ర ఓ లాంచ్‌పాడ్ వంటిదని చెప్పవచ్చు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం 108 హోమగుండాలు, 2,100 మంది వేదపండితులు, 51వేల మందితో మహాయజ్ఞాన్ని ఎర్రకోట వద్ద నిర్వహించనున్నారు. ఈ మహాయజ్ఞం మార్చి 18 నుంచి 25వ తేదీ వరకు జరగనుంది.

ఇద్దరు పిల్లలే ముద్దు...

బీజేపీ తదుపరి నినాదం

న్యూఢిల్లీ : దేశంలో కుటుంబ నియంత్రణ విధానానికి బీజేపీ మద్దతు పలికింది. దేశప్రజలు ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకోవాలని సూచిస్తోంది. బీజేపీ అధికార ప్రతినిధి అశ్విని ఉపాధ్యాయ ఈ విషయమై ట్విట్టర్‌లో స్పందించారు. ఇరాన్ దేశాన్ని ఉదాహరణగా పేర్కొంటూ ఆయన ఓ ట్వీట్ చేశారు. ఇరాన్‌లో 1990వ దశకం నుంచే ఇద్దరు పిల్లల విధానం అమల్లో ఉందని, ఇద్దరు పిల్లలున్న కుటుంబాలకు ఇస్లాం అనుకూలమని ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. ఇద్దరు పిల్లల విధానం అమలు తర్వాత మారిన ఇరాన్ జనాభా గణన వివరాలతో కూడిన ఓ స్నిప్పెట్‌ను పోస్టుచేశారు. దేశవ్యాప్తంగా ఇద్దరు పిల్లల విధానం అమలు చేయాలని కేంద్రానికి సూచించాలంటూ సోమవారం సుప్రీంకోర్టులో ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అయితే, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ విధానం అమల్లో ఉంది. కాగా, ఒక సంతానానికే పరిమితం కావాలంటూ ఆంక్షలు విధించిన చైనా 2016లో దానిని రద్దు చేసిన విషయం తెలిసిందే.

త్వరలో 'కెన్-బెట్వా' ప్రాజెక్టు సమస్య పరిష్కారం : గడ్కరీ

న్యూఢిల్లీ : కెన్వా-బెట్వా నదీ అనుసంధాన ప్రాజెక్టుపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తిన సమస్యకు నాలుగైదు రోజుల్లో పరిష్కారం లభిస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం, ఆ రాష్ట్రానికి మధ్య ఒప్పందం కుదిరే దిశగా మార్గం సుగమం అవుతుందని చెప్పారు.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు దాదాపు ప్రధానమైన అన్ని అనుమతులు పొందిందని, అయితే ఈ ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందే రెండు రాష్ట్రాల్లో ఒకటైన మధ్యప్రదేశ్ అభ్యంతరం లేవనెత్తడంతో గత ఏడాదిలో దాని ప్రక్రియ నిలిచిపోయినట్టు తెలిపారు. కాగా రెండవ దశలో మరో ఇతర మూడు చిన్న ప్రాజెక్టులను గనుక చేర్చకపోతే ప్రాజెక్టు మొదటి దశ ప్రక్రియకే అనుమతినివ్వబోమని మధ్యప్రదేశ్ ప్రభుత్వం హెచ్చరించింది.2017 చివరన కేంద్రం ఆ ప్రాజెక్టులను చేర్చివేసేందుకు అంగీకరించింది. అటల్‌బిహారీ హయాంలో ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రాధ్యల్యంతో ఈ ప్రాజెక్టు అమలుకు మరొక లబ్ధిదారి రాష్ట్రం అయిన ఉత్తరప్రదేశ్ ఇప్పటికే అంగీకరించింది.

పిల్లల సంక్షేమానికి సాంకేతికత

ప్రభుత్వాన్నికోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: భారతదేశం 'సాంకేతిక పరిజ్ఞానకేంద్రం' అని చెప్పేమాట కేవలం కాగితాలకే పరిమితమైందనీ, ఈ విజ్ఞానాన్ని పిల్లల సంక్షేమానికి వినియోగించాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరింది. సాంకేతిక పరిజ్ఞానంలేని పిల్లలకు తప్పనిసరిగా ఈ విజ్ఞానం అందించాలని సూచించింది. బాల నేరస్థుల న్యాయబోర్డులు, పిల్లల సంక్షేమ కమిటీలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. ఈ సంస్థలలో కంప్యూటర్లు, వాటి అనుబంధ పరికరాలకొరత తీవ్రంగా ఉందని అక్కడి పరిస్థితులు హృదయవిదారకంగా ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు మదన్ బి.లోకూర్, దీపక్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ప్రభుత్వానికి పై సూచన చేసింది. తప్పిపోయిన పిల్లలను గుర్తించడానికి, వారిని తిరిగి దారికితీసుకురావడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందని ధర్మాసనం తెలిపింది. హానికలిగించే పరిశ్రమల్లో పనిచేస్తున్న, లైంగికంగా వినియోగించుకుంటున్న బాధితులైన పిల్లలను గుర్తించి రక్షించాలని కోర్టు కోరింది.

కేరళలో బస్సు చార్జీలు పెంపు

తిరువనంతపురం : ప్రభుత్వ, ప్రైవేటు బస్సు చార్జీలను పెంచుతున్నట్లు కేరళ ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. మార్చి 1వ తేదీ నుంచి పెంపు అమల్లోకి రానుంది. ఆర్డినరీ బస్సు కనీస చార్జీ రూ.7 నుంచి రూ.8కి, ఫాస్ట్ పాసింజర్ సర్వీసుల చార్జీలు రూ.10 నుంచి రూ.11కి పెరగనున్నాయి. కనీస చార్జీతోపాటు సర్వీసులకు చెందిన అన్ని విభాగాలకు కూడా కిలో మీటరుకు చార్జీలు పెరిగాయి. చార్జీల పెరుగుదల స్థాయి ఎనిమిది పైసలు, రూ.6 మధ్య ఉంది. తిరువనం తపురంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రవాణా మంత్రి ఎ.కె.శశీంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ రవాణా రంగాన్ని పరిరక్షించడానికి పెరుగుదల అవసరమని తెలిపారు. చివరిగా 2014లో బస్సు చార్జీలను పెంచారు. 'ఇటువంటి నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రభుత్వం సంతోషంగా లేదు' అని ఆయన తెలిపారు. విద్యార్థులకు చార్జీల రాయితీల్లో మార్పులపై మాట్లాడుతూ 40 కిలోమీటర్లకు పైబడిన దూరం ప్రయాణించే విద్యార్థులకు ఒక రూపాయి మేర చార్జీ పెరుగుతుందని మంత్రి శశీంద్రన్ తెలిపారు. రవాణా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జస్టిస్ సి.రామచంద్రన్ ప్యానెల్ సిఫార్సుల ఆధారంగా చార్జీల పెంపు ప్రకటన చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన పేర్కొంది. అయితే ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు బస్సు చార్జీల పెంపు ద్వారా వారిపై ప్రభుత్వం మరింత భారం వేసిందని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ విమర్శించింది.



'విజయ్' రాజకీయం

- శరవేగంగా బూత్ కమిటీల ఏర్పాట్లు
- సభ్యుల చేరిక ప్రక్రియ సగం పూర్తి

చెన్నై: రాజకీయ పార్టీల ఏర్పాట్లలో సినీనటులు రజనీకాంత్, కమల్‌హాసన్ తలమునకలై ఉన్నారు. పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు రజనీ, కమల్ ఇప్పటికే ప్రకటించారు. దానికితగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, యువనటుడు విజయ్ తన రాజకీయరంగ ప్రవేశానికి రహస్యంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయ్ ప్రజాసంఘం నిర్వాహకులు తమిళ పత్రికకు తెలిపారు. చెన్నైలో విజయ్ వారితో సమావేశమయ్యారు. అందులో పాల్గొన్న నిర్వాహకులు కొందరు మాట్లాడుతూ సభ్యులను చేర్చడానికి రజనీ తన వెబ్‌సైట్‌ను జనవరి 2న ప్రారంభించారని, అయితే తమ నాయకుడు విజయ్ గతేడాది సెప్టెంబరులోనే సభ్యులను చేర్చడానికి మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించారని గుర్తు చేశారు. బూత్ కమిటీల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగు తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే, అన్నాడీఎంకేలకు మాత్రమే ప్రతి బూత్‌లో నిర్వాహకులను కూర్చోబెట్టి ఓటు నమోదును పరిశీలించే విధంగా బలమైన క్యాడర్ ఉందని, ఆ విధంగా మనకు కూడా బూత్ కమిటీలు ఉండాలని, ఎన్నికల విజయాన్ని బూత్ కమిటీలే నిర్ణయిస్తాయని విజయ్ చెప్పినట్టు సమాచారం. అందుకే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి బూత్ కమిటీ ఏర్పాట్లు చేయాలని అఖిల భారత విజయ్ ప్రజాసంఘం అధ్యక్షుడు బుస్సీ ఆనంద్‌ను విజయ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం తాము బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఒక బూత్ కమిటీలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, ఉప కార్యదర్శి, కోశాధికారి ఉంటారన్నారు. నియోజకవర్గానికి 50 వేలమంది సభ్యులను చేర్చాలని విజయ్ తమకు సూచించినట్టు చెప్పారు. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయని ఓ అభిమాని తెలిపారు. 2016 ఎన్నికల్లోనే ఒక పెద్ద పార్టీ విజయ్ తండ్రితో చర్చలు జరిపిందని, దానికి విజయ్ అడ్డుకట్ట వేశారన్నారు. ఒకవేళ ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకోవాల్సి వస్తే ఏపి నియోజకవర్గాలు అడగాలో కూడా జాబితా తయారు చేశామని, తంజావూరు, సేలం, మదురై, చెన్నైలో తమకు ఎక్కువ మద్దతు ఉందని ప్రజా సంఘం నిర్వాహకులు తెలిపారు. పొత్తుల గురించి నిర్వాహకుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, మదురై జిల్లా నిర్వాహకులు మాత్రం విజయ్ ఒంటరిగా బరిలో దిగాలని కోరుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. పడమర మండల నిర్వాహకులు మాత్రం విజయకాంత్ విషయాన్ని ప్రస్తావిస్తూ అన్నాడీఎంకేతో పొత్తువలన ఎక్కువ సీట్లు సాధించినట్లు గుర్తు చేశారు. ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవడమే ఉత్తమమని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. టీటీవీ దినకరన్‌తో పొత్తు పెట్టుకోవాలని దిండుక్కల్, తేని, డెల్టా జిల్లాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. వీరి అభిప్రాయాలన్నీ విజయ్ నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. తంజావూరు జిల్లా విజయ్ ప్రజా సంఘం అధ్యక్షుడు విజయ్ శరవణన్ మాట్లాడుతూ బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆరు నెలల ముందే విజయ్ తమతో చెప్పారన్నారు. విజయ్ త్వరలో రాజకీయ రంగంలోకి దిగాలన్నదే తమ కోరికని పేర్కొన్నారు. అఖిల భారత విజయ్ ప్రజా సంఘం అధ్యక్షుడు బుస్సీ ఆనంద్ మాట్లాడుతూ బూత్ కమిటీల ఏర్పాటు సాధారణ చర్యని, రాజకీయ ప్రవేశం గురించి విజయే నిర్ణయం తీసుకోవాలని, ఆయన చెప్పినట్లు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

విద్యార్థులను ముంచే ముఠా గుట్టురట్టు

బెంగళూరు : కర్ణాటకలో వైద్య, ఇంజనీరింగ్ కాలేజీలో సీట్లు ఇప్పిస్తామని కోట్లరూపాయలు దండుకుని మోసం చేసే ముఠా గుట్టురట్టయ్యింది. పీజీ సీట్లు ఇప్పిస్తామని మోసం చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. రాజేశ్ షెట్టి, జయప్రకాష్ సింగ్‌లు ఒక ఆఫీసు తెరచి ఇలాంటి వంచనలకు పాల్పడుతున్నారని, ఇలాంటివి వారికి ఆరు కార్యాలయాలు ఉన్నట్టు గుర్తించామని పోలీసులు తెలిపారు. ముగ్గురు గ్రాడ్యుయేట్లు ఫిర్యాదు చేయడంతో వారిని అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు.

గ్రామాల్లో ఆంగ్లమాధ్యమ విద్య

పుదుచ్చేరి : గ్రామీణ ప్రాంతాల్లో ఆంగ్లమాధ్యమ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామని పుదుచ్చేరి ప్రభుత్వం తెలిపింది.ఇందుకోసం విద్యావేత్తల సహాయ సహకారాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి వి.నారాయణ స్వామి వెల్లడించారు. భారతదేశంలోని అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్‌తో సమావేశమనంతరం ఈ విషయం వివరిస్తూ, గ్రామీణ విద్యార్థులు ప్రయోజనం కోసం కెన్నెత్ ముందు కొచ్చారని, త్వరలో పరిపాలనా విభాగం, అమెరికా కాన్సులేట్‌తో చర్చించి దీనిపై పథకం ప్రవేశపెడతామన్నారు. వైద్య, ఇతర రంగాల్లో కూడా ప్రాజెక్టులు చేపడటానికి అమెరికా-పుదుచ్చేరిల అసోసియేషన్ చర్చలు జరుపుతున్నాయన్నారు.

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు అరెస్టు

అహ్మదాబాద్ : వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌కు చెందిన 10 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.వాలెంటైన్స్‌డే సందర్భంగా సబర్మతీ నది ఒడ్డున కూర్చున్న యువతీయువకులను వేధించడంతో సమాచారం అందు కున్న పోలీసులు వారిని బుధవారం ఉదయం అరెస్టు చేశారు. యువతీ యువకులను ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయమని చెప్పాముగాని, ఎటువంటి దాడి జరగలేదని కార్యకర్తలు వెల్లడించారు. పరిసరప్రాంతాల్లోని వారు వైరల్ చేసిన దృశ్యాలను బట్టి అక్కడికి చేరిన వారిని కాషాయ జెండాలతో భీతావహులను చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి.

అక్టోబరు 31న పటేల్ విగ్రహావిష్కరణ

వడోదర : గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం 18 మీటర్ల కట్టడం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'ని అక్టోబరు 31న ఆవిష్కరించేందుకు సిద్ధం చేశారు. దీనిని భారత ప్రథమ హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు అంకితమిస్తారు. విగ్రహాన్ని కెవేడియా నర్మదా నది సర్దార్ సరోవర్ డ్యామ్‌కు 3.32 కిమీ దూరంలోని సాథుబెట్‌లో ఈ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ను ప్రధాని మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. రానున్న రోజుల్లో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే కట్టడంగా ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివరించారు.

ముజాహిద్దీన్ ఉగ్రవాది అరెస్టు

న్యూఢిల్లీ : బాట్లా హౌస్ అరెస్టుల తర్వాత పారిపోయిన ముజాహిద్దీన్ ఉగ్రవాది అరిజ్ ఖాన్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. 2008 సెప్టెంబరు 19న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టగా, పోలీసులు కళ్లుకప్పి పారిపోయిన ఖాన్‌ను వలవేసి పట్టుకున్నామని ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు మోహన్ చంద్ శర్మ తెలిపారు. ఇదే సంస్థకు చెందిన షాజద్ అహ్మద్‌కు కోర్టు జీవితకాల శిక్ష విధించింది.

గాలి నాణ్యతపై ఆప్ ప్రభుత్వ అధ్యయనం

న్యూఢిల్లీ : ఏడాది గాలినాణ్యతపై ఢిల్లీ ప్రభుత్వం అధ్యయనం జరిపి, గాలి నాణ్యతాలోపాలకు గల కారణాలను విశ్లేషించింది. ప్రాంతం, సమయం బట్టి గాలిలో తేడాలు వస్తున్నట్లు గుర్తించారు. నిర్ణీత సమయంలో వాతావరణ కాలుష్యాన్ని గుర్తిచేందుకు యంత్రాలను ఉపయోగించి పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రాజధానిలోని 500 కిమీ రోడ్లపై గాలినాణ్యతను పరిశీలిస్తారు. పెద్ద ఎత్తున మొక్కల పెంపకంతో వాయుకాలుష్యం తగ్గించేందుకు చర్యలు చేపడతామని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వెల్లడించారు.

మరో 46 మందిపై ఏఐడీఎంకే వేటు

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, ఉపముఖ్యమంత్రి పళనీస్వామి పార్టీలో క్రమశిక్షణా చర్యలను ఇంకా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా 46 మంది కృష్ణగిరి ఆఫీసు బేరర్లపై వేటు వేశారు. ఏఐఏడీఎంకే విధివిధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్న కారణంతో వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ, ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామని వారిద్దరు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్కేనగర్ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే నష్టపోగా ప్రత్యర్థి టీటీవీ దినకరన్ విజయం సాధించడంతో పార్టీ ఈ చర్యలకు ఉపక్రమించింది.

అక్రమాస్తుల కేసులో ఐటీ అధికారికి చుక్కెదురు

న్యూఢిల్లీ : అక్రమాస్తుల కేసులో ఆదాయపు పన్ను శాఖ సీనియర్ అధికారి శ్వేతాబ్ సుమన్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురయ్యింది. ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పులో కలుగ చేసుకోబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితుడు డాక్టర్. శ్వేతాబ్ సుమన్ కేసు సాక్షులను దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించాలని అత్యున్నత న్యాయం స్థానం ఆదేశిస్తూ, నిందితుడి స్వేచ్ఛకు భంగం వాటిల్లితే హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయవచ్చని తెలిపింది.

ఆప్ 'ప్రకటన' లకే పరిమితం : షీలాదీక్షిత్

న్యూఢిల్లీ : ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం 'ప్రకటనల' ప్రభుత్వమని, కేవలం మాటలు తప్ప చేతలు కన్పించడం లేదని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ కేజ్రీవాల్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. ఢిల్లీలో ఆమ్‌ఆద్మీపార్టీ ప్రభుత్వం మూడేళ్ల పాలనా తీరుకు సంబంధించిన 'చార్జిషీటు'ను ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ అజయ్ మకెన్ స్థానిక డీపీసీసీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా షీలా మాట్లాడుతూ, వార్తా పత్రికల్లో ప్రకటనలు ఇస్తూ కేవలం మీడియా కవరేజీ చేస్తుందని, పనులు మాత్రం జరగడం లేదని విమర్శించారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని ఆమె చెప్పారు.

మార్చి 31వరకు ముకుల్ అరెస్టు వద్దు

కోల్‌కతా : బీజేపీ నాయకుడు ముకుల్ రాయ్‌ను మార్చి 31 వరకు అరెస్టు చేయకుండా కలకత్తా హైకోర్టు మధ్యంతర ఆదేశాలను జారీ చేసింది. 2015లో ముకుల్ ఒకరి హత్యకు కారణమయ్యారని ఆయనపై కేసు నమోదు అయ్యింది. బాధితుడు మృణాల్ కాంతి రాయ్ చికిత్స, మృతికి సంబంధించి మరికొన్ని పత్రాలు సమర్పించేందుకు మరికొంత సమయం కావాలని బెంగాల్ పోలీసులు కోరడంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ముఖ్యనాయకుడైన ముకుల్‌రాయ్ బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

బీజేపూర్‌లో బీజేడీదే విజయం : పట్నాయక్

భువనేశ్వర్ : బీజేపూర్ ఉప ఎన్నికల్లో బీజేడీ విజయం సాధిస్తుందని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దీమా వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 24న ఈ ఎన్నిక జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే గెలుపుకు కారణమవుతుందని గురువారం ఢిల్లీలో జరిగే హాకీ వరల్డ్ కప్ -2018కు వెళుతూ విలేకరులకు తెలిపారు. నవంబరు 28, డిసెంబరు 16లో పురుషుల వరల్డ్ కప్‌ను ఒడిశాలోని కళింగ స్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు.

మోడీ ప్రభుత్వం తండ్రిలా ఆదుకుంటుంది

అగర్తలా : మోడీ ప్రభుత్వం త్రిపురను తండ్రిలా ఆదుకుంటుందని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ బిప్లావ్ దెబ్ తెలుపుతూ, మాణిక్ 'సర్కార్ సర్కారియా' నుంచి బయట పడాలన్నారు.రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిరుద్యోగం ఉందని, అక్కడ అధికారం ఇస్తే పేదరాష్ట్రాన్ని ఆదుకొని ప్రగతిపథంలో నడిపిస్తామన్నారు. బీజేపీ సీఎం అభ్యర్థిని ప్రకటించనప్పటికీ యువకుడు దెబ్‌ను(46) సీఎంగా నిర్ణయించే అవకాశం ఉంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 4వ వేతన సిఫార్సులు అమలు చేస్తున్నదని, తమ ప్రభుత్వం ఏర్పడితే , ఏడవ వేతన సంఘం సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వామపక్షాలు బాగుపడుతున్నాయి కాని ప్రజలకు ఒరిగిందేమీ లేదని దెబ్ వెల్లడించారు. 25 ఏళ్లనుంచి అక్కడ సీపీఎం పార్టీ అధికారంలో ఉంది.

ఎంపీల రాజీనామా ప్రకటన బూటకం



విశాలాంధ్ర - విశాఖపట్నం : వైఎస్సార్‌సీపీ నేత జగన్మోహన్‌రెడ్డి చేసిన ఎంపీల రాజీనామా ప్రకటన పెద్ద బూటకమని, రాష్ట్ర ప్రజలు ఎవరూ దానిని విశ్వ సించరని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధ వారం ఆయన సర్క్యూట్ హౌస్‌లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలసి విలేకరులతో మాట్లాడారు. గతంలో కూడా మూడుసార్లు రాజీనామా చేస్తామని తేదీలు ప్రకటించి మాట నిలుపుకోలేదని గుర్తు చేశారు. పాదయాత్రకు ఆశించిన స్పందన లేకపోవడంతో ప్రజల దృష్టి మళ్లించడానికి ఈ బూటకపు నాటకానికి తెరలేపారన్నారు. 2016లో రాజీనామా చేసివుంటే నంద్యాలతో పాటు ఎంపీ స్థానాలకు కూడా ఉపఎన్నికలు జరిగేవని, ప్రజలు తగిన బుద్ధి చెప్పేవారని అన్నారు. ఏప్రిల్ 6వ తేదీ తరువాత రాజీనామాలు సమర్పిస్తామని చెప్పడంలోనే ఇదో నాటకమని అర్థమవుతుందన్నారు. అప్పటికి పార్లమెంటు సమావేశాలు ముగుస్తాయని, ఎంపీలు రాజీనామాలు సమర్పించినా స్పీకర్ పరిశీలించి నిర్ణయం తీసుకునేందుకు 6 నెలలు పైనే పడుతుందని అన్నారు. ఈలోగా ఎన్నికలు కూడా దగ్గరపడతాయని గుర్తు చేశారు. బడ్జెట్ ప్రకటించి 2 వారాలు గడుస్తున్నా ఇప్పటి వరకు బీజేపీని గాని, నరేంద్రమోడీని గాని ఒక్కమాట కూడా అనకపోవడంలో తన వైఖరి ఏమిటో తెలుస్తుందన్నారు. ఆ పార్టీ ఎంపీలు బడ్జెట్‌పై చేసిన ప్రకటనబట్టి వారి వైఖరి స్పష్టమవుతున్నదన్నారు. మిత్రపక్షంలో ఉండి కూడా తాము రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామన్నారు. పార్లమెంటులో ప్రతిపక్షం చేయాల్సిన పనిని ప్రభుత్వంలో ఉన్నప్పటికీ టీడీపీ ఎంపీలు పోరాటం చేస్తున్నారన్నారు. విభజన హామీల్లో పరిష్కారం కాని వాటి గురించి సీఎం చంద్రబాబునాయుడు కూడా ప్రతిసారి ప్రధానిని అడుగుతూనే ఉన్నారన్నారు. హామీలు అమలుకాని వాటిపై దృష్టిపెట్టామని, అమలు జరిగే వరకు వదిలిపెట్టమన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తెలుగుదేశం పార్టీ ఉపసంహరించుకోవడం పెద్ద విషయం కాదని, తమ పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అసమర్థ ప్రతిపక్ష నేత వ్యవహారశైలిని ప్రజలు గమనిస్తున్నారని, 2019లో కూడా ప్రజలు తెలుగుదేశం పార్టీకే పట్టం కడతారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈసారి వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అడిగిన లెక్కలన్నీ ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

హామీలను అమలుచేయాలి



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : ఎస్సీ వర్గీకరణ చేసి దానికి చట్టబద్ధత కల్పిస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఇప్పటికైనా అమలుచేసే విధంగా చర్యలు చేపట్టాలని ముఖ్య మంత్రికి విజ్ఞాపన పత్రం అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎంఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 13 జిల్లాల ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి గత ఎన్నికల సమయంలో మాదిగలకు ఇచ్చిన హామీ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఇంతవరకు ఆ విషయంపై దృష్టి కేంద్రీకరించలేదన్నారు. దీనిపై తక్షణం స్పందించి రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విధంగా బిల్లు ప్రవేశపెట్టి దానిని ఆమోదించే విధంగా ప్రధాని మోడీని ఒప్పించే బాధ్యత చేపట్టాలని కోరారు. మాలల కంటే అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న మాదిగ ఉపకులాలకు వెంటనే ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు, చర్మకారుల అభివృద్ధి కోసం లిడ్‌క్యాప్‌ను పునరుద్ధరించాలని సూచించారు. బీఆర్ అంబేద్కర్ స్మృతి వనంలో పాటు బాబూ జగ్జీవన్‌రామ్ స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరగా, సీఎం సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ప్రతిపక్షనేత వైఎస్.జగన్ తన పాదయాత్రలో ఎస్సీ వర్గీకరణ జరగదని దానిపై తాను ఏమీ చేయలేనని చెప్పడం తన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ హయాంలో ఉషా మెహ్రా కమిషన్ వర్గీకరణ కోసం వేసిన కమిషన్ అన్న సంగతి గుర్తుంచుకోవాలని తెలిపారు. సీఎంను కలిసినవారిలో మేదర సురేష్ మాదిగ, మంగళపూడి నాగేశ్వరరావు మాదిగ, బుదాల శ్రీను, సింగంపల్లి శ్రీను, జమ్మలమూడి మధు, రెల్లి సంక్షేమ సంఘం పాయకులు లీలాకుమార్ తదితరులు ఉన్నారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం



విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరుజిల్లా మంగళగిరి పట్టణంలోని భార్గవపేటకు చెందిన బీటెక్ విద్యార్థిని అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోలి రవి, కుమారి దంపతుల కుమార్తె దుర్గా పరమేశ్వరి (20) విజయవాడలోని పొట్టి శ్రీరాములు కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 10వ తేదీ శనివారం ఉద యం 10 గంటలకు ప్రతిరోజు మాదిరి కళాశాలకు బయలుదేరి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవ డంతో కుటుంబ సభ్యులు బంధువు లను, స్నేహితులను విచారించినా నేటికీ పరమేశ్వరి ఆచూకీ లభించ లేదు. దీంతో తల్లి కుమారి తన కుమార్తె గత నాలుగు రోజుల నుంచి కనపడటం లేదని బుధవారం మం గళగిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పట్టణ ఎస్‌ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 ఎకరాల జీడి, టేకు తోటలు దగ్ధం



విశాలాంధ్ర - వేపాడ : విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని చామలాపల్లి శివారు వెంకయ్యపాలెం ఫారెస్టు బీట్ పరిధిలోని 10 ఎకరాల రిజర్వు ఫారెస్ట్ భూములు, సమీపంలోని 7 ఎకరాల డీ ఫారం భూముల్లో దశాబ్దాల తరబడి పెంచుకుంటున్న జీడి, టేకు తోటలు బుధవారం పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి అనూహ్యంగా మంటలు చెలరేగడంతో పోతుబందిపాలెం గ్రామానికి చెందిన దల్లి పెద్దిరాజు, పోతుబంది చినదేముడు, పోతుబంది దేముళ్లు, గుమ్మిడి కొండబాబు, దల్లి చిన్నయ్యదొర, దేముళ్లు తదితర రైతులకు చెందిన 10 ఎకరాల రిజర్వు ఫారెస్ట్ భూముల్లోని జీడి, టేకు, అకేషియా తోటలు అగ్నికి ఆహుతికాగా గిరిజన రైతులంతా గగ్గోలు పెడుతున్నారు. అలాగే దబ్బిరాజుపేట గ్రామానికి చెందిన ఏడువాక చినదేముడు, ఈశ్వరమ్మ, దేముడు, నాగరాజు, జనపరెడ్డి దేముడు తదితర నిరుపేద రైతులకు చెందిన ఏడు ఎకరాల్లోని జీడి, టేకు, అకేషియా తోటలు కూడా కాలి బూడిదయ్యాయి. 20 ఏళ్ల నుంచి ఎండ, వాననక కష్టించి పెంచుకున్న తోటలు సరిగ్గా ఫలసాయం అందివచ్చే సమయంలో అగ్నిప్రమాదం సంభవించి సర్వనాశనం చేసిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. అగ్నిమాపక శకటాలు వెళ్లే దారిలేక కళ్లముందే తోటలన్నీ కాలిపోతున్నా ఉనూరుమంటూ ఉండిపోయామని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఈమేరకు రైతులంతా జరిగిన ఆస్తినష్టంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహశీల్దార్ పెంటయ్య మాట్లాడుతూ జరిగిన నష్టాన్ని అంచనా వేసి కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులకు కూడా రైతులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

- వేసవిలో తాగునీరు ఎప్పటికి విడుదల చేస్తారో
- ప్రకాశం బ్యారేజ వద్ద కాలువలో పనులు
- అడుగంటే స్థితిలో తాగునీటి చెరువులు
- తీరంలో మరింత ఇబ్బందే

విశాలాంధ్ర - విజయవాడ :

వేసవి రాకముందే కృష్ణాజిల్లాలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. మార్చి నెల నుంచి సముద్ర తీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి ఏర్పడటం ఖాయంగా కనిపిస్తోంది. రబీ సీజన్‌కు కాలువల ద్వారా నీరు విడుదల చేస్తే ఏప్రిల్ నెలాఖరు వరకు తాగునీటి ఎద్దడి ఉండేది కాదు. రబీ సీజన్‌కు నీరివ్వలేమని ప్రభుత్వం చేతులెత్తేయడంతో గత నెల 15వ తేదీ నాటికే కాలువలకు సాగునీటి విడుదలను నిలిపివేశారు. కాలువలకు నీటి విడుదల సమయంలో తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపకపోవడం, చెరువులు పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న వేసవిలో తీరం వెంబడి ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి నెలకొంది. ప్రకాశం బ్యారేజీ వద్ద బందరు కాలువకు ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా లాకుల వద్ద అడ్డుకట్ట వేశారు. ఈ అడ్డుకట్టను వేసి పిల్లర్ పనులు చేయాల్సి ఉంది. దీంతో ఇప్పట్లో ఈ క్రాస్‌బండ్‌ను తీసే సూచనలు కానరావడం లేదు. ప్రకాశం బ్యారేజీనుంచి నీటిని విడుదల చేస్తేనే తాగునీటి ఇబ్బందులు తొలగుతాయి.



జిల్లాలో 374 తాగునీటి చెరువులు :

గ్రామీణ రక్షిత మంచినీటి పథకం (ఆర్‌డబ్ల్యూఎస్) కింద డెల్టా ప్రాంతంలో 374 తాగునీటి చెరువులు ఉన్నాయి. గుడివాడ, కైకలూరు, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో ఈ తాగునీటి చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల ద్వారా సుమారు 2200 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించాల్సి ఉంది. ఈ చెరువులలో తాగునీటిని నింపే కార్యక్రమం సక్రమంగా జరగలేదనే వాదన ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ వద్ద నిధులు లేవని, చెరువులను నింపుకునే పనిని ఆయా గ్రామ పంచాయతీలే చేసుకోవాలని చెప్పడంతో పాటు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వంతులు వేసుకోవడంతో ఈ చెరువులు నిండని స్థితి నెలకొంది. మచిలీపట్నం, పెడన పురపాలక సంఘాలతో పాటు మచిలీపట్నం, గూడూరు మండలాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు నిర్మించిన తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులోనూ పూర్తి స్థాయిలో నీరు అందుబాటులో లేదు. ఈ చెరువు ద్వారా దాదాపు 4 లక్షల మందికి తాగునీటిని అందించాల్సి ఉంది. గత రెండేళ్లుగా రబీ సీజన్‌లో కాలువలకు నీరు విడుదల చేయకపోవడంతో మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని ప్రజలు తాగునీటికోసం పలు ఇబ్బందుల పాలయ్యారు. వేసవికి ముందే రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో తీర ప్రాంతంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఉంటుంది. కైకలూరు, గుడివాడ నియోజక వర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. బంటుమిల్లి, కృత్తివెన్ను, అవనిగడ్డ, నాగాయలంక , కోడూరు మండలాల్లోని తాగునీటి చెరువులు అడుగంటితే తాగునీటికోసం కచ్చితంగా కాలువలద్వారా నీటిని విడుదల చేయాల్సిందే. ప్రతి ఏటా వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ లేదా మే నెలల్లో కాలువలకు తాగునీటిని విడుదల చేస్తారు. ప్రకాశం బ్యారేజీ సమీపంలోని లాకుల వద్ద కాలువను పూడ్చి వేయడంతో ఈ అడ్డుకట్టను ఎప్పటికి తొలగిస్తారు, ఎప్పటికి కాలువలకు తాగునీటిని విడుదల చేస్తారు అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. గత రెండేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.



దామోదరం సంజీవయ్యకు
కాంగ్రెస్ నివాళి

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 98వ జయంతిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహిం చారు. తొలుత పీసీసీ ఉపాధ్యక్షులు ఎంజే రత్నకుమార్, ప్రధాన కార్యదర్శులు మీసాల రాజేశ్వరరావు, నరహరిశెట్టి నరసింహారావు, అధికార ప్రతినిధి వి.గురునాథం, నిమ్మల జ్యోతిక తదితరులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం కార్యకర్తలు చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ, దళిత జాతికి సంజీవయ్య చేసిన కృషి మరువరానిదని కొనియాడారు.

కౌసల్య మృతికి రఘువీరారెడ్డి సంతాపం

కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తల్లి అంపోలు కౌసల్య (85) మృతికి పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కిల్లి కృపారాణి తల్లి కౌసల్య గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కౌసల్య మృతివార్త తెలియగానే కృపారాణిని రఘువీరారెడ్డి ఫోన్‌లో పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అజంతా, ఎల్లోరా, షిర్డీలకు పర్యాటక రైలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : భారత దర్శన్ పర్యాటక రైలు పేరుతో పార్లీ, ఔరంగాబాద్, అజంతా, ఎల్లోరా, షిర్డీ, త్రయంబకేశ్వర్ వంటి ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలకు వెళ్లి వచ్చేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ప్యాకేజీని రూపొందించినట్లు మేనేజర్ కె.మధుసూదనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ఈ నెల 23వ తేదీ తెల్లవారుజామున విజయవాడలో బయలుదేరి ఖమ్మం, వరంగల్, సికింద్రాబాద్, పార్లీ మీదుగా పలు ప్రదేశాలను చూపిస్తూ తిరిగి ఈ నెల 28వ తేదీకి చేరుకుంటుంది. ఈ యాత్రలలో ప్రయాణించే వారికి భోజన సదుపాయం, పర్యాటక ప్రదేశంలో నాన్‌ఏసీ వాహనంలో రోడ్డు ప్రయాణం, ఉండటానికి వసతి, టూర్ భద్రత, పర్యాటక బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇందులో ప్రయాణించే వారిని రెండు తరగతులుగా విభజించామని 1. స్లీపర్‌క్లాస్, 2. థర్డ్ ఏసీలుగా ఉన్నాయని, స్లీపర్ క్లాస్‌లో ఒక్కొక్కరికి రూ.5,945, థర్డ్ ఏసీలో రూ.7,205గా నిర్ణయించామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్లు- 9701360632, 9701360675, 0866-2572280లో సంప్రదించాలని కోరారు.

బందరులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : మచిలీపట్నం పురపాలక సంఘ పరిధిలో బాక్స్ టెండర్ల అంశం మళ్లీ తెరమీదకు వచ్చింది. మళ్లీ విజిలెన్స్ అధికారులు బుధవారం పురపాలక సంఘ కార్యాలయానికి రావడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తా యంటే అతిశయోక్తి కాదు. విజిలెన్సు తహశీల్దారు, ఏఈలు పురపాలక సంఘానికి రావడం, క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు పరిశీలించడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బాక్స్ టెండర్ల ప్రక్రియలో అత్యధిక భాగం పనులు చేజిక్కించుకుని సొమ్ము చేసుకున్న ఆ నలుగురు కాంట్రాక్టర్లలో అలజడి నెలకొంది. బాక్స్‌టెండర్ల పనులపై వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ అధికారులు గతేడాది నవంబరులో దాడులు చేసి ఫైల్సు తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అనూహ్యంగా సాక్షాత్తు ఒక ప్రజాప్రతినిధి నుంచి వచ్చిన స్పందనతో అక్రమార్కులు చల్లబడ్డారనే వాదనలు ఉన్నాయి. ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆ ప్రజాప్రతినిధి విజిలెన్స్ దాడులకు భయపడాల్సిందేమీ లేదని, అంతా నేను చూసు కుంటానని ప్రకటించడం అప్పట్లో పురపాలక సంఘ పరిధిలో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలి సిందే. అంతా చల్లబడిందనుకుంటున్న తరు ణంలో



రెండు నెలలు గడచిన తర్వాత మళ్లీ విజి లెన్సు అధికారులు రావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన!

బాక్సు టెండర్ల అంశానికి సంబంధించి విజిలెన్సు అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలనకు దిగారు. తరకటూరులో, 1,9 తదితర వార్డుల్లో జరిగిన పనులను పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విజిలెన్సు అధికారులు ఆయా పనులను పరిశీలించారు. విజిలెన్సు అధికారులకు మున్సిపాలిటీ ఇంజనీరింగు సిబ్బంది ఆయా పనులను చూపించారు. గతంలో విజిలెన్సు అధికారులు తీసుకువెళ్లిన ఫైల్సుకు సంబంధించిన పనులను పరిశీలించారు.

అవసరం ఉన్నా లేకున్నా...!

అసలు అవసరం ఉన్నా లేకున్నా లక్ష రూపాయల లోపు పనులకు టెండరు పిలవడం, బిల్లులు చెల్లిం చడం వంటి చర్యలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయని, ఏదో పని కింద బాక్సు టెండరు పిలవడం ఆ తర్వాత అనుకూల కాంట్రాక్టరుకు ఆ పనిని అప్పగించడం, ఆ తర్వాత బిల్లు చేయడం, ఆతర్వాత సొమ్ము చేసుకో వడం అనే రీతిలో పురపాలక సంఘంలో బాక్సు టెండరు ప్రక్రియ నడుస్తోందనే వాదనలు ఉన్నాయి. ఈ రీతిలో ప్రజాధనం పక్కదారి పడుతున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో గడచిన మూడు న్నర ఏళ్ల కాలంలో బాక్సు టెండర్ల ద్వారా లక్షలాది రూపాయల ప్రజాధనం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లిపోయిందని ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద 2014 నుంచి ఇప్పటి వరకు మచిలీపట్నం పురపాలక సంఘ పరిధిలో బాక్సు టెండర్ల ద్వారా 219 పనులు చేపట్టారు. వీటిలో అధిక శాతం పనులు నిధులు స్వాహా చేసేందుకేనని, ఆయా పనులు ఎక్కడ చేపట్టారో కనీసం ఆ వార్డు కౌన్సిలర్‌కు కూడా తెలియని పరిస్థితి అని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. ఇక విజిలెన్సు తనిఖీల నేపథ్యంలో బాక్సు టెండర్ల ప్రక్రియలో అవకతవకలు ఆగుతాయో లేదో వేచి చూడాల్సి ఉంది.

కరెంట్ షాక్‌తో సర్పంచ్ మృతి



విశాలాంధ్ర- అవనిగడ్డ : కృష్ణా జిల్లా అవని గడ్డ మండల పరిధి లోని దక్షిణచిరు వోల్లంక గ్రామ సర్పంచ్ సనకా రాంబాబు (54) కరెంట్‌షాక్‌తో మృతి చెందారు. బుధవారం ఉదయం యథావిధిగా మిరప తోటకు నీళ్ళు పెడదామని మోటారు స్విచ్ ఆన్ చెయ్యగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలారు. వెంటనే కుటుంబ సభ్యులు, చుట్టుప్రక్కల రైతులు ఆయనను హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆయనను పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. బంధువుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం శోకసంద్రంగా మారింది. విషయం తెలిసిన ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాంబా బుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామచంద్రపురం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో రాంబాబు పార్థివ దేహాన్ని ఊరేగింపుగా స్వగ్రామానికి తరలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కనకదుర్గ, కోడూరు, నాగాయలంక, అవనిగడ్డలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల మంజూరులో అవకతవకలు ?

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : ప్రభుత్వం పేద మహిళల కోసం ఎన్ని సంక్షేమ పథకాలు చేపట్టినా అవి కొద్దిమంది అవినీతి అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా అర్హత గల పేదలకు అందుబాటులోకి రావడంలేదు. మహిళలను లక్షాధికారులను చేయాలనే అధికారపార్టీ నేతల ఆశయాలకు తూట్లు పొడుస్తున్నట్లుగా డ్వాక్రా మహిళల కోసం ప్రభుత్వం కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తుంటే అవినీతి అధికారులు మాత్రం తమ పంథాను విడనాడడంలేదు. కృష్ణాజిల్లా మచిలీపట్నం పరిధిలో 3024 డ్వాక్రా గ్రూపులుండగా ఈ గ్రూపులకు రుణం మంజూరు కావాలంటే ప్రభుత్వంచే నియామకం పొందిన సీవోలను అంతిమంగా ప్రసన్నం చేసుకోవాల్సిందే. చేయి తడపనిదే కొంతమంది సీవోలు డ్వాక్రా సంఘ మహిళలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారనే విమర్శలు లేకపోలేదు. స్వయం సహాయక గ్రూపు సభ్యులు తొలుత తాము నిర్దేశించుకున్న యూనిట్‌ననుసరించి సమావేశం నిర్వహించుకుని తీర్మానం చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలను బ్యాంకు అధికారికి అందజేయవలసివుంటుంది. కొంతమంది మహిళల నిరక్షరాస్యత కారణంగా వీరి పత్రాలను క్రమబద్ధీకరించి నిర్దేశింపబడిన సంఘం అధ్యక్ష కార్యదర్శుల సంతకాలతో కూడిన రిజిస్టర్‌ను ప్రత్యేకంగా నియమింపబడిన మహిళ ద్వారా బ్యాంకు అధికారికి రుణం మంజూరు నిమిత్తం దాఖలు చేయాల్సివుంటుంది. ఈ ప్రత్యేకంగా నియమింపబడిన మహిళకు కూడా నిర్దేశిత వ్యయాన్ని ఖర్చుల నిమిత్తం కాకుండా రుణమంజూరులో పర్సంటేజి ప్రకారం ఈ డ్వాక్రా సంఘ సభ్యులు చెల్లించక తప్పడంలేదు. సంబంధిత బ్యాంకు అధికారి రుణమంజూరు ధ్రువీకరించుకుని వెలుగు కార్యాలయ అధికారి అనుమతి పొందేందుకు సభ్యులకు ఆ రికార్డును అందజేస్తారు. అంతిమంగా రుణం కోసం సేకరించబడిన రికార్డులపై సీవో సంతకం చేయాల్సివుంటుంది. అయితే ఏవిధమైన ప్రభుత్వపర ఉత్తర్వులు లేకపోయినప్పటికీ కొద్దిమంది సీవోలు మాత్రం ధనార్జనే ధ్యేయంగా అమాయక పేద డ్వాక్రా మహిళల రుణాల మంజూరుకు పర్సంటేజి రూపంలో అత్యధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా డ్వాక్రా రుణాల మంజూరులో ప్రభుత్వం ఉదాసీనతగా ఉన్నప్పటికీ అధికారుల వైఖరితో అవినీతి చెదలు వీడడంలేదు. సామాన్య భక్తులు కష్టాలు తీరేందుకు శ్రీనివాసుడిని ప్రసన్నం చేసుకున్నట్లే ఈ పేద డ్వాక్రా మహిళలు కూడా ఈ అక్రమ అధికారులు కోరిన నగదును ముట్టజెప్పనిదే రుణం మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. ప్రతి పేద డ్వాక్రా సంఘ 50వేల రూపాయల రుణ మంజూరుకు వెయ్యి రూపాయలు, లక్ష రూపాయలకు 2 వేలు మామూళ్ళను తిరుమల శ్రీనివాసుడికి సమర్పించుకున్నట్లేనని అవినీతి అధికారులనుద్దేశించి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముడుపులు చెల్లించనిదే రికార్డులపై సంతకాలు లేక బ్యాంకు రుణాలు మంజూరు కాని పరిస్థితి ఆ పేద మహిళలకు ఎదురవుతున్నది. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు బహిరంగ సమావేశాల్లో సైతం ఫిర్యాదులు చేసినప్పటికీ డ్వాక్రా మహిళల విన్నపాలు అరణ్యరోదనగా మారాయని మహిళలు మిన్నకుండిపోతున్నారు. మహిళా సంక్షేమమే ప్రధాన ధ్యేయమని ప్రకటనలు గుప్పించుకుంటున్న పాలకులు పావలా వడ్డీ రుణాల మాట దేవుడెరుగు, అవినీతి అధికారుల నుండి రక్షించండని కోరుకుంటున్నారు.

ఏ ప్రభుత్వం మారినా ఏ ఉన్నతాధికారి మారినా కుబేరుని తలపించే సంపాదన కోసం తాపత్రయపడుతున్న ఈ శ్రీనివాసులు మాత్రం తమ అక్రమ సంపాదన మార్గాన్ని విడనాడడంలేదు.



పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణికుల రద్దీని నివారించ డానికి హైదరాబాద్ - కాకి నాడ టౌన్, హైదరాబాద్ - తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్- కాకినాడ టౌన్ : రైలు నెంబర్ 07075గా ఈ నెల 16 తేదీన హైదరాబాద్‌లో సాయంత్రం 6.50 గంట లకు బయలుదేరి మరుసటి రోజు ఉద యం 5.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 07076గా ఈ నెల 18వ తేదీన కాకినాడ టౌన్‌లో సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది.

హైదరాబాద్ - తిరుపతి : రైలు నెంబర్ 02734 గా ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లో సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 02733గా ఈ నెల 18వ తేదీన తిరుపతిలో రాత్రి 7.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతుంది.

రంజిత్ బాషాకు ఐఏఎస్ హోదా



విశాలాంధ్ర-అమరావతి : ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఓఎస్‌డీగా పనిచేస్తున్న పి.రంజిత్ బాషాకు ఐఏఎస్ హోదా లభించింది. ఆయనతో పాటు మరో నలుగురికి కూడా ఐఏఎస్ హోదా కల్పిస్తూ బుధవారం జీఏడీ పొలిటికల్ కార్యదర్శి ఎస్.శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు.

రంజిత్ బాషా 2007 గ్రూప్1 బ్యాచ్ అధికారి. ఆర్డీవోగా కడప, గుడివాడల్లో, ఏజేసీగా నెల్లూరులో పనిచేశారు. గతేడాది నుంచి నారా లోకేష్ ఓఎస్‌డీగా వ్యవహరిస్తు న్నారు. రంజిత్ బాషాతో పాటు ఎం.వేణు గోపాల్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, ఎస్.ఢిల్లీరావు, ఎస్.ప్రభాకర్‌రెడ్డిలకు ఐఏఎస్ హోదా లభించింది.

నేడు పాక్షిక సూర్యగ్రహణం

హూస్టన్ : ఈ ఏడాది తొలి పాక్షిక సూర్య గ్రహణం గురువారం కనిపించనుంది. ఆరు నెలల్లో ఇది రెండో సూర్య గ్రహణం కావడం విశేషం. అయితే గత ఏడాది ఆగస్టు 21న సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడింది. అయితే భూమికి, సూర్యుడికి మధ్య కొంతమేర చంద్రుడు అడ్డుగా రావడంతో ఈ పాక్షిక సూర్యగ్రహణం సంభవించనుంది. భూమిపై చాలా కొద్ది దేశాల వారికి మాత్రమే దీనిని చూసే అవకాశం ఉంది. అంటార్కిటికా, దక్షిణ అమెరికాలోని దక్షిణ ప్రాంతంలో ఈ పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. ఉరుగ్వే, అర్జెంటీనా, చిలీ, పశ్చిమ పరాగ్వే, దక్షిణ బ్రెజిల్ వాసులు చూసే అవకాశం ఉంటుంది. గురువారం అంటార్కిటికా కాలమానం ప్రకారం ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల పాటు ఈ పాక్షిక సూర్యగ్రహణం ఉంటుంది. ఈ ఏడాది జులై 13, ఆగస్ట్ 11న మరో రెండు పాక్షిక సూర్య గ్రహణాలు సంభవించనున్నాయి. జులై 13న వచ్చే సూర్యగ్రహణాన్ని ఆస్ట్రేలియా, అంటార్కిటికా వాసులు చూసే అవకాశం ఉండగా, ఆగస్టు 11 పాక్షిక సూర్యగ్రహణాన్ని ఉత్తర ధృవం, ఉత్తర యూరప్, ఉత్తర, తూర్పు ఆసియా దేశాల వాసులకు చూసే అవకాశం ఉంటుంది.



బెల్టు షాపులతో కాపురాలు గుల్ల

జగన్‌తో మహిళల ఆవేదన

విశాలాంధ్ర, కలిగిరి : కూలీ పనులు చేసుకొని కూడబెట్టుకున్న సొమ్మును మద్యానికి తగలేస్తున్నారని మహిళలు జగన్ ముందు వాపోయారు. ఊరూరా బెల్టు షాపులతో మా కాపురాలు గుల్ల అవుతున్నాయని ఏకరువు పెట్టగా, మరి కొందరు మహిళలు రైతులుగా ఉన్న మేమంతా వర్షాభావ పరిస్థితులతో రైతుకూలీలుగా మారామని బాధను వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాగానే బెల్టు షాపులను నియంత్రిస్తామని, రైతు రాజ్యం నెలకొల్పుతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతిపక్షనేత, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ఉదయగిరి నియోజకవర్గంలో కలిగిరి మండలంలో నాలుగు రోజుల పాటు సాగిన 87వ రోజు పాదయాత్ర బుధవారంతో ముగిసింది. కలిగిరి శివారు నుంచి ప్రారంభమైన పాదయాత్ర క్రిష్టారెడ్డిపాలెం తెల్లపాడు క్రాస్ రోడ్డు చిన్నఅన్నలూరు వైపు సాగుతూ కొండాపురం మండలం జంగాలపల్లి శివారు వరకు సాగింది. ఉదయం 8 గంటలకు చేరుకున్న మహిళలు పాదయాత్ర శిబిరం వద్ద జగన్ మోహన్‌రెడ్డిని చూడటానికి పెద్దఎత్తున చేరుకున్న మహిళలను ఆప్యా యంగా పలుకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వాసురెడ్డి పద్మ, కావలి, ఆత్మకూరు, సూళ్ళూరుపేట, నెల్లూరుటౌన్ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మేకపాటి గౌతమ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, పోలుబోయిన అనీల్ కుమార్ యాదవ్, కోవూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, ఉదయగిరి ఇన్‌చార్జి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాలూరి మాల్యాద్రిరెడ్డి, కాటం రవీంద్రారెడ్డి, బండారు లక్ష్మీనారాయణ, హరిశ్చంద్రారెడ్డి, మెట్టుకూరి భాస్కర్‌రెడ్డి, హజరత్‌రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జగన్ పాదయాత్రలో అపశృతి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న కలిగిరి మండలంలోని తెల్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద బాణాసంచా పేల్చుతుండగా, పక్కనే ఉన్న మామిడి తోట కంచెకు అంటుకొని పాదయాత్రకు కొంత అంతరాయం కలిగింది. కలిగిరి పోలీసు సిబ్బంది సమయ స్ఫూర్తితో మంటలను అదుపు చేయడంతో పాదయాత్రను ముందుకు సాగించారు. వింజమూరు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం సంభవించలేదు.



నేడు ఏఐఎస్ఎఫ్

రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: విద్యార్థులకు పెండింగ్‌లో వున్న స్కాలర్‌షిపులు, ఫీజు రీయింబర్స్‌మెంటు సమస్యల పరిష్కారం కోసం గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆందోళనలు చేపట్టనుందని సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారావు, రంగన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో విద్యార్థులు భిక్షాటన, ధర్నా, నిరసనలు చేపట్టాలని వారు పిలుపునిచ్చారు.

16న గుంటూరులో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి

గుంటూరు మల్లయ్యనాగం భవన్‌లో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి సమావేశాన్ని నిర్వహించనున్నామని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ అఫ్సర్, ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సమితి నిర్మాణం, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చిస్తామని వివరించారు. రాష్ట్ర సమితి సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

'ఉపాధి'కి నిధులు ఇవ్వలేం..?

- సాఫ్ట్‌వేర్ మార్చని ఏపీ ప్రభుత్వం
- మెటీరియల్ పనులకు నిబంధనలు బేఖాతరు
- ఇతర పథకాలకు నిధుల తరలింపును గుర్తించిన కేంద్రం



విశాలాంధ్ర-అమరావతి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు తాము సూచించిన సాఫ్ట్‌వేర్‌నే వినియోగించాలని ఏపీ ప్రభుత్వానికి కేంద్రం పదేపదే చెబుతూ వచ్చింది. అయితే ఏపీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నుండి ఉపాధి హామీ పథకానికి నిధులు విడుదల చేయబోమంటూ కేంద్రం తేల్చి చెప్పినట్టు తెలుస్తోంది దేశంలోని అన్ని రాష్ట్రాలు కేంద్రం రూపొందించిన ఉపాధి హామీ వెబ్‌సైట్‌ను మాత్రమే వినియోగిస్తున్నాయి. ఏపీ మాత్రం టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌తో ఉపాధి పనులు నిర్వహిస్తోంది. ఈ విషయంలో కేంద్రం పలుమార్లు ఉపాధి నిధులపై యూసీలను ఇవ్వాల్సిందిగా కోరింది. కానీ ప్రభుత్వం ఉపాధి నిధులను వివిధ ప్రభుత్వ పథకాలకు వినియోగించుకున్నట్లు ఇటీవల కేంద్రం నుండి వచ్చిన బృందం గుర్తించినట్లు తెలుస్తోంది. ఉపాధి పథకం అమలు కోసం అన్ని రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాన్నే ఏపీ కూడా అవలంభించాలని కేంద్రం భావిస్తోంది. ఏపీలో టీసీఎస్ సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్న ఉపాధి పనుల సాఫ్ట్‌వేర్ మార్చాల్సిందిగా కేంద్ర ఉన్నతాధికారులు పలుమార్లు ఏపీ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. కానీ అలా జరగకపోవటంతో రానున్న ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ పోర్టల్‌లోనే ఉపాధి పనుల వివరాలను చేపట్టాల్సిందిగా కేంద్రం స్పష్టం చేసింది. నిధుల వినియోగంలో కేంద్రం పంపిన ప్రయోజనాలు కాకుండా రాష్ట్రంలోని ప్రాధాన్యత అంశాల ప్రకారం ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అంతేగాక కేంద్ర ప్రభుత్వ నిధులను ఉపయోగించుకొని వారి పేరును ఎక్కడా ప్రస్తావించకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకోవటంతో కేంద్రం ఈ పథకం నిధుల విడుదలకు ఆసక్తి చూపటం లేదు. ఇతర రాష్ట్రాల్లో లేని ఈ విధానం ఏపీలో ఉండటం ఆ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ఈ నిధులను ప్రభుత్వం ఇతర పనులకు వినియోగిస్తున్నట్లు వైసీపీ ఎంపీలు కేంద్రం దృష్టికి తీసుకెళ్ళారు. ఉపాధి హామీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ల వ్యవస్థను తీసుకువచ్చి మెటీరియల్ పనులకే 70 శాతం నిధులను వినియోగించటం, కూలీలకు 30 శాతమే వినియోగించటం పథకం లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా ఉందని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం 60:40 నిష్పత్తిలో వేతనాలు, మెటీరియల్ బిల్లులు చెల్లింపు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటికే ఏపీలోని కొన్ని జిల్లాల్లో 60:40 శాతం నిబంధనలు పాటించకుండా పనులు చేయటంతో కోట్ల రూపాయల నిధులు విడుదలకు నోచుకోలేదని సమాచారం.

నిర్దేశించిన శాతానికి అనుగుణంగా కూలీలకు చెల్లింపులు జరిగితేనే మెటీరియల్ బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఉపాధి నిధులు 50 శాతం, ఇతర నిధులు 50 శాతంతో పనులు చేసిన వారు ఇప్పటికే బిల్లులు విడుదల కాక మండల కార్యాలయాల చుట్టూ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు ఉన్న పరిస్థితి చెప్పలేక, వేతనాల చెల్లింపునకు సరిపడా కూలీలు హాజరుకాక నెట్టుకొస్తున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి బిల్లులు రాకపోవటంతో ద్వితీయశ్రేణి నాయకులు అధికార పార్టీ ఎమ్మెల్యేల వద్దకు, మంత్రుల వద్దకు చేరి ఒత్తిడి పెంచుతున్నారు. ఉపాధి హామీ సక్రమ అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తేనే ప్రజలకు మేలు చేకూరుతుంది.

మరో జగన్నాటకం : మంత్రి నారాయణ

విశాలాంధ్ర-అమరావతి: తెలుగు దేశం ఎంపీల పోరాటానికి కేంద్రం తలొగ్గుతుందనే భయంతోనే ఎంపీల రాజీనామా అంటూ జగన్నాటానికి తెరతీశారంటూ వైసీపీ నేతలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ విమర్శించారు. సచివాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలు తమ ఎంపీలు రాజీనామా చేస్తారంటూ ప్రతిపక్ష నేత జగన్ ప్రకటించి మిన్నకుండిపోయారన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించకపోవడంపై తమ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో నిరసన చేపట్టారన్నారు. టీడీపీ ఎంపీల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గి, పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, దీన్ని గమనించిన ప్రతిపక్ష వైసీపీ నేతలు ప్రజల్లో తమ ఉనికికి ప్రమాదం వాటిల్లుతుందనే భయంతో మరోసారి ఎంపీలు రాజీనామా చేస్తారంటూ నాటకానికి తెరతీశారన్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తరవాత ఏప్రిల్ 6న రాజీనామా చేయడం వల్ల ఒరిగిదేమీలేదని, అప్పుడు రాజీనామా చేస్తే, వాటికి ఆమోదం తెలిపేసరికి మరో రెండు నెలలు పడుతుందన్నారు. సాధారణ ఎన్నికలకు కొద్ది సమయమే ఉండడంతో, కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికల నిర్వహణకు ముందుకు రాదన్నారు. ఇదంతా తెలిసే ఈ రాజీనామా డ్రామాకు వైసీపీ నేతలు తెరతీశారన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ బాగుందని ఎంపీ విజయసాయిరెడ్డి ఎందుకు అన్నారని, జగన్ కూడా ఏనాడూ ఆ వ్యాఖ్యలను ఖండించలేదని మంత్రి నారాయణ గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు ఒత్తిడికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం ఏపీ డిమాండ్ల పరిష్కారానికి ముందుకొచ్చిందన్నారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే, తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ప్రత్యేక హోదాకు తాము వ్యతిరేకం కాదని, హోదా వల్ల కలిగే లాభాలను స్పెషల్ ప్యాకేజీ ద్వారా అందిస్తామని గతంలో చంద్రబాబుతో రాత్రి ఒంటి గంట వరకూ జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం చెప్పడం వల్లే తాము సరేనన్నామన్నారు. ముందుగా జరిగిన అపాయింట్ మెంట్ మేరకే ప్రముఖ పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ...సీఎం కలిశారని మంత్రి నారాయణ తెలిపారు. ఇందులో ఎటువంటి రాజకీయ కోణంలేదని ఆయన స్పష్టంచేశారు. ఆరోజు మిగిలిన మంత్రులెవ్వరూ అందుబాటులో లేకపోవడంతో, సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి లోకేష్ అనిల్ అంబానీతో సమావేశమయ్యారన్నారు.

'రామ్‌రాజ్ రథ్ యాత్ర'పై సీపీఎం ఆందోళన



న్యూఢిల్లీ : అయోధ్య నుంచి వీహెచ్‌పీ ప్రారంభించనున్న 'రామ్ రాజ్ రథ్ యాత్ర'పై సీపీఎం బుధవారం ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో మతపరమైన విభజనను ఇది ప్రేరేపిస్తుందని తెలిపింది. వీహెచ్‌పీ స్థానిక కార్యాలయం అయోధ్యలోని కరసేవక్ పురం నుంచి యాత్రను పార్టీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ప్రారంభిస్తారు. 41 రోజులపాటు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళల మీదుగా యాత్ర సాగి తమిళనాడులోని రామేశ్వరం చేరుకుంటుంది. రామరాజ్య పునరుద్ధరణ, అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో రామ మందిరం నిర్మాణమే ప్రధాన అజెండాగా వీహెచ్‌పీ ఇప్పటికే ప్రకటించిందని సీపీఎం పొలిట్‌బ్యూరో బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'రామ్ రాజ్ రథ్ యాత్ర' పట్ల సీపీఎం తీవ్ర ఆందోళన చెందుతుంది. ఆర్ఎస్ఎస్-బీజేపీలకు హిందూత్వ ఓటు బ్యాంకును పటిష్టం చేయడానికి, మతపరమైన విభజనకు ఇది ఒక దాహక శక్తిగా ఉంటుంది. మతపరమైన అల్లర్లు, హింస వంటివి చోటుచేసుకునే అవకాశం ఉంది' అని ఆ ప్రకటన పేర్కొంది. పాఠశాలల్లో రామాయణం బోధించడంతో సహా వారాంతపు సెలవును ఆదివారం స్థానంలో గురువారాన్ని 'జాతీయ హిందూ దినం'గా పాటించాలని కూడా యాత్ర నిర్వాహకులు ప్రకటించారని సీపీఎం వివరించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల ద్వారా కొనసాగే ఈ యాత్ర ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో 15 రోజులు ఉంటుందని, కేరళ నుంచి రామేశ్వరం చేరుకోనున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆ ప్రకటనలో సీపీఎం పేర్కొంది. శాంతికి, వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతం కలగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన శాంతి,భద్రత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఆర్ఎస్ఎస్, బీజేపీల మత సామరస్య విఘాత చర్యలను లౌకికవాదులు, శాంతి ప్రేమికులు బహిర్గతం చేయాలని పార్టీ పిలుపునిచ్చింది.

ఉగ్రవాదం పెరగడానికి

ప్రధాని నిర్లక్ష్య విధానాలే కారణం

కాంగ్రెస్ ఆరోపణ

న్యూఢిల్లీ : కాల్పుల విరమణ, ఉగ్రవాదం కేసులు ఒక్కసారిగా పెరగడానికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నిర్లక్ష్య, అస్థిర విదేశీ, రక్షణ విధానాలే కారణమని కాంగ్రెస్ పార్టీ బుధవారం ఆరోపించింది. జాతీయ భద్రత అంశంపై ప్రధాన మంత్రిపై విమర్శలు చేస్తూ, 2014 ఎన్నికల నేపథ్యంలో అప్పటి యూపీఏ ప్రభుత్వానికి మోడీ వేసిన ప్రశ్నలపై ఆయన నుంచి సమాధానాలను కాంగ్రెస్ డిమాండు చేసింది. దేశ భద్రత విషయంలో ప్రతిరోజూ రాజీ ధోరణి అవలంబిస్తోందని, ప్రభుత్వ నిష్క్రియాపరత్వం కొనసాగుతుండటం దురదృష్టకరమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ ఆరోపించారు. యూపీఏ హయాంలో 115 మంది సైనికులు, 72 మంది పౌరుల మరణంతో పోల్చితే మోడీ ప్రభుత్వం 44 నెలల పాలనలో 286 మంది సైనికులు, 138 మంది పౌరులు మరణించారని ఆయన తెలిపారు. మోడీ పాలనలో పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘన కేసుల సంఖ్య ఐదింతలు 2,555గా ఉండగా, యూపీఏ ప్రభుత్వం హయాంలో ఆ కేసుల సంఖ్య 543గా ఉన్నట్లు ఆయన వివరించారు. 'ఇది పూర్తిగా ప్రభుత్వ కపటత్వాన్ని, రెండు నాల్కల ధోరణిని చూపిస్తోంది' అని అన్నారు. 'ప్రధాని, ప్రభుత్వం, ఆ పార్టీ అధ్యక్షుడు నా ఐదు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. జాతీయవాదంపై మాకు పాఠాలు చెప్పడం కాదు' అని సింఘ్వీ తెలిపారు. మోడీ నిర్లక్ష్య విధానం సరిహద్దులో ఉద్రిక్తతలు సృష్టించిందని అన్నారు. ఎంతకాలం ఈ నిర్లక్ష్యం, అస్థిరత అని ప్రశ్నిస్తూ, ఏకపక్ష విదేశీ, రక్షణ విధానం దేశానికి చెందిన సాహస సైనికులకు అపాయం కలిగిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వంలో కట్టుదిట్టమైన భద్రత ఉంటే దేశంలోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశిస్తున్నారని, రక్షణ శిబిరాలపై దాడులు ఎలా జరుగుతున్నాయని సింఘ్వీ ప్రశ్నించారు. కాగా బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఉన్నపుడు కూడా మోడీ ఇవే ప్రశ్నలను సంధించారు.

నవంబరు నాటికి గ్రామాల్లో

10 లక్షల ఎల్‌ఈడీ లైట్లు : లోకేష్

విశాలాంధ్ర-అమరావతి : ఈ ఏడాది నవంబరు నాటికి 10 లక్షల ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు పూర్తి చేయాలని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆయన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎల్ ఈడీ లైట్ల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఈఈఎస్ఎల్ ద్వారా తూర్పు గోదావరి, చిత్తూరు, అనంతపురం, కడప, విజయనగరం జిల్లాలోని గ్రామాల్లో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు జరిగిందన్నారు. 5,237 గ్రామాల్లో ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 1,56,773 ఎల్‌ఈడీ లైట్లను ఈఈఎస్ఎల్ అమర్చిందని అధికారులు మంత్రికి తెలిపారు. 256 గ్రామ పంచాయతీల్లో నూటికి నూరు శాతం ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు పూర్తయిందని చెప్పారు. 1576 సీసీఎంఎస్ బాక్సుల ద్వారా అనుసంధానం చేశామన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుండి ప్రతి రోజు 10 వేల బల్బుల స్టాక్ అందుబాటులోకి రానుందని అప్పటి నుండి ప్రతి రోజు 10 వేల బల్బులు అమర్చే సామర్థ్యానికి చేరుకుంటా మని ఈఈఎస్ఎల్ ప్రతినిధులు తెలిపారు. ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటుకు గ్రామాల్లో కావాల్సిన థర్డ్ వైర్‌ను వెంటనే ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అంగీకరించిందని, మార్చి 15 లోపు అన్ని గ్రామాల్లో అవసరం ఉన్న చోట థర్డ్‌వైర్ ఏర్పాటు పూర్తి కావాలన్నారు. ఎస్సీ కాలనీల నుండే ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు ప్రారంభించాలని, ప్రతీ రోజు ఎన్ని లైట్లు వెలగడం లేదు, అందుకు గల కారణాలు రియల్ టైంలో తెలిసే విధంగా డ్యాష్ బోర్డ్‌కు సమాచారం అనుసంధానం చేసి వెంటనే సమస్య పరిష్కరించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.



నకి'లీలలు'..

- అర్హత లేకున్నా వైద్యశాలల ఏర్పాటు
- విజిలెన్స్ దాడులతో బట్టబయలు
- వైద్యశాల సీజ్– నకిలీ డాక్టర్ అరెస్టు

విశాలాంధ్ర-బ్యూరో కర్నూలు : డబ్బుకోసం అడ్డదారులు తొక్కుతూ అర్హత లేకున్నా మెడలో స్టెతస్కోప్ పెట్టి వైద్యుని అవతారం ఎత్తిన నకిలీ డాక్టర్ల గుట్టు రట్టయింది. అర్హత లేకుండా వైద్యశాలలు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టుచేసి వైద్యశాలను సీజ్ చేశారు. జిల్లాలోని సి గూడూరులో ఎటువంటి అర్హత లేకుండా 30 సంవత్సరాల నుంచి వైద్యం చేస్తూ పట్టుబడిన నకిలీ డాక్టర్ శ్రీరాములు ఘటన, ఆదోనిలో ఇంజనీరింగ్ చదివిన ఇరువురు వ్యక్తులు కర్నూలు ఆర్టీసి బస్టాండ్ ఎదుట వైద్యశాలలో డాక్టర్ల అవతారమెత్తిన ఘటనలు మరువక ముందే జిల్లాలో మరో ఇద్దరు నకిలీలు వైద్యుల బాగోతం బట్టబయలైంది. కర్నూలులోని కల్లూరులో ఉన్న సుఖీభవ వైద్యశాలను నాగప్రసాద్ నిర్వహిస్తున్నారు. నాగప్రకాష్ బీఎస్సీ బీఈడీ, ఎంఎస్ చదువుకున్నారు.

సులభంగా డబ్బు సంపాదించాలనే ఈ మార్గం ఎన్నుకుని వైద్యశాల, మెడికల్‌స్టోర్ ఏర్పాటుచేశారు. వైద్యశాల ఏర్పాటుచేసి యునాని వైద్యం చదువుకున్న డాక్టర్లతో అల్లోపతి వైద్యం చేయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఇది తెలుసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ జిల్లా అధికారి బాబూరావు ఆదేశాల మేరకు బుధవారం దాడులు చేసి కేసు నమోదు చేసి వైద్యశాలను సీజ్ చేశారు. ఎమ్మిగనూరు పట్టణంలోని శకుంతల సర్కిల్‌లో నకిలీ డాక్టర్లు నరహరిరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు నరహరి క్లినిక్ ఏర్పాటు చేశారు. ఇంటర్ చదువుకున్న తండ్రి కుమారులు మెడలో స్టెతస్కోప్ పెట్టి రోగులకు చికిత్స చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు నెలరోజుల నుంచి నాలుగుసార్లు వైద్యశాలకు పోయి రోగిలా నటించి వైద్యచికిత్స పొందుతూ నకిలీల గుట్టు తెలుసుకొని బుధవారం తండ్రి కొడుకులను అదుపులోకి తీసుకొన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ జగన్ మోహన్‌రెడ్డి, ఏడీ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్ఓ ఎంఎ ఖాన్ పాల్గొన్నారు.



వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మడం లేదు

మంత్రులు సోమిరెడ్డి, అచ్చెన్నాయుడు, ఆనందబాబు

విశాలాంధ్ర-అమరావతి : ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీ నేతలు ఢిల్లీలో రాజీ లేకుండా పోరాడుతున్నారు... కేంద్ర మంత్రులు, ప్రధాన మంత్రిపై ఒత్తిడి తీసుకొస్తున్నాం.. బీజేపీతో లాలూచీ పడి వైసీపీ నేత జగన్ టీడీపీని విమర్శిస్తున్నారు.. వైసీపీ డ్రామాలు ఎన్నాళ్ళు, ఎన్నిసార్లు రాజీనామాలు చేస్తామని బెదిరిస్తారంటూ రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అచ్చెనాయుడు, నక్కా ఆనందబాబులు ఎద్దేవా చేశారు. బుధవారం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఆ తర్వాత సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో మీడియాతో మాట్లాడారు. కేసులపై సీబీఐ, ఈడీలకు భయపడి గతంలో సోనియాగాంధీ కాళ్ళు పట్టుకున్న రోజులు గుర్తు లేవా.. ప్రత్యేక హోదా కోసం సుజనాచౌదరి పార్లమెంట్‌లో మాట్లాడితే కేంద్ర మంత్రి ఎలా అడుగుతారని విజయ్‌సాయిరెడ్డి నిలదీశారని, ప్రతిపక్షంలో ఉన్న నువ్వు ఇప్పటివరకు ప్రత్యేక హోదా కోసం ఎప్పుడైనా నోరు తెరిచావా అంటూ సోమిరెడ్డి జగన్‌ను ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీని కలిసి కేసులపై లాలూచీకి వచ్చావంటూ విమర్శించారు. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రత్యేక హోదా 5 ఏళ్లపాటు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇస్తానన్న ప్రత్యేక హోదా కోసం మేము నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.. ప్రత్యేక హోదా అడగలేని వైసీపీకి ప్రతిపక్ష హోదాలో ఉండే అర్హత లేదని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. అచ్చెనాయుడు మాట్లాడుతూ డ్రామాల నాయకుడు వైఎస్ జగన్ మరో డ్రామాకి తెరలేపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత జగన్ సీఎం పదవి కోరాడు. సోనియా గాంధీపై పోరాడి అనేక కేసుల్లో ఇరుకున్నది జగనే. మోడీకి భయపడాల్సిన అవసరం చంద్రబాబుకి ఏముందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో పొత్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. 2016న ప్రత్యేక హోదా ఇవ్వకపోతే రాజీనామాలు చేస్తామని జగన్ చెప్పాడు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్ని బడ్జెట్‌లు వెళ్లిపోయాయో జగన్‌కి తెలియదా అని అచ్చెనాయుడు అన్నారు. బీజేపీతో కలిసి పని చేస్తామని చెప్పేందుకు రాయబారం పంపే ధైర్యం కూడా వైసీపీకి లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వానికి పదవులు ముఖ్యం కాదు. మిత్ర ధర్మాన్ని కాపాడేలా మా ఎంపీలు పోరాటం చేస్తున్నారని తెలిపారు. మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ జగన్‌ది పసలేని పాదయాత్ర అని అన్నారు. అన్ని రాష్ట్రాలకన్నా ఏపీ అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. పార్లమెంట్‌లో ఆందోళన జరుగుతుంటే వైసీపీ ఎంపీలు పక్కకి వెళ్లిపోయారని, ఆ పార్టీ రాజీనామాలు ఎవ్వరూ కోరుకోవడం లేదన్నారు. విభజన చట్టం మన హక్కు. దానిని సాధించే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని చెప్పారు. జగన్ ఒక దోషి.. ఇప్పుడు బెయిల్‌పై తిరుగుతున్న వ్యక్తి అని అన్నారు.

'నేను సైతం'

- వినూత్న ఆలోచనలో పోషకాహార ప్రణాళికలు...
- రక్తహీనత రూపుమాపే సమగ్ర ఆహారం
- స్ఫూర్తిగా నిలుస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ

విశాలాంధ్ర అమరావతి : మహిళల్లో పౌష్టికాహార లోపం అధికంగా ఉన్నట్లు గుర్తించిన స్త్రీ,శిశుసంక్షేమ శాఖ దానిని అతిక్రమించేందుకు 'నేనుసైతం' పేరుతో దాతల సహకారాన్ని అందిపుచ్చుకుంటోంది. పోషకారం లోపం ఉన్నవారికి చేయూత ఇచ్చేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు , ప్రజాప్రతినిధులు ,ఇతరులు ఎవరైనా సరుకులు రూపంలో సహకారం అందించాలని వారు కోరుతున్నారు. పోషకారం అందిస్తే మహిళలు , గర్భిణీలు ,పిల్లలు ఆరోగ్యవంతులవుతారని డాక్టర్లు పేర్కొంటున్నారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు బెల్లం ,వేరుశనగ, రాగి పిండి , వంటి సరుకులు, రాగిపిండితో చేసిన జావ, ఇతర ప్రోటీన్లతో కూడిన చిరుధాన్యాలను అమర్చు కుంటున్నారు. వాటితో పోషకాహార లోపాన్ని ,రక్తహీనతని అధిగమించే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

ఇందుకోసం ముందుగా దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పౌష్టికాహారం లోపాన్ని అధిగమించాలనే ఆలోచనతో స్త్రీశిశుసంక్షేమ శాఖ విస్తృతంగా ధాన్యాలు సమకూర్చుకునే పనిలో ఉంది. పోషకాహార లోపం మహిళల్లో రక్తహీనతకు గురిచేస్తోంది. ఈ లోపంతో ఉన్న మహిళలకు పుట్టే పిల్లలు తక్కువ బరువుతో పుట్టటమే కాకుండా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఇప్పటికే పలు సర్వేలు ద్వారా గర్భిణీలకు 100 మిల్లీ లీటర్ల రక్తంలో హిమోగ్లోబిన్ 12 గ్రాముల కన్నా తక్కువ ఉన్నవారు 60 శాతం పైగా ఉన్నట్లు చెబుతున్నాయి. రాష్ట్రంలో 60 శాతం మహిళల్లో తీవ్ర రక్తహీనతలో ఉన్నారు. దీంతో ప్రతి లక్ష మందిలో 170 మంది ప్రసూతి మరణాల బారిన పడుతున్నట్లు గణాంకాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని 25 లక్షల మంది పిల్లల పెరుగుదలను పరిశీలించగా తీవ్ర పోషకాహార లోపం ఉన్నవారు 80,368 మంది, తీవ్రత స్థాయి తక్కువ ఉన్నవారు 1,39,051 మంది ఉన్నారు. వయసుకు తగ్గ బరువు లేని పిల్లలు 69,139 మంది ఉన్నట్లుగా లెక్క తేలింది. 25 లక్షల మందిలోనే గణాంకాలు ఇలా ఉంటే మిగిలిన వారిలో ఏ స్థాయిలో ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది.



నిధులు కొరత అధిగమించడానికే..

పోషకాహార లేమి పిల్లలు,రక్తహీనతకు గురైన మహిళలుకు ప్రస్తుతం అందిస్తున్న ఆహారానికి అదనపు పోషకాహారం అందిచాల్సి ఉంది. అయితే సర్కారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ 'నేను సైతం' అనే వినూత్న కార్యక్రమానికి నాంది పలికింది.


కదిలొస్తున్న దాతలు....

నేను సైతం కార్యక్రమానికి భారీ స్పందన వస్తోందని అధికారుల తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో సరుకులు అందించేందుకు ముందుకు రాగా, ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి సోదరడు కేఈ జయన్న కర్నూలు జిల్లాలో కృష్ణగిరి మండలంలో సరుకులు అందిస్తున్నారని వివరించారు. ప్యాపిలి మండలం , వెల్దుర్తి మండలం , అనంతపురం , విజయనగరం జిల్లాల్లో కూడా పలువురు ప్రజాప్రతినిధులు , స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తెలియ చేస్తున్నారు. దీంతో సర్కార్ నిధుల కోసం ఎదురు చూడకుండా మహిళలకు , పిల్లలకు పోషకాహారాన్ని అందించి ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మరింత మంది దాతలను సమీకరించి సమీకృత ఆహారాన్ని అందిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ వినూత్న ఆలోచన ఎన్నో శాఖలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

క్రీడలు

మాకిదో మంచి గుణపాఠం

దక్షిణాఫ్రికా కోచ్ ఒట్టిస్ గిబ్సన్



పోర్ట్ఎలిజబెత్: దక్షిణాఫ్రికా గడ్డపై టీమిండియా తిరుగులేని చరిత్రను లిఖించింది. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా 4-1 తేడాతో ఆధిక్యం సంపాదించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ప్రొటీస్‌పై 73 పరుగుల విజయం సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా కోచ్ ఒట్టిస్ గిబ్సన్ ఒకింత నిరాశకు గురయ్యాడు. తన వద్ద క్షమించమనడానికి కూడా కారణాలు లేవనీ, టీమిండియా అద్భుత ప్రదర్శన చేసిందని, తమకు మంచి గుణపాఠం నేర్పిందని వ్యాఖ్యానించాడు. 'ఏ టీం నుంచైనా ఫాంలో ఉన్న ఆటగాళ్లను తీసుకుంటే, ఇండియాలాంటి మంచి బలమైన ప్రత్యర్థి దొరికనప్పుడు వారిలోని డొల్లతనం బయటపడుతుంది. ఇదే విషయాన్ని మా వాళ్లకు డ్రస్సింగ్ రూంలో చెప్పా. క్షమించరాని పొరపాటు జరిగింది. వచ్చే మ్యాచ్‌లో మరింత సమర్థంగా ఆడేందుకు ప్రయత్నిస్తాం. టీమిండియా నుంచి మంచి గుణపాఠం నేర్చుకున్నాం. మమ్మల్ని మేం నిందించుకోవడం లేదు' అని మ్యాచ్ అనంతరం గిబ్సన్ వ్యాఖ్యానించాడు. 'మేం ప్రపంచ్ కప్‌పైనే దృష్టిపెట్టామన్న విషయం నాకు తెలుసు. మంగళవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లోలాగా వరల్డ్ కప్‌కు వెళ్లే టీం ఉండదని నేను ఖచ్చితంగా హామీ ఇస్తున్నాను. ఈ సందర్భంగా మణికట్టు మాంత్రికులు కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్‌కు నా అభినందనలు. భారత్‌కు వీరిద్దరి రూపంలో వరల్డ్‌క్లాస్ స్పిన్నర్లు దొరికారు. అయితే వీరితో వరల్డ్ కప్ జరిగే ఇంగ్లండ్‌లో ఎలాంటి లాభం ఉండదు' అని పేర్కొన్నాడు. సిరీస్ మొత్తంమీద తమ బ్యాట్స్‌మెన్ కీలక సమయాల్లో చేతులెత్తేశారని గిబ్సన్ పేర్కొన్నాడు. మరీ ముఖ్యంగా ఐదో వన్డేలో ఇది మరింత స్పష్టంగా కనబడిందన్నాడు. '270 పరుగులకు టీమిండియాను కట్టడి చేయగలిగామంటే.. అది కచ్చితంగా బౌలర్ల ప్రతిభే. అయితే బ్యాట్స్‌మెన్ నుంచి ఎలాంటి సహకారం అందలేదు. పరిస్థితులకు ఆకళింపు చేసుకుని, అందుకు అనుగుణంగా మ్యాచ్‌ను ఆడే వాళ్లన్నారు. కానీ వారు అంచనాలకు తగ్గట్లుగా ఆడలేదు. నిరాశ పరిచారు. కొంచెం బాగా ఆడుంటే కచ్చితంగా ఈ వన్డే గెలిచేవాళ్లం' అని వివరించాడు. అయితే కేవలం నాలుగు నుంచి ఐదు మ్యాచ్‌ల అనుభవం ఉన్న తాత్కాలిక కెప్టెన్ మార్క్‌రమ్‌ను ఈ సందర్భంగా నిందించలేమని గిబ్సన్ స్పష్టం చేశాడు.



రబాదకు జరిమానా..!

పోర్ట్ఎలిజబెత్: దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబాదకు మ్యాచ్ రిఫరీ జరిమానా విధించారు. భారత్‌తో జరిగిన ఐదో వన్డే మ్యాచ్‌లో శిఖర్ ధావన్ ఔటైన సమయంలో అభ్యంతకరంగా సెండ్ ఆఫ్ సిగ్నల్స్‌కు ఇచ్చినందుకు అతని మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. అలాగే ఒక డీమెరిట్ పాయింట్ అతని ఖాతాలో జమైంది. ఇప్పటికే రబాద డీమెరిట్ పాయింట్ల సంఖ్య ఐదుకు చేరుకుంది. డీమెరిట్ పాయింట్లు 4కు చేరితే ఓ మ్యాచ్ సస్పెన్షన్ విధిస్తారు. రబాద ఇప్పటికే ఒక టెస్టు మ్యాచ్ నిషేధం ఎదుర్కొన్నాడు. 2019, ఫిబ్రవరి లోపు డీమెరిట్ పాయింట్లు 8కి చేరితే రెండు టెస్టు మ్యాచ్‌ల నిషేధం కానీ, ఒక టెస్టు లేదా రెండు వన్డేలు/టీ20 లేదా నాలుగు వన్డేలు/టీ20ల నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుంది. రబాద తన నేరాన్ని మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ముందు ఒప్పుకున్నాడు. ధావన్ ఔటైనపుడు రబాద అతని వైపు చూస్తూ చేతులు ఊపుతూ పెవిలియన్ వెళ్లాలని చూపించినట్లు వీడియో ఉంది.

ఏప్రిల్ 4 నుంచి కామన్వెల్త్ క్రీడలు

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఏప్రిల్ 4న కామన్వెల్త్ క్రీడల ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలయ్యాయి. అంతేకాదండోయ్ ఆ ఏర్పాట్లలో తప్పిదాలు కూడా జరిగిపోయాయి. ప్రారంభోత్సవ వేడుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు అభిమానుల కోసం పెద్ద సంఖ్యలో టికెట్ల ప్రింటింగ్ మొదలుపెట్టారు. సుమారు 14వేల టికెట్లు కూడా ప్రింట్ అయ్యాయి. అయితే టికెట్లో బుధవారానికి బదులు గురువారం అని ప్రింట్ అయ్యిందని గుర్తించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే మాత్రం లాభం ఉంటుందా చెప్పండి. అసలే క్రీడల నిర్వహణ భారీ ఖర్చుతో కూడుకున్నది. ఇప్పుడు ఈ తప్పిదంతో టిక్కెట్లను మరోసారి ప్రింట్ చేయాలంటే ఆ భారం ఎక్కువవుతుంది. దీంతో వారు ఆ టిక్కెట్లను అలాగే అమ్మాలని సూచించారట. 'ఈ తప్పిదం ఎవరూ కావాలని చేయలేదు. అనుకోకుండా జరిగింది' అని ఆస్ట్రేలియా నిర్వాహకులు తెలిపారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం ఏప్రిల్ 4న అందుబాటులో ఉన్న టికెట్లతోపాటు వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, ట్రయల్‌థాన్‌కు సంబంధించిన టికెట్లలో మ్యాచ్ వేళలను తప్పుగా ప్రచురించినట్లు సమాచారం. ఏప్రిల్ 4 నుంచి 15 వరకు ఆస్ట్రేలియాలో కామన్వెల్త్ క్రీడలు జరగనున్నాయి. దేశ విదేశాల నుంచి వేలాది మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.

ఈ విజయం గొప్పది : సీకే ఖన్నా



ముంబై: టీమిండియా ఆరు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 4-1తో సొంతం చేసుకుంది. పోర్ట్ఎలిజబెత్‌లో మంగళవారం ఇండియా-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఐదో వన్డేలో భారత్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంపై బీసీసీఐ తాత్కలిక అధ్యక్షుడు సీకే ఖన్నా క్రికెటర్లను పొగడ్తలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజయం చాలా గొప్పది అని అన్నారు. 'ఇండియా సారథి విరాట్ కోహ్లి, మిగతా ఆటగాళ్ల అసాధారణమైన ప్రదర్శన కనబర్చారు. ఏ జట్టునైనా వారి స్వదేశంలో ఓడించే సామర్థ్యం ఇండియా జట్టుకు ఉందని ఈ విజయంతో నిరూపించారు. 25 సంవత్సరాల తర్వాత వారు భారత్‌కు సిరీస్ సాధించడం దేశానికి గర్వకారణం' అని సీకే ఖన్నా ఇండియా క్రికెటర్లను కొనియాడారు. ఈ విజయంతో సిరీస్ సొంతం చేసుకున్న భారత్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

చివరి వన్డేలో మార్పులు..?

పోర్ట్ఎలిజబెత్: మరో మ్యాచ్ మిగిలి ఉండగానే వన్డే సిరీస్ కైవసం చేసుకున్న భారత్ సంబరాల్లో మునిగి తేలుతోంది. దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్ కైవసం చేసుకున్న కోహ్లిసేన చివరి వన్డేలో మార్పులతో బరిలోకి దిగనుంది. నామమాత్రమైన చివరి వన్డే శుక్రవారం సెంచూరియన్‌లో జరగనుంది. ఇప్పటి వరకు బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లను ఈ వన్డే ద్వారా అవకాశం కల్పించాలని కోహ్లి భావిస్తున్నాడు. ఆరు వన్డేల సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకున్న కోహ్లి ప్రస్తుత జట్టులోని పలువురు ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించి ఇప్పటి వరకు బెంచ్‌కే పరిమితమైన మిగతా ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నాడు. సెంచూరియన్ వన్డేలో ఏ ఆటగాడి స్థానంలో ఎవరు తుది జట్టులో స్థానం దక్కించుకుంటారో తెలియాలంటే శుక్రవారం వరకు వేచి ఉండక తప్పదు. ఇరు జట్ల మధ్య మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ 18న ప్రారంభంకానుంది.

తల్లిదండ్రులపై కబడ్డీ ప్లేయర్ ఫిర్యాదు



హర్యానా: జాతీయ స్థాయి మహిళ కబడ్డీ ప్లేయర్ హర్యానా మహిళ కమిషన్‌ను కలిసింది. ఆమె రోహ్‌తక్ జిల్లా నుంచి ఎంపిక అయ్యింది. తన తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తున్నారని మహిళ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. 'పెళ్లికి నేను నిరాకరించాను. అందుకే వారు నన్ను ఒక గదిలో పెట్టి బీగం వేశారు. నా చదువును, ఆటలను ఇంకా కొనసాగించాలని ఉంది' అని ఆమె మహిళ కమిషన్ ముందు తన బాధలను తెలిపింది.

అలా.. అయితే..ఫామ్‌లో లేనట్లేనా..?

విలేకరులపై రోహిత్ శర్మ ఆగ్రహం



పోర్ట్ఎలిజబెత్: ఆతిథ్య దక్షిణాఫ్రికాతో ఆడిన మొదటి నాలుగు వన్డేల్లో రోహిత్ శర్మ స్కోరు 40. పోర్ట్ఎలిజబెత్‌లో మంగళవారం జరిగిన వన్డేలో 115 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం రోహిత్ మీడియాతో మాట్లాడుతూ.. 'మూడు మ్యాచుల్లో నేను సరిగా ఆడలేదు. దీన్ని బట్టే నేను ఫామ్ కోల్పోయానని ఎలా అంచనాకు వచ్చేస్తారు?. ఏ ఆటగాడైనా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైతే ఫామ్‌లో లేదని ఎలా అంటారు?' అని విలేకరులపై రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'మొదటి మూడు మ్యాచ్‌ల్లో రాణించలేక పోయా. ఈ విషయాన్ని నేను అంగీకరిస్తా. నెట్స్‌లో బాగానే బ్యాటింగ్ చేసేవాడిని. ప్రతి క్రీడాకారుడు ఏదో ఒక సమయంలో ఇలాంటి సమస్య ఎదుర్కొంటాడు. ఆటలో ఇలాంటివన్ని సహజం. ఇలాంటి సవాళ్లు ఎదురైతేనే మనం ఇంకా ఎక్కువ కష్టపడతాం. నేను కూడా అంతే. ఏ రోజూ కుమిలిపోలేదు. ఒక్క అడు గు వెనక్కి వేసి.. ఇలా ఎందుకు జరుగుతోందని ఆలోచించా. తర్వాతి గేమ్‌లో అలా జరగకుండా జాగ్రత్తగా ఆడాలని నాకు నేనే సర్దిచెప్పు కున్నా' అని రోహిత్ తెలిపాడు. అనంతరం తాను సాధించిన శతకం గురించి మాట్లాడుతూ.. ఇప్పుడు నా శతకం పాతదైపోయింది. తదుపరి మ్యాచ్ పైనే దృష్టి అంతా. వీలైనన్ని ఎక్కువ పరు గులు సాధించి జట్టు స్కోరు పెంచాలి. ఇప్పటికే 4-1తో సిరీస్‌ను కైవసం చేసు కున్నాం. 5-1 తేడాతో సిరీస్‌ను దక్కించు కునేందుకు ప్రయత్నిస్తామని వివరించాడు.

అప్పటికల్లా కోలుకుంటా : సానియా




న్యూఢిల్లీ: కుడి మోకాలి గాయం వల్ల అక్టోబర్ నుంచి ఆటకు దూరమైన భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరో మూడు నెలల్లో రాకెట్ పట్టుకునే అవకాశం ఉంది. మే నెలాఖర్లో జరిగే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకల్లా కోలుకుంటానని ఈ హైదరాబాద్ క్రీడాకారిణి ఆశాభావంతో ఉంది. మహిళల టెన్నిస్‌ను సెరెనా సహా ఏ ఒక్కరూ ఎక్కువ కాలం శాసించలేరని చెప్పింది. యువ ప్రతిభావంతులు టాప్ ర్యాంకర్లను కంగుతినిపిస్తున్న సంగతి మరవొద్దని సూచించింది. ఫెడ్ కప్ టీమ్ టోర్నమెంట్‌లో భారత యువతార అంకితా రైనా ప్రదర్శన అద్భుతంగా ఉందని సానియా కితాబిచ్చింది. 'ఫెడ్‌కప్‌లో ఈసారి యువ క్రీడాకారిణుల పోరాటపటిమ ఆకట్టు కుంది. కానీ తదుపరి దశకు చేరకపోవడమే నిరాశను కలిగిస్తోంది. ఆ వెలితి ఇంకా కొనసాగుతోంది' అని హైదరాబాదీ స్టార్ చెప్పింది. ఫెడ్‌కప్‌లో అంకిత ఆటతీరు అసాధారణమని పేర్కొంది. తనకన్నా ఎంతో మెరుగైనా, టాప్-100 ర్యాంకర్లను ఆమె కంగుతినిపించిన తీరు గొప్ప పురోగతి అని ప్రశంసిం చింది. అంకితను తదుపరి భావి సానియాగా భావించవచ్చా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ... చాన్నాళ్లుగా ఎంతో మంది ఈ ప్రశ్న అడుగుతున్నారు. అయితే వీళ్లందరికీ చెబుతున్నా... ఎందుకు మనం సానియా దగ్గరే ఆగిపోవాలి. నన్ను మించి మేటి క్రీడాకారిణిగా ఎదగాలని ఆశిద్దాం' అని తెలిపింది.



చంద్రబాబుతో లక్ష్మణ్ భేటీ

అమరావతి: భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సచివాలయంలోని సీఎంవోలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. క్రీడలకు, క్రీడాకారులకు ముఖ్యమంత్రి ఇస్తున్న ప్రోత్సాహాన్ని లక్ష్మణ్ అభినందించారు. గతంలోనూ అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా అకాడమీలు రాష్ట్రంలో ఏర్పాటయ్యేలా ముఖ్యమంత్రి కృషి చేశారని గుర్తు చేశారు. క్రికెట్ భవిష్యత్ దృష్ట్యా యువ క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అమరావతిలో అకాడమీ ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు.

సెప్టెంబరులో స్మిత్ పెళ్లి




సిడ్నీ: ఈ ఏడాది సెప్టెంబరులో మరో క్రికెటర్ పెళ్లిపీటలెక్క బోతున్నాడు. అతడే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు సారథి స్టీవ్ స్మిత్. గత ఏడాది జూన్ 29న న్యూయార్క్‌లో ఓ ఎత్తైన భవనంపై నుంచి తన గర్ల్‌ఫ్రెండ్ డేని విల్స్‌కు తన ప్రేమను వ్యక్తం చేసిన స్మిత్ ఈ ఏడాది పెళ్లితో ఒక్కటవ్వ బోతున్నారు. ప్రేయసితో ఎంగేజ్‌మెంట్ అయినట్లు అప్పట్లో స్మిత్ తన ఇన్‌స్టాగ్రాం ద్వారా అభిమానులతో పంచుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ జంట అడపదడపా కనిపిస్తూనే ఉంది. తాజాగా ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు అలెన్ బోర్డర్ పతకాల ప్రదానోత్సవ కార్యక్రమానికి వీరిద్దరూ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మీ పెళ్లి ఎప్పుడు అని విల్స్‌ను ప్రశ్నించగా.. సెప్టెంబరులో అని జవాబిచ్చింది. 'అంతర్జాతీయ మ్యాచ్‌లతో స్మిత్ బిజీగా ఉన్నాడు. సెప్టెంబరులో కాస్త విరామం దొరకడంతో అప్పుడే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం' అని విల్స్ తెలిపింది. 2011-12 బిగ్‌బాష్ లీగ్ సీజన్ జరిగే సమయంలో ఓ బార్‌లో స్మిత్ తొలిసారి విల్స్‌ను కలిశాడు.

అది నేను కాదు : లీ చాంగ్ వై



కౌలాలంపూర్: మలేషియా బ్యాడ్మింటన్ ఆటగాళ్లు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. తాజాగా మూడుసార్లు ఒలింపిక్ పతక విజేత లీ చాంగ్ వైకు సంబంధించిన ఓ సెక్స్ వీడియో ప్రస్తుతం నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియో తీవ్ర దుమారం లేపింది. దీనిపై లీ చాంగ్ పోలీసులను ఆశ్రయించాడు. అనంతరం మీడియాకు ఆ వీడియోలో ఉంది తాను కాదని స్పష్టం చేశాడు. కొద్ది రోజులుగా ఓ సెక్స్ వీడియో నెట్టింట్లో వైరల్‌గా మారింది. అందులో ఉన్న వ్యక్తి లీ చాంగ్‌ను పోలి ఉన్నాడు. దీంతో అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన లీ చాంగ్ మంగళవారం పోలీసులను ఆశ్రయించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరో ఇదంతా కావాలనే చేశారని, వారిని అదుపులోకి తీసుకుని శిక్షించాలని చాంగ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం చాంగ్ మీడియాతో మాట్లాడాడు. 'ఆ వీడియోలో ఉంది నేను కాదు. అందులో ఉన్న వాయిస్ కూడా నాది కాదు. నేనంటే ఎవరో గిట్టని వారు ఇదంతా చేశారు. నా పేరు ప్రతిష్టలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. వీడియోను జాగ్రత్తగా పరిశీలిస్తే అందులో ఉన్నది నేను కాదని మీకు తెలుస్తోంది. ఈ వీడియో చూసి చాలా మంది నాకు ఫోన్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాను కాబట్టి ఇక దీని గురించి ఆలోచించను. నా సమయం వృథా చేసుకోను' అని చెప్పాడు. అలాగే తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా తనకు ఆ వీడియోకు ఎలాంటి సంబంధం లేదని చాంగ్ అభిమానులకు తెలిపాడు. ఇద్దరు మలేషియా ఆటగాళ్లు గత ఏడాది మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని వారిపై జీవితకాల నిషేధం విధించాలని ఇప్పటికే బీడబ్ల్యూఎఫ్(బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్) బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ మలేషియాకు లేఖ రాసింది.

కేంద్ర మాజీ మంత్రి 'బోళ్ల' కన్నుమూత



విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, టీడీపీ సీనియర్ నాయకుడు బోళ్ల బుల్లిరామయ్య(91) బుధవారం తణుకులో కన్నుమూశారు. కొంత కాలం నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బోళ్ల ఆంధ్రా షుగర్స్ స్థాపనకు విశేషంగా కృషి చేశారు. 1953 నుంచి వివిధ హోదాల్లో పని చేస్తూ 1984లో ఎన్టీఆర్ హయాంలో 8వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. నాలుగుసార్లు ఎంపీగా పని చేసిన బోళ్ల 1996-98 మధ్య ఎన్డీయే ప్రభుత్వంలో 22 నెలల పాటు కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రిగా పని చేశారు. ఆయన భార్య వెంకట రమణమ్మ కొన్నేళ్ల క్రితం మరణించారు. బోళ్లకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1926 జూలై 9న తూర్పు గోదావరి జిల్లా తాటిపాకలో పీఎస్ఆర్‌వీకే రంగారావు, అచ్చాయమ్మ దంప తులకు ద్వితీయ సంతానంగా బోళ్ల బుల్లిరామయ్య జన్మించారు. ఆంధ్రా వర్సిటీ నుంచి షుగర్ టెక్నాలజీ కోర్సులో బీఎస్సీ ఆనర్స్, కెమికల్ టెక్నాలజీ కోర్సులో ఎంఎస్సీ పట్టాలను పొందారు. అనంతరం అమెరికాలో ఎంఎస్సీ కెమికల్ ఇంజనీరింగ్ చదివారు. ఇస్రోకు ద్రవరూప రాకెట్ ఇంధ నాన్ని అందించేందుకు ఆంధ్రా షుగర్స్ సంస్థ నెలకొల్పిన యూడీఎంహెచ్, ఎంఎంహెచ్ ప్లాంట్ స్థాపనకు సారథ్యం వహించారు. జిల్లా రాజకీయాల్లో రెండు దశాబ్దాలుగా బోళ్ల ఎన్నికల్లో గెలుపోటములు, రాజకీయ భిన్నాభిప్రాయాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. వివాద రహితుడుగా, సౌమ్యుడిగా, స్నేహశీలిగా ఆయన పేరుపొందారు. 1984లో ఏలూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేయడం ద్వారా బోళ్ల రాజకీయ ప్ర స్థానం ప్రారంభమైంది. 1998 లో 12వ లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలై 13వ లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. ఎంపీ ల్యాడ్స్ కమిటీగా చైర్మన్‌గా నిధుల వినియోగ సమస్యలకు పరిష్కారమార్గం చూపారు. 1999-2004 మధ్య కాలంలో జిల్లాలో సుమారు రూ.1200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టారు.

పదవులకు వన్నె తెచ్చారు : చంద్రబాబు

కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య ఎంతో సేవలందించి ఆయన చేపట్టిన పదవులకు వన్నె తెచ్చారని రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం తణుకు వచ్చి, బోళ్ల పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రులు పైడికొండల మాణిక్యాలరావు, పితాని సత్యనారాయణ, కె.ఎస్.జవహర్, ఎంపీలు మాగంటి బాబు, తోట సీతారామలక్ష్మి, గోకరాజు గంగరాజు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

ఏఐటీయూసీ ఆఫీస్‌కు వాటర్ కూలర్

బహూకరించిన చలసాని అజయ్‌ఘోష్



విశాలాంధ్ర బ్యూరో-విజయవాడ: గొల్లపూడిలో నూతనంగా నిర్మించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు కుమారుడు చలసాని అజయ్‌గోష్ 10 వేల రూపాయల విలువ గల వాటర్ కూలర్‌ను విరాళంగా బహుకరించారు. అజయ్‌గోష్ డిసెంబరులో బిట్స్ బిలానీలో బయో టెక్నాలజీలో డాక్టరేట్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యాలయానికి వాటర్ కూలర్‌ను బహుకరించారు. ఈ వాటర్ కూలర్‌ను బుధవారం ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ ప్రారంభించారు. కార్మికుల సమస్యలపై నిరంతరం శ్రమిస్తున్న ఏఐటీయూసీ శ్రేణులకు, వివిధ రంగాల కార్మికుల సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్ర కార్యాలయానికి వచ్చే కార్మిక నాయకులు, కార్మికుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడే వాటర్ కూలర్‌ను అందజేసిన అజయ్‌ఘోష్‌ను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య అభినందించారు. శ్రామిక మహిళాఫోరం నాయకురాలు కె.శైలజ, మిసపట్ల సురేష్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.